ninadamnews.com

తెలుగు దినపత్రిక

# నినాదం

నిఖార్సైన జర్నలిజం

శనివారం, ఆగస్టు 8, 2026 | సంపుటి - 22 | సంచిక 311 | వెల - 7 | పేజీలు - 12 - 8

Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam

## ఐఏఎస్ సందీప్ కేసు విచారణలో హైకోర్టు సీరియస్

**హైదరాబాద్, ఆగస్టు 7(నినాదం):**

కోర్ట్ ధిక్కరణ వ్యవహారంలో తెలంగాణ ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా హైకోర్టు ముందు వ్యక్తిగతంగా విచారణకు హాజరయ్యారు. కేసు విచారణ సందర్భంగా హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సందీప్ సుల్తానియాపై వెయ్యి కేసులు ఉన్నాయని.. అవన్నీ విచారణ చేస్తే జీవిత కాలం జైల్లో ఉండాలని పేర్కొంది. ప్రభుత్వాలు చేసిన తప్పుకు అధికారులకు ఈ పరిస్థితి వచ్చిందన్నారు. అధికారులను హైకోర్టుకు పిలిపించడం బాధగా ఉందని.. తప్పని పరిస్థితుల్లో హాజరుకావాలని ఆదేశిస్తున్నామని న్యాయస్థానం తెలిపింది. ఉచిత పథకాల వల్ల చాలా ప్రమాదం ఉందని.. రైతుబంధు అనేది సంపన్నులు, అధికారులు కూడా తీసుకుంటున్నారని.. ఇది చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేసింది. రైతుబంధుతో రాష్ట్ర ఖజానాకు భారమని హైకోర్టు వ్యాఖ్యానించింది.





# ఆయిల్‌పాం పంటలతో రైతులకు అధిక ఆదాయం

- ఎల్‌నినో పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలి
- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి రైతులకు విజ్ఞప్తి

**వనపర్తి ప్రతినిధి, ఆగస్టు 7 (నినాదం):** జిల్లాలో ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులు వరికి బదులుగా ఆయిల్‌పామ్ పంటలు వేసి అధిక ఆదాయాన్ని సంపాదించుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం గోపాల్‌పేట మండలంలోని తాడిపర్తి గ్రామానికి చెందిన రైతు భాను జిల్లా ఉద్యాన శాఖ సహకారంతో తన పొలంలో ఆయిల్‌పామ్ మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో రైతు పొలంలో ఆయిల్ పామ్ మొక్కల నాటే కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హాజరయ్యారు. అనంతరం కలెక్టర్ ఆయిల్ పామ్ మొక్కను నాటి నీరు పోసి రైతు భానుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రైతుతో మాట్లాడి ఎంత విస్తీర్ణంలో ఆయిల్‌పామ్ సాగు చేపడుతున్నారని, నీటి వసతి ఎలా ఉందని, సాగుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తయ్యాయా అని అడిగి తెలుసుకున్నారు. మొత్తం నాలుగు ఎకరాల్లో ఆయిల్ పామ్ చేపడుతున్నట్లు, బోర్ నీటి ద్వారా సాగు చేయనున్నట్లు రైతు బదులిచారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా నీటి లభ్యతకు అనుగుణంగా రైతులు ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవడం అవసరమని తెలిపారు. ఆయిల్‌పామ్ రైతులకు దీర్ఘకాలికంగా అధిక ఆదాయాన్ని అందించే వాణిజ్య పంట అని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, సాంకేతిక సూచనలను రైతులు సద్వినియోగం చేసుకొని ఆయిల్‌పామ్ సాగును విస్తరించాలని సూచించారు. వ్యవసాయ అధికారులు గ్రామాల వారీగా రైతులకు అవగాహన కల్పిస్తూ ఆయిల్‌పామ్ సాగును మరింత ప్రోత్సహించాలని ఆదేశించారు. అలాగే ఆయిల్‌పామ్ సాగు చేపట్టిన రైతు భానును అభినందించిన కలెక్టర్ తన అనుభవాలను ఇతర రైతులతో పంచుకుంటూ




ఆయిల్‌పామ్ సాగు వల్ల కలిగే ప్రయోజనాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. మరింత మంది రైతులు ఆయిల్‌పామ్ సాగు వైపు అడుగులు వేసేలా ప్రోత్సహించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా రైతులు తమ వ్యవసాయ భూములకు వెళ్లే రహదారి సౌకర్యం కల్పించాలని కలెక్టర్‌ను కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ బీవీజీ రామ్‌జీ పథకం కింద వ్యవసాయ రహదారి నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి చర్యలు చేపట్టాలని సంబంధిత ఎంపీడీవోను ఆదేశించారు. రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు అధికారులు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. డీ వై ఎస్ ఓ సుధీర్ రెడ్డి, డీ హెచ్ ఎస్ ఓ విజయ్ భాస్కర్, తహసీల్దార్, ఎంపీడీఓ, సర్పంచ్ లోకా రెడ్డి, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# 99.95% డిజిటలైజేషన్ పూర్తి

- పారదర్శక ఓటర్ జాబితా రూపొందించటమే ప్రధానం
- జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్

**నల్లగొండ ప్రతినిధి ఆగస్టు 7 (నినాదం):** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ లో భాగంగా పారదర్శక ఓటరు జాబితా రూపొందించడమే ముఖ్య ఉద్దేశమని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బి. చేంద్ర శేఖర్ అన్నారు. శుక్రవారం ఆయన కలెక్టర్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ గత వారం నిర్వహించిన సమావేశంలో ఆయా పార్టీల ప్రతినిధులు పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, సర్ కార్యక్రమంపై సూచించిన అంశాలను పరిగణనలోకి తీసుకోవడం జరిగిందని తెలిపారు . సర్ లో భాగంగా ఎన్నికల సంఘం సవరించిన షెడ్యూల్ ను ఆయన సమావేశానికి హాజరైన పార్టీల ప్రతినిధులకు తెలియజేశారు. సరించిన షెడ్యూల్ ప్రకారం జూన్ 25, నుండి ఆగస్టు 10 వరకు బిఎల్ ఓ ల ఇంటింటి సందర్శన ఉంటుందని, 10 న పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, ఆగస్టు 17 న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ, ఆగస్టు 17 నుండి సెప్టెంబర్ 16 వరకు నెల రోజులపాటు ముసాయిదా ఓటరు జాబితా పై అభ్యంతరాల స్వీకరణ, ఆగస్టు 17 నుండి అక్టోబర్ 15 వరకు అభ్యంతరాల పరిష్కారం ఉంటాయని, అక్టోబర్ 19న తుది ఓటరు జాబితా ప్రచురించడం జరుగుతుందని ప్రజాప్రతినిధులకు వివరించారు. సర్ కార్యక్రమంలో భాగంగా నల్గొండ జిల్లాలో 99.95% డిజిటలైజేషన్ పూర్తయినట్లు కలెక్టర్ వెల్లడించారు. కేంద్ర న్నికల సంఘం



ఎన్యూమరేషన్ ఫారాల ఎడిట్ ఆప్షన్ బి ఎల్ వో లకు ఇచ్చినందున, ముసాయిదా ఓటరు జాబితా ప్రచురితమయ్యే నాటికి ఓటరు జాబితాలో పూర్తి స్పష్టత రావాలని, అర్హులైన ఏ ఒక్క ఓటరు జాబితా నుండి తొలగిపోకూడదని, అలాగే అర్హత లేని వారు జాబితాలో ఉండరాదని చెప్పారు. ఎన్యుమరేషన్ ఫారాల సవరణ పకడ్బందీగా నిర్వహించాలని, ఈ విషయమై అందరికీ తెలిసేలా అవసరమైతే మండల స్థాయిలో సమావేశం ఏర్పాటు చేసి మరోసారి రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలియజేయాలని సూచించారు. ప్రతి బిఎల్ఓ ఎన్యుమరేషన్ ఫారాలు కరెక్షన్ చేసి ఇవ్వాలని, నియోజకవర్గస్థాయి బూతు లెవల్ ఏజెంట్లు బిఎల్ఓ స్థాయిలో జరిగే సమావేశాలకు హాజరై ఫారాలు మరో సారి పరిశీలించుకునేలా రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలియజేయాలని కోరారు. ఈ నెల 17న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురితం చేయనున్నందున, ఎన్యూమరేషన్ ఫారాల కరెక్షన్ మరియు డిజిటలైజేషన్ ను ఈ నెల 10 లోగా పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు రెండు, మూడు పోలింగ్ బూతులు ఒకే చోట ఉన్నట్లయితే ఓటర్లకు దగ్గరయ్యే లొకేషన్ లో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని, ఎవరైనా ఓటర్లు తప్పుడు దృవపత్రాలు సమర్పించి ఓట్లు పొందకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, చనిపోయిన ఓటర్ల తొలగింపు సందర్భంగా మరోసారి పూర్తి స్థాయిలో పరిశీలించి తొలగించాలని, ఓటరు జాబితాలో ప్రముఖుల పేర్లు తప్పుగా ఉన్నట్లయితే సరి చేయాలని సూచించారు. సిపిఐ ఎం నర్సిరెడ్డి, బిజెపిలింగస్వామి, టిఆర్ఎస్ పిచ్చయ్య,కాంగ్రెస్ పార్టీ ముంతాజ్ అలీ, ఎన్సీపీ రఫీక్ , ఏఐఎంఐఎం ఖాజా గౌస్ మొహియుద్దీన్, బిఎస్పీ రవిశంకర్, టిడిపి తేలు అన్న రవి,ఆర్డీవోలు వై. అశోక్ రెడ్డి, శ్రీదేవి ,పద్మప్రియలు, జిల్లా రెవెన్యూ అధికారి దశరథ్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు కృష్ణమూర్తి, ఏ ఈ ఆర్ వో లు, తహసిల్దారులు, డిప్యూటీ తహసిల్దార్లు, తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

తెలంగాణ ప్రభుత్వము
వనపర్తి జిల్లా గెజిట్
అసాధారణ పత్రం
అధికారిక ప్రకటన

నం. 78/2026 వనపర్తి శనివారం తేది: 01.08.2026

నం. జి/967/2025,
The Right to Fair Compensation and Transparency in Land Acquisiton, Rehabilitation and Resettlement Act, 2013
ప్రత్యేక ఉప కలెక్టర్ కార్యాలయము పి.ఎస్.ఎల్.ఐ.ఆర్ (భూసేకరణ) 2 పెబ్బేర్ (భూ సేకరణ పునరుపాధి, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతు బద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టము) 2013 కేంద్ర చట్టం (2013/30 యొక్క సెక్షన్ (1)19 మరియు రాష్ట్ర రూల్ (1)25ను అనుసరించి
ఫారం–VII రూఢీ ప్రకటన (పబ్లికేషన్ ఆఫ్ డిక్లరేషన్)

తెలంగాణ ప్రభుత్వం / శ్రీయుత జిల్లా కలెక్టర్, వనపర్తి గారు PJP కెనాల్ 5RA Minor of D-30 of PJP Canal నిర్మాణం కొరకు ఈ క్రింది షెడ్యూల్ లో ఉదాహరించిన భూమి ఎకరములు 04.37 గుంటలు పట్టా / ప్రభుత్వ భూములు ప్రజా ప్రయోజనార్థం వనపర్తి జిల్లా మరియు పెబ్బేరు మండలములోని గుమ్మడం గ్రామము పరిధిలో అవసర నిమిత్తం సేకరించనైనది. భూసేకరణ పునరుపాధి పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013 సెక్షన్ 19(1) అనుసరించి రూఢీ ప్రకటన జారీ చేయనైనది. పైన పేర్కొన్న ప్రాజెక్టు కోసం వనపర్తి జిల్లా మరియు పెబ్బేరు మండలములోని గుమ్మడం గ్రామ పరిమితిలో గల భూమి ఎకరములు 04.37 గుంటలు, ఈ క్రింది అనుబంధంలో చూపిన వానిని పైన తెలిపిన ప్రాజెక్ట్ నిర్మాణంనకు అవసరమైనందున భూమిని సేకరించుటకు రూఢి ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయనైనది.

షెడ్యూల్
గ్రామం: గుమ్మడం మండలం: పెబ్బేరు జిల్లా: వనపర్తి

| [illegible] | సర్వే నెం. | భూమి స్వభావం (పట్టా/ ప్రభుత్వం) | [illegible] | ప్రతిపాదిత భూసేకరణ చేయు విస్తీర్ణం ఎ-గు | పట్టాదారు/ అనుభవదారు/ ఆక్రమణదారు పేరు మరియు తండ్రి /భర్త పేరు | [illegible] |
|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 |
| 1 | 483 | పట్టా | మెట్ట | 00.11 | సి. కురుమయ్య తండ్రి అయ్యన్న | - |
| 2 | 483 | పట్టా | మెట్ట | 00.11 | సి. కృష్ణయ్య తండ్రి అయ్యన్న | - |
| 3 | 483 | పట్టా | మెట్ట | 00.8 1/2 | సి. శివుడు తండ్రి రాముడు | - |
| 4 | 483 | పట్టా | మెట్ట | 00.8 1/2 | సి.ఆంజనేయులు తండ్రి రాముడు | - |
| 5 | 504 | ప్రభుత్వం | మెట్ట | 00.07 | ప్రభుత్వ భూమి | - |
| 6 | 484 | పట్టా | మెట్ట | 00.09 | లోఖశివుడు తండ్రి మౌలాలి (అనుభవదారుడు) | - |
| 7 | 484 | పట్టా | మెట్ట | 00.08 | అల్లోడీ తండ్రి రాముడు (అనుభవదారుడు) | - |
| 8 | 484 | పట్టా | మెట్ట | 00.10 | హనుమంతు తండ్రి అయ్యలు | - |
| 9 | 484 | పట్టా | మెట్ట | 00.04 | బాలాస్వామి తండ్రి బాలయ్య (అనుభవదారుడు) | - |
| 10 | 484 | పట్టా | మెట్ట | 00.04 | కృష్ణయ్య తండ్రి బాలయ్య | - |
| 11 | 484 | పట్టా | మెట్ట | 00.07 | బి.బాలయ్య తండ్రి చెన్నయ్య | - |
| 12 | 484 | పట్టా | మెట్ట | 00.10 | కె.సాయి హర్షవర్ధన్ రెడ్డి తండ్రి కె శివశంకర్ రెడ్డి | - |
| 13 | 484 | పట్టా | మెట్ట | 00.13 | మాల.నరసింహ తండ్రి (అనుభవదారుడు) | - |
| 14 | 484 | పట్టా | మెట్ట | 00.17 | రంగమ్మ భర్త బాలాస్వామి | - |
| 15 | 486 | పట్టా | మెట్ట | 01.01 | 1. ఎం. మద్దిలేటి తండ్రి కన్నయ్య 2.ఎం. వెంకటస్వామి తండ్రి కన్నయ్య 3. ఎం.రాముడు తండ్రి కన్నయ్య | - |
| 16 | 487 | పట్టా | మెట్ట | 00.25 | 1. ఎం. మద్దిలేటి తండ్రి కన్నయ్య 2.ఎం.వెంకటస్వామి తండ్రి కన్నయ్య 3. ఎం.రాముడు తండ్రి కన్నయ్య | - |
| 17 | 488 | పట్టా | మెట్ట | 00.03 | రామచంద్రయ్య తండ్రి వెంకటస్వామి | - |
| మొత్తం విస్తీర్ణం (ఎ-గు) | | | | (ఎ.04-37) | | |

సెక్షన్ 15 (కేంద్ర చట్టం 30 / 2013) క్రింద భూసేకరణ పై వచ్చిన అభ్యంతరాలను పరిశీలించిన పిదప ఇట్టి ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయనైనది. ఇట్టి భూ సేకరణ కారణంగా పునరావాసం కల్పించవలసిన కుటుంబాలు ఏమి లేవు.

భూసేకరణలోని సదరు ప్రాజెక్ట్ యొక్క నిర్మాణ సమయంలో భూమిలో, బొగ్గు, ఇనుము, స్లేట్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూమిలలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్ట్ కు నిర్మాణములకు ఉపయోగితమున్న పక్షములో, వాటిని స్వీకరించబడును లేనిచో స్వీకరించబడవు.

భూమి యొక్క ప్లాన్ మరియు వివరములు శ్రీయుత జిల్లా కలెక్టర్ వనపర్తి / భూ సేకరణ, అధికారి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్, (భూసేకరణ) ఆర్.ఎల్.ఐ.ఎస్.పి–2 పెబ్బేర్, హెడ్ క్వార్టర్ ఐ.డి.ఓ.సి, వనపర్తి గారి కార్యాలయములలో ఉంచనైనది. సంబంధిత వ్యక్తులు ఏదైనా పని దినములలో కార్యాలయ పని వేళలలో పరిశీలించుకోవచ్చును.

సం/– ప్రత్యేక ఉప కలెక్టర్, (సే.భూ) ఆర్‌పి.యస్.ఐ. ఎల్.పి.–2, పెబ్బేరు వనపర్తి.
సం/– అదనపు కలెక్టర్, వనపర్తి
సం/– జిల్లా కలెక్టర్, వనపర్తి

DIPR RO No. 624/LA-PP/ADVT/PUB/2026-27

बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda
బర్కత్‌పుర బ్రాంచ్
ప్లాట్ నం. 3-4-490/బి, RBVR రెడ్డి కాలేజ్ రోడ్, బర్కత్‌పుర, హైదరాబాద్, తెలంగాణ, 500027.

**స్వాధీనతా ప్రకటన** (స్థిరాస్తి/ల కొరకు)
సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(1)తో చదవబడుతూ అనుబంధము-4 ప్రకారం

ఇందుమూలముగా తెలియజేయడమేమనగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (SARFAESI) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదవబడు సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొనుచూ **బ్యాంక్ ఆఫ్ బరోడా** వారి అధీకృత అధికారి అయిన దిగువ సంతకముదారు **తేది: 08.05.2026తో జారీ చేసిన డిమాండ్ నోటీసు ప్రకారం రుణగ్రహీతలు/హామీదారులు/తాకట్టుదారులు: శ్రీ సునీల్ చెల్లప్పన్ తండ్రి లేట్ కె. చెల్లప్పన్**, నివాసం: 34-57, వివేకానంద పురం, భవన్స్ స్కూల్ పక్కన, సైనిక్‌పురి, మల్కాజ్‌గిరి, హైదరాబాద్-500094 మరియు **శ్రీమతి లక్ష్మి బాయి భర్త శ్రీ సునీల్ చెల్లప్పన్**, నివాసం: 34-57, వివేకానంద పురం, భవన్స్ స్కూల్ పక్కన, సైనిక్‌పురి, మల్కాజ్‌గిరి, హైదరాబాద్-500094. **వారిని నోటీసులో తెలిపిన మొత్తం 13.04.2026 నాటికి రూ. 42,54,292.24 (రూపాయలు నలభై రెండు లక్షల యాభై నాలుగు వేల రెండు వందల తొంభై రెండు మరియు పైసలు ఇరవై నాలుగు మాత్రమే) మరియు 13.04.2026 నుండి** చెల్లింపు తేదీ వరకు ఒప్పంద రేటు వంతున దానిపై తదుపరి వడ్డీ, ప్లస్ వ్యయాలు, చార్జీలు, ఖర్చులతో పాటు సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించమని కోరడమైనది. సదరు రుణగ్రహీతలు/ హామీదారులు పైన తెలిపిన రుణ బకాయి మొత్తం చెల్లించుటలో విఫలమైనందున, సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002లోని రూల్ 8తో చదవబడు సదరు చట్టంలోని సెక్షన్ 13 సబ్‌సెక్షన్ (4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకొనుచూ దిగువ సంతకందారు క్రింద తెలిపిన ఆస్తిని **20 జూలై, 2026 స్వాధీనము** చేసుకోవడమైనదని రుణగ్రహీతలు/ హామీదారుల మరియు సాధారణప్రజానీకమునకు ఈ నోటీసు ద్వారా తెలియజేయడమైనది.

సెక్యూర్డ్ అస్తులను విడిపించుకొనుటకు లభించే సమయానికి సంబంధించి సదరు చట్టములోని సెక్షన్ 13 సబ్‌సెక్షన్ (8)లోని నిబంధనలను గమనించవలసిందిగా రుణగ్రహీతలను కోరడమైనది.

కావున ప్రత్యేకించి రుణగ్రహీత/హామీదారులు/తనఖాదారులు మరియు సాధారణప్రజానీకమును హెచ్చరించడమేమనగా సదరు ఆస్తి/ఆస్తులతో ఎటువంటి లావాదేవీలు జరుపకూడదనియు ఒక వేళ జరిపినట్లయితే **బ్యాంక్ ఆఫ్ బరోడా, బర్కత్‌పుర బ్రాంచ్** వారికి చెందవలసిన రుణబకాయి మొత్తం **13.04.2026 నాటికి రూ. 42,54,292.24 (రూపాయలు నలభై రెండు లక్షల యాభై నాలుగు వేల రెండు వందల తొంభై రెండు మరియు పైసలు ఇరవై నాలుగు మాత్రమే) మరియు 13.04.2026 నుండి** చెల్లింపు తేది వరకు ఒప్పంద రేటు వంతున దానిపై తదుపరి వడ్డీ, ప్లస్ వ్యయాలు, చార్జీలు, ఖర్చులతో క్రింద వర్తించును.

**స్థిరాస్తి వివరణ**
**శ్రీమతి సి.వి. లక్ష్మీబాయి భర్త శ్రీ సి.కె. విశ్వనాథ్ పేరు ఉంది.**
తెలంగాణ, హైదరాబాద్, అశోక్ నగర్, వీధి నం. 5లో ఉన్న ప్లాట్ నం. 31 & 32లోని భాగంలో ఉన్న ఇంటి నం. 1-10-1/8/ఎ/1 (పిటిఐఎన్ నం. 1090120913) & 1-10-1/8/ఎ/2 (పిటిఐఎన్ నం. 1090120914) గల గ్రౌండ్ మరియు మొదటి అంతస్తు గల 263.5 చ.గ.ల విస్తీర్ణం గల నివాస భవనము యొక్క న్యాయోచిత తనఖా.

| సరిహద్దులు | డీడ్ ప్రకారం | వాస్తవ పరిస్థితి |
|---|---|---|
| ఉత్తరం | పొరుగువారి భవనం | పొరుగువారి భవనం |
| దక్షిణం | విక్రేతకు చెందిన స్థలం ప్రస్తుతం శ్రీమతి శ్యామలాదేవి మరియు శ్రీ బాలమణి గార్లతో అమ్మకపు ఒప్పందం కింద ఉంది. | విక్రేతకు చెందిన స్థలం ప్రస్తుతం శ్రీమతి శ్యామలాదేవి మరియు శ్రీ బాలమణి గార్లతో అమ్మకపు ఒప్పందం కింద ఉంది |
| తూర్పు | పొరుగువారి భవనం (శ్రీ సి.హెచ్. రామకోటి) | పొరుగువారి భవనం (శ్రీ సి.హెచ్ రామకోటి) |
| పడమర | 40'-0" వెడల్పు రోడ్డు | 40'-0" వెడల్పు రోడ్డు |

తేది: 01.08.2026,
ప్రదేశం: హైదరాబాద్,
చీఫ్ మేనేజర్/ అధీకృత అధికారి
బ్యాంక్ ఆఫ్ బరోడా

बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda
బర్కత్‌పుర బ్రాంచ్
ప్లాట్ నెం. 3-4-490/బి, ఆర్‌బివిఆర్ రెడ్డి కాలేజ్ రోడ్, బర్కత్‌పుర, హైదరాబాద్, తెలంగాణ-500027

**డిమాండ్ నోటీసు**
**(SARFAESI యాక్ట్ 2002లోని సెక్షన్ 13లోని సబ్‌సెక్షన్ (2) క్రింద)**

**దిగువ వారికి: 1. మెస్సర్స్ విస్టా ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్**, రిజిస్టర్డ్ ఆఫీస్: ప్లాట్ నెం. 10 నుండి 14 మరియు 16 నుండి 20, APIIC, ఇండస్ట్రియల్ ఎస్టేట్, చిట్యాల్, గోపాలపల్లి, నల్గొండ - 508254, తెలంగాణ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్: ప్లాట్ నెం. 104, రవీంద్ర కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ, గుట్టల బేగంపేట్, జూబ్లీహిల్స్, షేక్‌పేట్, హైదరాబాద్ 500081, తెలంగాణ. **2. శ్రీ ధనంజయ అల్లి**, రుణగ్రహీత కమ్ కార్పొరేట్ హామీదారు/ మేనేజింగ్ డైరెక్టర్ కమ్ హామీదారు ప్లాట్ నెం. 104, రవీంద్ర కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ, గుట్టల బేగంపేట్, జూబ్లీహిల్స్, షేక్‌పేట్, హైదరాబాద్-500081, తెలంగాణ. **3. శ్రీ స్టాన్లీ ప్రభాకర్ రెడ్డి**, ఫ్లాట్ నెం. 7-1-212 ఎ70 ఫ్లాట్ నెం 85, శివ్‌బాగ్, అమీర్‌పేట్, హైదరాబాద్ 500016. **4. శ్రీ ఉమాకాంత్ కట్టా**, డైరెక్టర్ కమ్ హామీదారు 14వ అంతస్తు, వైఎస్ వివేక ఎన్‌క్లేవ్, ఖాజాగూడ, హైదరాబాద్-500075 తెలంగాణ. **5. శ్రీ పవన్ సాత్విక్ గిలక**, డైరెక్టర్ కమ్ హామీదారు ఫ్లాట్ నెం 501, వినూత్న క్రెస్ట్, విక్రమ్‌పురి, హబ్సిగూడ, హైదరాబాద్ 500007 తెలంగాణ. **6. శ్రీ మల్లెం హనుమంత రావు**, డైరెక్టర్ కమ్ హామీదారు **7. శ్రీ ఉమేష్ విరూపాక్ష బణాకర్**, డైరెక్టర్. **8. మిస్ దివ్య భవాని చక్రవర్తుల**, డైరెక్టర్. **9. శ్రీ దివాకర్ రెడ్డి యర్రబొమ్మనహల్లి**, డైరెక్టర్. **10. శ్రీ మురలి మేరగా**, డైరెక్టర్. **11. శ్రీ చిత్తజల్లు ఆనంద్**, విల్లా నెం. 7, వండర్‌ఫుల్ వరల్డ్, కిస్మత్‌పూర్, రంగారెడ్డి, హైదరాబాద్ 500086 తెలంగాణ. **12. శ్రీమతి చిత్తజల్లు నాగ కీర్తి**, విల్లా నం. 7, వండర్‌ఫుల్ వరల్డ్, కిస్మత్‌పూర్, రంగారెడ్డి, హైదరాబాద్ 500086 తెలంగాణ. **13. శ్రీ ఎన్ వి చలపతి రావు**, ఫ్లాట్ నం. 1301, 8-4-300/3, టి నెం.-1, వాసవి బృందావన్, ఫతేనగర్, ఎర్రగడ్డ, హైదరాబాద్ 500018 తెలంగాణ. **14. శ్రీమతి దుర్గా దేవి ఎన్**, ప్లాట్ నెం. 69, సర్వే నెం. 4, 12, 13 & 14 భాగం, శ్రీనివాస హిల్స్, సాలార్‌జంగ్ కొంచ విల్లా, చీరియల్ బిఓ హైదరాబాద్ 501301 తెలంగాణ.

**విషయం : సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 (ఇకమీదట "చట్టం"గా పిలువబడును.) లోని సెక్షన్ 13(2) క్రింద ప్రకటన.**
**మెస్సర్స్ విస్టా ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ యొక్క ఖాతా**
**సర్/మేడమ్,**

**రెఫరెన్స్ : మా బర్కత్‌పుర బ్రాంచ్, హైదరాబాద్ వద్ద రుణ సదుపాయాలు.**

మంజూరు నిబంధనలు మరియు వివిధ రుణ సదుపాయాల మంజూరును తెలియజేస్తూ మా లెటర్ నెం. తేది: 12.12.2025ను రిఫర్ చేయడమైనది. పై మంజూరు దృష్ట్యా దిగువ తెలిపిన విధంగా సెక్యూరిటీ ఏర్పాటు చేసిన తరువాత మీరు రుణ సదుపాయాలను పొందినారు మరియు వినియోగించడం ప్రారంభించినారు. వివిధ రుణ/ క్రెడిట్ సదుపాయ రుణఖాతాలలో ప్రస్తుత బకాయి మొత్తం మరియు సదరు రుణము కొరకు కల్పించబడిన సెక్యూరిటీ ఇంటరెస్టులు దిగువ విధంగా ఉన్నవి :

| సదుపాయ రకం మరియు స్వభావము | పరిమితి : | వడ్డీ రేటు : | 21.05.2026 నాటికి బకాయి మొత్తం |
|---|---|---|---|
| సిసి ఖాతా నెం. 06440500000059 | Rs.1,00,00,000.00 | 13.15% p.a | Rs. 1,03,14,330.46 |
| టర్మ్ లోన్ ఖాతా no. 06440600004197 | Rs. 4,00,00,000.00 | 14.35% p.a | Rs.8,33,333.49 |
| టర్మ్ లోన్ ఖాతా no. 06440600003420 | Rs. 1,00,00,000.00 | 14.35% p.a | Rs.3,73,547.32 |
| టర్మ్ లోన్ ఖాతా no. 06440600003511 | Rs. 5,00,00,000.00 | 14.15% p.a | Rs. 2,45,19,335.48 |
| మొత్తం | Rs. 11,00,00,000.00 | | Rs. 3,60,40,546.75 |

సెక్యూరిటీల సంక్షిప్త వివరణతో సెక్యూరిటీ అగ్రిమెంట్
**ప్రాథమిక సెక్యూరిటీలు:** ప్రస్తుత మరియు భవిష్యత్ రెండూ కంపెనీ యొక్క స్టాక్స్ మరియు బుక్ డెట్స్ యొక్క తనఖా. **మెస్సర్స్ విస్టా ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్** పేరున గల నల్గొండ జిల్లా, నార్కెట్‌పల్లి తాలూకా గోపాలపల్లి గ్రామం, టిఎస్ఐఐసి చిట్యాల ఇండస్ట్రియల్ ఎస్టేట్, ప్లాట్ నెం.లు 10 నుండి 14 మరియు 16 నుండి 20లలో సర్వే నెం. 448/2, 449/2 మరియు 450/2 వద్ద 26,270.30 చ.గ.లు లేదా 21,969.32 చ.మీ.ల విస్తీర్ణానికి ఫ్యాక్టరీ భూమి యొక్క ఇఎం. **సరిహద్దులు:**

| సరిహద్దులు | డీడ్ ప్రకారం | వాస్తవం |
|---|---|---|
| ఉత్తరం | రోడ్డు నెం. 6 | రోడ్డు నెం. 6 |
| దక్షిణం | రోడ్డు నెం. 5 | రోడ్డు నెం. 5 |
| తూర్పు | రోడ్డు నెం. 2 | రోడ్డు నెం. 2 |
| పడమర | ప్లాట్ నెం. 9 & 15 | ప్లాట్ నెం. 9 & 15 |

ప్రస్తుత మరియు భవిష్యత్ రెండూ కంపెనీ యొక్క ప్లాంట్ & మెషినరీతో పాటు కంపెనీ యొక్క చర, స్థిరాస్తుల తనఖా.
**కొలేటరల్ సెక్యూరిటీలు: 1. సరిసమానా తనఖా.** శ్రీ చిత్తజల్లు ఆనంద్ తండ్రి పురుషోత్తం (డాక్యుమెంట్ నెం. 6545/2015, తేది: 23.10.2015) పేరున గల ఆంధ్రప్రదేశ్, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్, ఐడి హాస్పిటల్ లొకాలిటీ ఎదురుగా, అమరావతి రోడ్, మధురానగర్ వద్ద డి.నెం. 11-226 సమీపాన, ప్లాట్ నెం. 59లో బ్లాక్ నెం. 11, గ్రౌండ్ + 2 పై అంతస్తులు, డి.నెం. 139/1బి, 142, 142/2, డి.నెం. 119-2-271తో నివాస భవనము. **సరిహద్దులు:**

| సరిహద్దులు | డీడ్ ప్రకారం | వాస్తవం |
|---|---|---|
| ఉత్తరం | 40' వెడల్పు రోడ్డు | 40' వెడల్పు రోడ్డు; |
| దక్షిణం | మందలపు హనుమంత రావు; | మందలపు హనుమంత రావు |
| తూర్పు | సర్కార్ డొంక | సర్కార్ డొంక |
| పడమర | మద్దినేని సీతా రామయ్య | మద్దినేని సీతా రామయ్య |

**2. సరిసమానా తనఖా.** శ్రీమతి చిత్తజల్లు నాగకీర్తి భర్త సిహెచ్ ఆనంద్ (డాక్యుమెంట్ నెం. 619/2016, తేది: 03.02.2016) పేరున గల రంగారెడ్డి జిల్లా, రాజేంద్రనగర్ మండలం, కిస్మత్‌పూర్ గ్రామం, సర్వే నెం. 163, వండర్‌ఫుల్ వరల్డ్ ఇ.నెం. 7. **సరిహద్దులు:**

| సరిహద్దులు | డీడ్ ప్రకారం | వాస్తవం |
|---|---|---|
| ఉత్తరం | విల్లా నెం. 6 | విల్లా నెం. 6 |
| దక్షిణం | విల్లా నెం. 8 | విల్లా నెం. 8 |
| తూర్పు | పొరుగువారి భూమి | పొరుగువారి భూమి |
| పడమర | 30' వెడల్పు రోడ్డు | 30' వెడల్పు రోడ్డు |

**3. సరిసమానా తనఖా.** శ్రీ నారపరాజు దుర్గాదేవి భర్త చలపతిరావు రావు(డాక్యుమెంట్ నెం. 2866/2010, తేది: 30.12.2010) పేరున గల రంగారెడ్డి జిల్లా, ఘట్‌కేసర్ మండలం, పర్వతాపూర్ గ్రామ పంచాయతీ, సాలర్‌జంగ్ కంచ గ్రామం, శ్రీనివాస హిల్స్ వద్ద 196 చ.గ.ల విస్తీర్ణముతో సర్వే నెం. 4,12,13&14 భాగములలో ప్లాట్ నెం. 69పై ఇల్లు, గ్రౌండ్ ఫ్లోర్ మాత్రమే కలిగిన ఇల్లు. **సరిహద్దులు:**

| సరిహద్దులు | డీడ్ ప్రకారం | వాస్తవం |
|---|---|---|
| ఉత్తరం | ప్లాట్ నెం. 70 | ప్లాట్ నెం. 70 |
| దక్షిణం | ప్లాట్ నెం. 68 | ప్లాట్ నెం. 68 |
| తూర్పు | 30-0" వెడల్పు రోడ్డు | మట్టి రోడ్డు |
| పడమర | ప్లాట్ నెం. 94 | ఇంటి ప్లాట్ నెం. 94 |

**2.** తేది: **12.03.2024** గల రుణ స్వీకార పత్రంలో మీరు బ్యాంకుకు కేవలం **12.03.2024** నాటికి **రూ. 6,96,30,153.87 (రూపాయలు ఆరు కోట్ల తొంభై ఆరు లక్షల ముప్పై వేల నూట యాభై మూడు మరియు పైసలు ఎనభై ఏడు మాత్రమే)** వరకు మాత్రమే మీ బాధ్యతను అంగీకరించారు. పైన పేర్కొన్న బకాయిలలో, తీసుకున్న అదనపు మొత్తాలు, వడ్డీ మరియు ఖాతాకు డెబిట్ చేయబడిన ఇతర ఛార్జీలు కూడా చేరి ఉన్నాయి.
**3. తేది: 30.04.2026** మరియు ఆ తర్వాత చెల్లింపునకు గడువు ముగిసిన టర్మ్ లోన్/ డిమాండ్ లోన్ సౌకర్యం యొక్క వాయిదా చెల్లింపులో కూడా మీరు విఫలమయ్యారు.
**4.** మీరు విఫలమైన కారణముగా మీ రుణ ఖాతాలు రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి సూచనలు మరియు మార్గదర్శకాల ప్రకారం **30.04.2026న నిరర్థక ఆస్తిగా** వర్గీకరించడమైనది. పలుమారు అభ్యర్థనలు మరియు డిమాండ్ చేసినప్పటికీ గడువు మీరిన రుణములు మరియు దానిపై వడ్డీతో కలుపుకొని మీరు తిరిగి చెల్లించలేదు.
**5.** పై పేరా 1లో తెలిపిన వివిధ సెక్యూరిటీల ద్వారా తగువిధముగా సెక్యూర్ చేయబడిన రుణ సదుపాయాలకు సంబంధించి మీ రుణ బాధ్యతలను తీర్చుటలో మీరు విఫలమైనందున మీ ఖాతా నిరర్థక ఆస్తిగా వర్గీకరించడమైనది. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002లోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (2) క్రింద ఈ నోటీసు తేది నుండి 60 రోజులలోగా పై పేరా 1లో తెలిపిన విధముగా బ్యాంక్‌కు రావల్సిన బకాయి మొత్తం **రూ. 3,60,40,546.75 (రూపాయలు మూడు కోట్ల అరవై లక్షల నలభై వేల ఐదు వందల నలభై ఆరు మరియు పైసలు డెబ్బై ఐదు మాత్రమే)** పూర్తిగా చెల్లించి, మీ రుణ బాధ్యతలను విడిపించుకోవల్సిందిగా మిమ్మల్ని కోరుతూ మేము మీకు నోటీసు జారీ చేయడమైనది. తదుపరిగా మేము ఈ నోటీసు ద్వారా తెలియజేయునది ఏమనగా చెల్లింపు తేది వరకు అయిన వడ్డీతో పైన తెలిపిన మొత్తాన్ని చెల్లించుటలో విఫలమైనట్లయితే, సదరు చట్టములోని సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (4) క్రింద అన్ని లేదా ఏదేని హక్కులను మేము వినియోగించుకొనెదమని గమనించగలరు.
**6.** పూర్తి చెల్లింపు వరకు ఒక్కొక్క రుణ సదుపాయం కొరకు పై పేరా 1లో తెలిపిన రేట్లు వంతున వడ్డీ లెక్కించబడునని గమనించగలరు.
**7.** సదరు చట్టములోని సబ్-సెక్షన్ 13 ప్రకారం మా ముందస్తు వ్రాతపూర్వక సమ్మతి లేకుండా అమ్మకం, లీజు లేదా ఇతరత్ర (సాధారణ వ్యాపార లావాదేవీలు కాకుండా) రూపములో పై పేరా 1లో రిఫర్ చేసిన సెక్యూర్డ్ ఆస్తులలో ఏదేనిని బదిలీ చేయుట నుండి మీరు నిషేధించబడినారని గమనించగలరు. సదరు చట్టములోని సెక్షన్ 13(13)లో తెలిపిన పై నిబంధనలను అనుసరించుటలో విఫలమైనచో సదరు చట్టములోని సెక్షన్ 29 క్రింద శిక్షార్హ నేరమవుతుందని మేము తెలియజేస్తున్నాము.
**8.** మేము తదుపరిగా మీకు తెలియజేయునది ఏమనగా సదరు చట్టములోని సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) ప్రకారం బహిరంగ వేలం/ కొటేషన్లు/ టెండరు కోరుట/ ప్రైవేట్ ఒప్పందం కొరకు ప్రకటన ప్రచురణ తేదీకి ముందు ఏ సమయంలోనైనా బ్యాంక్‌చే వెచ్చించిన అన్ని వ్యయాలు, ఛార్జీలు మరియు ఖర్చులతో పాటు బకాయి మొత్తాన్ని మీరు చెల్లించినచో సెక్యూర్డ్ ఆస్తులను మీరు విడిపించుకోవచ్చును. పైన తెలిపిన విధముగా నోటీసు ప్రచురణ తరువాత సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకునే హక్కు మీకు లభించదని గమనించగలరు.
**9.** ఎటువంటి ప్రతికూలాభిప్రాయం లేకుండా ఈ డిమాండ్ నోటీసు జారీ చేయడమైనదని గమనించవలెను మరియు మాకు రావల్సిన మొత్తాలకు సంబంధించి తదుపరి డిమాండ్ చేసే హక్కు ఎటువంటి పరిమితి లేకుండా మాకు గల ఏవేని ఇతర హక్కులు లేదా పరిష్కారాలను వదులుకున్నట్లుగా భావించరాదు.

**తేది: 21.05.2026**
**ప్రదేశం: హైదరాబాద్**
**చీఫ్ మేనేజర్/ అధీకృత అధికారి**
**బ్యాంక్ ఆఫ్ బరోడా**

# ప్రజల భద్రతే లక్ష్యం..





నేరాల నియంత్రణలో రాజీలేని పోలీసింగ్
పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి ప్రాధాన్యం
సైబర్ నేరాలు, అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు
ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, ఆగస్టు 7 (నినాదం):** ప్రజల భద్రతే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని, జిల్లాలో నేరాల నియంత్రణలో ఎలాంటి రాజీ ఉండబోదని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ స్పష్టం చేశారు. భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పనితీరు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, శాంతిభద్రతల పరిస్థితిపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి కేసులో నాణ్యమైన, శాస్త్రీయ దర్యాప్తు చేపట్టి బాధితులకు సత్వర న్యాయం అందించడంతో పాటు నేరస్తులకు చట్టప్రకారం శిక్ష పడేలా పకడ్బందీగా దర్యాప్తు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సి.సి.టి.ఎన్.ఎస్. (2.0)లో కేసులను సకాలంలో నమోదు చేసి, దర్యాప్తు పురోగతిని నిరంతరం నవీకరిస్తూ సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు, ఆర్థిక నేరాలు, సైబర్ మోసాలపై గ్రామ స్థాయి వరకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, గంజాయి రవాణా, జూదం తదితర అసాంఘిక కార్యకలాపాలపై నిరంతర నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాల వ్యవస్థను విస్తరించి వాటి పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్లను గుర్తించి సంబంధిత శాఖలతో సమన్వయంతో చర్యలు చేపట్టాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని స్పష్టం చేశారు. గ్రామ స్థాయి పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేస్తూ విలేజ్ పోలీస్ అధికారులు ప్రజలతో మమేకమై ముందస్తు సమాచార సేకరణకు ప్రాధాన్యం ఇవ్వాలని, పెండింగ్ కేసులు, వారెంట్లు, పిటిషన్ల పరిష్కారంలో వేగం పెంచాలని ఆదేశించారు. మహిళలు, చిన్నారులకు సంబంధించిన కేసుల దర్యాప్తులో ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. సమావేశంలో భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు, కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజా యాత్రను విజయవంతం చేయాలి

మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరి రావు



**చింతపల్లి, ఆగస్టు 7 (నినాదం):** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఆగస్టు 9 నుంచి 12 వరకు దేవరకొండ నియోజకవర్గంలో నిర్వహించనున్న "బద్లావ్ జరూరి హై -- మార్పు కావాలి" ప్రజా యాత్రను విజయవంతం చేయాలని, అలాగే సెప్టెంబర్ 1న నిర్వహించే "చలో ఢిల్లీ" కార్యక్రమానికి అధిక సంఖ్యలో తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరి రావు పిలుపునిచ్చారు. మండల సీపీఐ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల కౌన్సిల్ సమావేశంలో గోడపత్రికలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 12 సంవత్సరాలు పూర్తయినప్పటికీ ఎన్నికల సమయంలో ఇచ్చిన అభివృద్ధి, ఉపాధి, సంక్షేమం, మెరుగైన పాలన వంటి హామీలను నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి పోలె వెంకటయ్య, మండల సహాయ కార్యదర్శి ఉజ్జిని అంజల్ రావు, మండల కార్యవర్గ సభ్యులు వేముల బుచ్చయ్య, షేక్ శంషోద్దీన్, మండల యువజన నాయకులు మిడిదొడ్డి రామకృష్ణ, గనిపల్లి జితేంద్ర, గ్రామ శాఖ కార్యదర్శులు అయితపాక సైదులు,నరసింహ , యాచారం శ్రీశైలం, కురుమేడి కృష్ణయ్య, బాల మల్లేష్ , ఈద కుష్టోపరు, ఇస్లావత్ పాప , ముద్ధం దశరథం, పోలోటి బ్రహ్మచారి, జక్కుల లింగం యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# రైతులను హార్టికల్చర్, ఆయిల్‌పాం, ఆరుతడి పంటల సాగుకు ప్రోత్సహించాలి

- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 7 (నినాదం):** వర్షాలు తక్కువగా కురుస్తున్న నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటిని సమర్థ వంతంగా వినియోగించుకునేలా రైతులు పంట కుంటలను నిర్మించుకునేలా, ఆరుతడి పంటలను సాగు చేసుకునేలా వ్యవసాయ శాఖ అధికారులు ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. వానాకాలం పంటల సాగు, స్మార్ట్ రేషన్ కార్డులు, కొత్త పెన్షన్లు తదితర అంశాలపై శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని పలు ప్రాజెక్టులకు ప్రస్తుతం వరద నీరు వస్తున్నప్పటికీ, ఆయా రిజర్వాయర్లలో నీటి లభ్యతను ఆధారంగా చేసుకుని రైతులు ఏ పంటలు సాగు చేయాలనే దానిపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని సూచించారు. వచ్చే వేసవి వరకు తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని, ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురిసే అవకాశం ఉన్ననేపథ్యంలో రైతులు ఆరుతడి పంటలు సాగు చేసేలా వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించి ప్రోత్సహించాలని సూచించారు. వన మహోత్సవంలో భాగంగా నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా మొక్కలు నాటి, వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆగస్టు 15 నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. అర్హులైన వారందరికీ కొత్తగా పెన్షన్లు



అందించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి చార్మినార్ సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ డాక్టర్ ప్రియాంక వర్గీస్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ, జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలతో పలు మైనర్ ఇరిగేషన్ (ఎంఐ) ట్యాంకులు నిండాయని తెలిపారు. జిల్లాలో రైతులు ప్రధానంగా పత్తి, సోయాబీన్, కంది పంటలను సాగు చేస్తున్నారని పేర్కొన్నారు. రైతులను పంటల వైవిధ్యీకరణ వైపు ప్రోత్సహిస్తున్నామని, ఆరుతడి పంటల సాగు చేపట్టేలా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. జిల్లాలో తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపడుతున్నామని వివరించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షించి, ఆయా శాఖల పరిధిలో చేపట్టాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాకు చెందిన వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా తల్లిపాల వారోత్సవాలు




**చింతపల్లి, ఆగస్టు 7 (నినాదం):** జాతీయ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా తీదేడు గ్రామంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఐ సి డి ఎస్. సూపర్వైజర్ ప్రసన్న లక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన గంటలోపే శిశువుకు తల్లిపాలు ఇవ్వడం ఎంతో ముఖ్యమని, మొదటి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారాన్ని అందించడంతో పాటు రోగనిరోధక శక్తిని పెంపొందిస్తాయని తెలిపారు. గర్భిణులు,బాలింతలు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని,అంగన్‌వాడీ కేంద్రాలు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తూ,వారి సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ రావు లక్ష్మి,గ్రామ మహిళలు,గర్భిణులు,బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

ninadamnews.com

తెలుగు దినపత్రిక

# నినాదం

నిఖార్సైన జర్నలిజం

శనివారం, ఆగస్టు 8, 2026 | సంపుటి - 22 | సంచిక 311 | వెల - 7 | పేజీలు - 12 - 8

Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam



తెలంగాణ డీజీపీ సీవీ.ఆనంద్‌ని నినాదం పత్రిక ఎడిటర్ బిజిగిరి శ్రీనివాస్ శుక్రవారం డిజీపీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ నెల 11న హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న నినాదం 23వ వార్షికోత్సవానికి అతిథిగా రావాల్సిందిగా ఈ సందర్భంగా ఆయనను ఆహ్వానించారు.

నినాదం, హైదరాబాద్:

## హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ కొత్త క్లౌడ్ రీజియన్..

ఏఐ సేవలకు మరింత ఊతం

6







## వర్షాల కోసం వరుణయాగం

- తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం
- ఆగస్టు 10న నాగార్జునసాగర్‌లో యాగం
- పూర్ణాహుతిలో పాల్గొననున్న రేవంత్

**హైదరాబాద్,ఆగస్టు7(నినాదం):** రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి నదులు, జలాశయాలు జలకళ సంతరించుకోవాలని, పంటలు బాగా పండాలని ఆకాంక్షిస్తూ తెలంగాణ ప్రభుత్వం వరుణ యాగం నిర్వహించాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సారథ్యంలో ఆగస్టు 10న నాగార్జునసాగర్‌లోని విజయ విహార్ ప్రాంగణంలో ఈ యాగం జరగనుంది.

▸▸తరువాయి 6లో..



# హైదరాబాద్‌లో భారీ బస్ టెర్మినల్ నిర్మాణం

- గాజులరామారంలో 100 ఎకరాల్లో ఏర్పాటు
- ట్రాఫిక్ ను తగ్గించేందుకు ప్రభుత్వ ప్రణాళిక
- లోక్‌సభలో ధ్రువీకరించిన కేంద్రమంత్రి గడ్కరీ
- కొత్త డిపోతో రవాణా వ్యవస్థ మరింత మెరుగుదల





*హైదరాబాద్ నగరంలో రోజు రోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. నగర శివారులోని గాజుల రామారంలో 100 ఎకరాల విస్తీర్ణంలో అత్యాధునిక బస్ టెర్మినల్ నిర్మాణానికి భూమి కేటాయించినట్లు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అధికారికంగా ప్రకటించారు.*

**న్యూఢిల్లీ,ఆగస్టు7(నినాదం):** ఈ బస్ టెర్మినల్ నిర్మాణం పూర్తయి తే నగరంలో ట్రాఫిక్ ఒత్తిడి గణనీయంగా తగ్గుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. లోక్‌సభలో ఎంపీలు చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ఈటల రాజేందర్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ లిఖిత పూర్వక సమాధానమిచ్చారు. జగద్గిరిగుట్ట సమీపంలో బస్ డిపో నిర్మాణం కోసం టీజీఎసఆర్టీసీ గతంలో హెచ ఎంటీకి చెందిన స్థలాన్ని 99 ఏళ్ల పాటు లీజుకు కోరినట్లు తెలిపారు. అయితే, కేవలం 20 ఏళ్లకు మాత్రమే లీజుకు ఇవ్వగలమని, అదీ ఐదేళ్లకోసారి సమీక్షిస్తామని హెచఎంటీ అధికారులు చెప్పారన్నారు. దీనికి అదనంగా ఏటా రూ.6 కోట్ల లైసెన్స్ ఫీజు చెల్లించాలని షరతు విధించడంతో ఈ ప్రతిపాదనను టీజీఎసఆర్టీసీ తిరస్కరించిందని గడ్కరీ వివరించారు.

▸▸తరువాయి 6లో..

## రూ 5,400 వేల కోట్ల జరిమానా

మెటాకు అమెరికా కోర్టు భారీ షాక్







**న్యూఢిల్లీ,ఆగస్టు7(నినాదం):** సోషల్ మీడియా దిగ్గజం మెటాకు అమెరికా కోర్టులో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ప్లాట్‌ఫామ్‌ల వల్ల యువత మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోందని నిర్ధారించిన న్యూ మెక్సికో కోర్టు, కంపెనీకి 567 మిలియన్ డాలర్ల (సుమారు రూ. 5,400 కోట్లకు పైగా) జరిమానా విధిస్తూ సంచలన తీర్పు ఇచ్చింది. ఈ కేసు విచారణలో భాగంగా రెండో దశలో జడ్జి బ్రయాన్ బీడ్‌షీడ్ ఈ ఆదేశాలు జారీ చేశారు. తీర్పు ప్రకారం జరిమానా మొత్తంలో 420 మిలియన్ డాలర్లు సోషల్ మీడియా వల్ల ప్రభావితమైన యువతకు చికిత్సా సేవల కోసం కేటాయించాలని న్యాయస్థానం స్పష్టం చేసింది.

▸▸తరువాయి 6లో..

## ఇరాన్ సుప్రీం లీడర్ ముజ్తబా ఖమేనీకి తీవ్ర అస్వస్థత!



**న్యూఢిల్లీ,ఆగస్టు7(నినాదం):** ఇరాన్ సర్వోన్నత నేత, సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ పరిస్థితి విషమంగా ఉందని, ఆయనను ఆసుపత్రికి తరలించారని ఇజ్రాయెల్ మీడియాలో వార్తలు వెలువడ్డాయి. ఈ కథనాలు ఇప్పుడు అంతర్జాతీయంగా సంచలనం సృష్టిస్తున్నాయి.ఇజ్రాయెల్‌కు చెందిన ఛానల్ 14, జెరూసలేం పోస్ట్, ఇరాన్‌వైర్ ఔట్‌లెట్ తెలిపిన వివరాల ప్రకారం, ఖమేనీ 'అత్యంత విషమ పరిస్థితిలో' ఉన్నారనే వదంతులు ప్రభుత్వంలోని అత్యున్నత స్థాయిలలో విస్తృతంగా వ్యాపిస్తున్నాయని పేర్కొన్నాయి.

▸▸తరువాయి 6లో..

## విచారణకు సహకరించని ఉదయ్ కృష్ణారెడ్డి

మరోసారి కోర్టును ఆశ్రయించిన పోలీసులు



▸▸వివరాలు 6లో..

## అమెరికాలో జన్మహక్కు పౌరసత్వం కఠినతరం

- సుప్రీంకోర్టు నుంచి ఎదురుదెబ్బ తగిలిన కొన్ని వారాలకే కొత్త ఆర్డర్లు
- కీలక నిర్ణయం దిశగా ట్రంప్ ముందడుగు



**న్యూఢిల్లీ,ఆగస్టు7(నినాదం):** అమెరికాలో జన్మహక్కు పౌరసత్వం నిబంధనలను కఠినతరం చేసే దిశగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో కీలక ముందడుగు వేశారు. ఈ అంశంపై సుప్రీంకోర్టు నుంచి ఎదురుదెబ్బ తగిలిన కొన్ని వారాలకే, ఆ నిబంధనలను పరిమితం చేసేలా రెండు కొత్త ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లపై గురువారం ఆయన సంతకం చేశారు. గతంలో జారీ చేసిన విస్తృత ఆదేశాలతో పోలిస్తే ఇవి పరిమిత స్థాయిలో ఉన్నప్పటికీ, వీటిపై కూడా న్యాయపరమైన సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. మొదటి ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ప్రకారం, కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో అమెరికాలో జన్మించిన పిల్లలకు పౌరసత్వం దక్కకుండా నిబంధనలు విధించారు.

▸▸తరువాయి 6లో..

## చేనేత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

చేనేత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తుమ్మల నాగేశ్వరావు అన్నారు. జాతీయ చేనేత దినోత్సవ వేడుకల్లో మంత్రి పాల్గొని ప్రసంగించారు.



▸▸వివరాలు 6లో..

## మైసీలియం, వ్యవసాయ వ్యర్థాలతో 'ఫంగీ లెదర్'

యువ పారిశ్రామికవేత్తల వినూత్న ఆవిష్కరణ

- పర్యావరణహిత ప్రత్యామ్నాయ తోలు తయారీ
- రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటు.. ప్రత్యేక ప్రదర్శన



▸▸వివరాలు 6లో..

## తెలంగాణలో అధికారంలోకి రావడమే బీజేపీ టార్గెట్

రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు



▸▸వివరాలు 6లో..

**వచ్చే ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేసి గెలుపు సాధిస్తామన్నారు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు. తెలంగాణలో అధికారంలోకి రావడమే బీజేపీ టార్గెట్ అని స్పష్టం చేసారు.**



## బోఫోర్స్ కేసును కొట్టేసిన సుప్రీం

హిందూజా సోదరులకు ఊరట

40 ఏళ్ల బోఫోర్స్ కేసుకు పడిన తెర

**న్యూఢిల్లీ,ఆగస్టు7(నినాదం):** దాదాపు నాలుగు దశాబ్దాలుగా దేశ రాజకీయాల్లో చర్చనీయాంశంగా నిలిచిన బోఫోర్స్ కుంభకోణం కేసుకు తెరపడింది. దీని నుంచి హిందూజా సోదరులకు ఊరట కల్పిస్తూ ఢిల్లీ హైకోర్టు 2005లో ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన చివరి పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. దీంతో ఈ కేసుకు సంబంధించిన న్యాయపరమైన ప్రక్రియ పూర్తిగా ముగిసింది. జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ వినోద్ కె. చంద్రన్‌తో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది.

▸▸తరువాయి 6లో..

## రూ.61 కోట్లతో ప్రభుత్వాసుపత్రులకు వైద్య పరికరాల కొనుగోలు

రోగ నిర్ధారణ సామర్థ్యం పెంపు, తల్లి, నవజాత శిశువుల ఆరోగ్య రక్షణ, ఎమెర్జెన్సీ సేవల పటిష్టత లక్ష్యం

- 20 కేటగిరీల్లో 582 పరికరాల కొనుగోలుకు ఆమోదం
- సమకూరనున్న 235 ఐసియు వెంటిలేటర్లు,
- క్షయ వ్యాధి నిర్ధారణకు 100 పోర్టబుల్ ఎక్స్‌రే యంత్రాలు
- కొనుగోలుకు బియఫ్‌సి ఆమోదం



**అమరావతి,ఆగస్టు 7(నినాదం):** ప్రభుత్వాసుపత్రుల్లో వైద్య సేవలను మెరుగుపర్చే ప్రక్రియలో భాగంగా వైద్యారోగ్య శాఖ రూ.61 కోట్ల వ్యయంతో వివిధ వైద్య పరికరాలను కొనుగోలు చేసేందుకు నిర్ణయించింది. వ్యాధి నిర్ధారణ సామర్థ్యాన్ని పెంచేందుకు, తల్లి మరియు నవజాత శిశువుల ఆరోగ్య పరిరక్షణకు, ఎమెర్జెన్సీ మరియు క్రిటికల్ కేర్ సేవలను మరింత పటిష్టం చేసేందుకు 20 రకాలకు చెందిన 582 వైద్య పరికరాలను గతంలో పిలిచిన టెండర్ల ద్వారా కొనుగోలు చేసేందుకు మంత్రిత్వ శాఖకు చెందిన బిడ్ ఫైనలైజేషన్ కమిటీ(బిఎఫ్‌సి) శుక్రవారంనాడు ఆమోదం తెలిపింది.

▸▸తరువాయి 6లో..

## జీఐ ట్యాగ్‌తో కుప్పడం పట్టుకు మరింత విశిష్టత

- ఉచిత విద్యుత్తు, రూ.25 వేల ఆర్థిక సాయంతో ఊరట
- సీఎం చంద్రబాబుతో ముఖాముఖిలో చేనేత కుటుంబాలు



**చీరాల, ఆగస్టు 7 (నినాదం):** వన్ డిస్ట్రిక్ట్‌వన్ ప్రొడక్ట్ ద్వారా కుప్పడం పట్టు చీరలకు మరింత విశిష్టమైన గుర్తింపు లభించిందని, జీఐ ట్యాగ్‌తో అమ్మకాలు 30 శాతం మేర పెరిగాయని చేనేత కుటుంబాలు సీఎం చంద్రబాబుతో అన్నారు. గత ఏడాది చీరాలలో తయారైన కుప్పడం పట్టు తోపాటు అత్యుత్తమ వృత్తి నైపుణ్యానికి కేంద్ర ప్రభుత్వ అవార్డు దక్కడం గర్వకారణమన్నారు.

▸▸తరువాయి 6లో..

## పంట కుంటల నిర్మాణానికి రైతులను ప్రోత్సహించాలి
### అదనపు కలెక్టర్ నర్సింగరావు




**గద్వాల బ్యూరో ఆగస్టు 6( నినాదం ):** వర్షాలు తక్కువగా కురుస్తున్నందున ఉన్న జలాలను నిలువ చేసుకునేందుకు రైతులు పంట కుంటలను నిర్మించుకునేలా సంబంధిత అధికారులు ప్రోత్సహించాలని అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. వానాకాలంలో పంటల సాగు, స్మార్ట్ రేషన్ కార్డులు, కొత్త పెన్షన్లు తదితర అంశాలపై శుక్రవారం హైదరాబాద్ నుంచి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ లో సమీక్షించారు. రాష్ట్రం లోనీ పలు ప్రాజెక్టులకు ప్రస్తుతం వరద నీరు వస్తున్నప్పటికీ ఆయా రిజర్వాయర్లలో నీటి లభ్యతను ఆధారంగా చేసుకొని రైతులు వేయాల్సిన పంటలపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. కాలువల కింద రైతులు వరి సాగు చేస్తే వరద నీరు తగ్గినప్పుడు పంటలు చేతికి వచ్చేవరకు సాగునీటి విడుదల కష్టమవుతుందన్నారు. దీనినీ దృష్టిలో ఉంచుకొని ఈనెల 8న ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డులు సమావేశాలు నిర్వహించుకొని నిర్ణయాలు తీసుకోవాల్సి ఉందన్నారు. భూగర్భ జలాల పరిస్థితి, విద్యుత్ సరఫరాపై అంచనాలతో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయ సమావేశాలు నిర్వహించి ముందుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. వచ్చే వేసవి వరకు తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని, ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురుస్తున్నం దున రైతులు ఆరుతడి పంటలు సాగు చేసేలా సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు సూచించాలన్నారు. పంటల వైవిధ్యంతోనే రైతులు ఆర్థిక పురోగతి సాధిస్తారని పేర్కొన్నారు. వన మహోత్సవంలో భాగంగా లక్ష్యాలకు అనుగుణంగా మొక్కలను నాటి సంరక్షించాలన్నారు. ఆగస్టు 15 నుంచి స్మార్ట్ రేషన్ కార్డులు అందజేసేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. అర్హులైన వారంద రికీ కొత్తగా పెన్షన్లు ఇచ్చేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అన్ని జిల్లాల అధికారు లను ఆదేశించారు. గద్వాల ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత జిల్లా అధికారులతో కలిసి వీసీ లో పాల్గొన్న అదనపు కలెక్టర్ నర్సింగరావు వీసీ అనంతరం జిల్లా అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రాజ్ కుమార్, డిఆర్డిఓ ముషాహిదా బేగం, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రాజ్ కుమార్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్‌ను నిరోదించేందుకే హెచ్‌పివి వ్యాక్సిన్
### యుపిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ దేవిశ్రీ
### నయబజార్ పాఠశాలలో బాలికలకు ఉచిత హెచ్‌పివి వ్యాక్సినేష



**ఖమ్మం, ఆగస్టు 7(నినాదం):** క్యాన్సర్ వ్యాధిని సమూలంగా నిరోదించేందుకే హెచ్పీవీ వ్యాక్సిన్ ను ఇస్తున్నట్టు యూపీ హెచ్సీ వెంకటేశ్వర్ నగర్ వైద్యాధికారి డాక్టర్ ఐ దేవిశ్రీ తెలిపారు. శుక్రవారం నాయబజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 14ఏళ్ళు నిండిన బాలిక లకు హెచ్ పి వి వ్యాక్సిన్ వేశారు. బాలికల్లో భవిష్యత్తులో గర్భశాయ క్యాన్సర్ రాకుండా నిరోధించిందానికి ఈ వ్యాక్సిన్ ఇస్తున్నట్టు వెల్లడించారు. ఈ లక్ష్యంతో జిల్లా కలెక్టర్ దివాకర ఐఏఎస్ ఆదేశాలమేరకు జిల్లా వైద్యాధికారి ది రామారావు పర్యవేక్షణలో ఈ కారక్రమం అమలుజరుగుతుందన్నారు. అధికారికంగా ఆరోగ్య శాఖ నిర్వహిస్తున్నప్ప టికీ దీనిపై కొంత మంది అపోహలు, అనుమానాలు వ్యక్తంచేస్తున్నారని పేర్కొంటూ దానిని తీవ్రంగా ఖండించారు. దీనివల్ల ఎలాంటి చెడుప్రభావాలు ఉండవని, అర్హులైన ప్రతీ బాలికలకు వ్యాక్సిన్ వేస్తున్నామని ఇందు కోసం తాము అన్ని పాఠశాలల్లో వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. దీనికిపాఠశాలల యాజమాన్యాలు, తల్లి, దండ్రులు బాధ్యత తీసుకోవాలని ప్రతీఒక్కరూ సహకరించి కార్య క్రమం విజయవంతం అయ్యేలా కృషిచేయా లని కోరారు. వ్యాక్సినేషన్ కార్యక్రమానికి సహకరించిన పాఠశాల సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం డాక్టర్ దేవిశ్రీ విద్యార్థు లకు, పాఠశాల సిబ్బంది, పిల్లల కుటుంబస భ్యులకు ఈ వ్యాక్సిన్ కార్యక్రమంపైన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ దేవిశ్రీ తోపాటు సూపర్ వైజర్ జడ్ ఎస్తయపాల్, ప్రధానోపాధ్యాయురాలు సి హెచ్ ఉషారాణి, ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలు ఎం గురవమ్మ, ఏ ఎన్ ఎంలు వి శారద, కోట ప్రసన్న, బి సంధ్య, ఎస్ కె రహీంబి, తదితరులు పాల్గొన్నారు.

## ఓబిసి మండల్ యాదవ్‌కు మల్లిబాబుయాదవ్ నివాళులు



**ఖమ్మం, ఆగస్టు 07 (నినాదం):** భారతదేశ చరిత్రలో ఓబీసీలకు ఆగస్టు 7న ఒక సువర్ణ అధ్యాయానికి నాంది పలికిందని, దానికి స్ఫూర్తి ప్రదాత బిందేశ్వర్ ప్రసాద్ మండల్ యాదవ్ అని, ఆ మహా నీయుని వల్లనే ఓబీసీల తలరా తలు మారడం జరిగిందని, ఓబీసీ డైరెక్టర్ మేకల మల్లి బాబు యాదవ్ అభిప్రాయపడ్డారు. మండల్ రిజర్వేషన్ దేశసందర్భంగా కూసుమంచి మండలం పండితాపురం లో బిందేశ్వర్ ప్రసాద్ మండల్ యాదవ్ చిత్రపటానికి మల్లి బాబు యాదవ్ పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ ఆగస్టు 7ను సామాజిక న్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నామని, దీనికి ప్రధాన వ్యక్తి బిందేశ్వర్ ప్రసాద్ యాదవ్ కోట్లాది వెనుకబడిన వర్గాల జీవితాలలో వెలుగు నింపిన మహా నాయకుడు అని, తన జీవితమంతా రాజకీయ అధికారం కోసం కాకుండా ఓబిసి,ఎస్సీ,ఎస్టీ వర్గాల కు సమాన అవకాశాలు కల్పించాలని పోరాటం చేసిన మహామేధావి అని, ఆ పోరాటానికి ఫలితంగా 1990 ఆగస్టు 7వ తారీఖున నాటి ప్రధాని వీపీ సింగ్ హయాంలో ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించడం జరిగిందని, ఆ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా, ఎంపీగా,కేంద్ర మంత్రిగా పనిచేసినప్పటికీ నిత్యం బడుగు బలహీన వర్గాల పక్షాన పోరాడి రిజర్వేషన్లు సాధించారు. అంతకుముందు ఏ నాయకుడు చేయని విధంగా దేశమంతటా పర్యటించి బడుగు బలహీన వర్గాల స్థితిగతులను గమనించి దేశంలో 52 శాతం పైగా ఉన్న బీసీలకు రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరం ఉందని కేంద్రానికి నివేదిక ఇవ్వడం జరిగిందని, ఒక వ్యక్తి తన కోసం కాకుండా సమాజం కోసం ప్రతికారని, అలాంటి బీపీ మండల్ యాదవ్ ను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి షేక్ ఫతే మహమ్మద్, కొమ్మి నేపల్లి గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ మేకల మల్లికార్జునరావు, ఓబీసీ జిల్లా నాయకులు చల్ల మల్లయ్య, మండల కాంగ్రెస్ నాయకులు షేక్ రబ్బానీ పాషా, శీలం పుల్లయ్య, ఎమ్మార్పీఎస్ మండల అధ్య క్షులు పాటిబండ్ల ప్రసాద్, గుగులోతు రవి, జక్కంపూడి వెంకటేశ్వర్లు, బండి ఉపేందర్, ధరావత్ హరిచంద్ర, మేకల లక్ష్మీనారాయణ, భూక్య వీరన్న, బానోతు లక్ష్మ, దేరంగుల తిరపయ్య, రామా రావు, తురక బిక్షం, చల్ల చిన్న మల్లయ్య, పగిడిపల్లి రాములు, మొగిలి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



### సత్యప్రసాద్‌కు మాజీ మంత్రి
## పువ్వాడ నివాళులు

**ఖమ్మం, ఆగస్టు 7(నినాదం):** బొమ్మ విద్యాసంస్థల అధినేత బొమ్మ రాజేశ్వరరావు కుమారుడు బొమ్మ సత్య ప్రసాద్ అనారోగ్యంతో పరమపదించారు. వారి పార్థివదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించిన మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ..వారి కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.సత్య ప్రసాద్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

## గద్వాల చేనేత బ్రాండ్‌ను కాపాడుకోవాలి
### చేనేత కార్మికుల సంక్షేమానికి పథకాల వర్తింపు.
### బ్యాంకుల ద్వారా కార్మికులకు రుణాలు ఇప్పించేందుకు కృషి
### గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి




**గద్వాల బ్యూరో ఆగస్టు 7 (నినాదం):** పట్టు, కాటన్ సమ్మిళితం చేస్తూ గద్వాల చేనేత జరీ చీరలను నేస్తుంటారని, భౌగోళిక గుర్తింపును పొందిన ఈ బ్రాండ్ ను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో ఐడిఓసి సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన చేనేత సహకార సంఘాలను బలోపేతం చేసేందుకు తగు చర్యలు తీసుకుంటామని, త్వరలోనే సంఘాల ప్రతినిధులు బ్యాంకర్లతో సమావేశాలు నిర్వహించి కార్మికులకు రుణాలు ఇప్పించేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రవేశపెట్టిన వివిధ పథకాలను అర్హులైన కార్మికులందరూ సద్వినియోగం చేసుకునేలా జియో టాగ్ నెంబర్లను ఇప్పించడం జరుగుతుందన్నారు. భవిష్యత్తు తరాలు కూడా చేనేత వృత్తిలో ఆర్థిక పురోగతి సాధించేలా గద్వాల చేనేత రంగాన్ని పటిష్టం చేసేందుకు తన శాయశక్తుల కృషి చేస్తానన్నారు. వ్యవసాయం తర్వాత దేశంలో అత్యధిక జనాభా చేనేత వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తోందని, స్వాతంత్ర ఉద్యమంలోనూ గాంధీజీ విదేశీ వస్త్రాలను బహిష్కరించి స్వదేశీ చేనేత రంగాన్ని బలోపేతం చేసేందుకు కృషిచేసిన విషయాన్ని గుర్తు చేశారు. గద్వాల సంస్థానాధీశులు వందేళ్ళ కిందటే ఇక్కడి కొంతమంది చేనేత కళాకారులను బెనారస్ పంపించి వృత్తిలో నైపుణ్యాలు పెంపొందించుకునేందుకు ప్రోత్సహించారన్నారు. అదనపు కలెక్టర్ నర్సింగరావు మాట్లాడుతూ నేతన్నకు భరోసా, చేయూత, త్రిఫ్ట్ ఫండ్, భీమా, తదితర పథకాలతో ప్రభుత్వం చేనేత కార్మికుల అభ్యున్నతికి కృషి చేస్తుందన్నారు. నూతనంగా ఎన్నికైన చేనేత సహకార సంఘాలు బాధ్యతగా పనిచేసి ఇక్కడి కార్మికుల సంక్షేమానికి పాటు పడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత కాలానికి తగ్గట్టుగా చేనేత వస్త్రాలు నేయాలని, ఫలితంగా మార్కెటింగ్ అవకాశాలను విస్తృత పరుచుకోవచ్చ న్నారు. ఇటీవల ప్రభుత్వం జిల్లాకు చెందిన చేనేత కార్మికుల రూ. 14.23 కోట్ల రుణాలను మాఫీ చేయడం జరిగిందన్నారు. ఇక్కడి మాస్టర్ వీవర్స్, సహకార సంఘాల ప్రతినిధులు చేనేత కార్మికుల పిల్లల చదువులకు, వైద్య అవసరాలకు సామాజిక బాధ్యతగా తమ వంతుగా తోడ్పాటును అందించాలని సూచించారు. గద్వాల చేనేత రంగాన్ని కాపాడు కునేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, భవిష్యత్తు తరాలు కూడా చేనేత వ్యాపారాలతో ఉపాధి అవకాశాలను మెరుగుపరచుకొని ముందుకెళ్లాలని ఆకాంక్షించారు. అనంతరం ఎమ్మెల్యే, ఇతర అతిథులు ఇటీవల నూతనంగా ఎన్నికైన జోగులాంబ గద్వాల, వనపర్తి, నాగర్ కర్నూల్ జిల్లాలకు చెందిన చేనేత సహకార సంఘాల అధ్యక్షులను, సీనియర్ చేనేత కార్మికులను సన్మానించారు. చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా రూ. 85 లక్షల విలువైన నేతన్న భద్రత చెక్కును కార్మికులకు అందజేశారు. అంతకుముందు గద్వాలలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు చేనేత దినోత్సవ ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి బోయ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప, గద్వాల మున్సిపల్ చైర్ పర్సన్ జయలక్ష్మి, జిల్లా చేనేత జౌళి శాఖ ఏడి ఇందిర, పలువురు ప్రజాప్రతినిధులు, చేనేత సహకార సంఘాల అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు, నేతలు, మాస్టర్ వీవర్స్, చేనేత కార్మిక సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## అర్బన్ అభివృద్ధి పనుల ప్రతిపాదనలు అందజేత
### కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ని కలిసిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్



**నిజామాబాద్ ప్రతినిధి, ఆగస్టు 7 (నినాదం):** నగరంలోని పలు రోడ్లు, వంతెనల అభివృద్ధి పనులకు సంబంధించి ప్రతిపాదనలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ తో కలిసి శుక్రవారం కేంద్ర రోడ్డు, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ప్రతిపాదనలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరం లోని దేవీ రోడ్డు, రైల్వే స్టేషన్, నాందేవాడ అదనపు వంతెన ( ఆర్ వో బీ ) మంజూరు చేయాలని కోరడం జరిగిందన్నారు. అలాగే సోనీ ఫంక్షన్ హాల్ సమీపంలో ఎల్లమ్మ గుట్ట వద్ద ఆర్ యూబీ ఏర్పాటు చేయడం అత్యంత ఆవశ్యకమన్నారు. ఇందుకోసం రెండింటికి రూ. 170 కోట్లు మంజూరుకావాలన్నారు. అలాగే నిజామాబాదులోని రేడియో స్టేషన్ నుంచి ముదక్పల్లి పాత జిపి ఆఫీస్ వరకు రూ. 30 కోట్లతో ఆర్ అండ్ బీ రోడ్డు కోసం ప్రతిపాదించడం జరిగిందన్నారు. వర్ని జంక్షన్ నుంచి నిజామాబాద్, డిచ్పల్లి, ఇందల్వాయి, భీమ్గల్ మీదుగా కమ్మర్పల్లి వరకు నగరాన్ని కలుపుతూ 107 కిలోమీటర్ల పొడవుతో కొత్త జాతీయ రహదారి ప్రతిపాదనను కూడా అందజేశామన్నారు. మరొక రోడ్డు నగరంలోని రాజీవ్ గాంధీ విగ్రహం నుంచి ఎన్టీఆర్ విగ్రహం, దుబ్బ మీదుగా కాలూర్ రోడ్డు ను పూర్తి చేయాలని కోరడం జరిగిందన్నారు. ఎమ్మెల్యేతో పాటు రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి అభయ్ పాటిల్, ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు ఉన్నారు.

## ప్రజాదర్బార్‌లో భద్రాద్రి జిల్లా అభివృద్ధికి
## రూ.500 కోట్ల ప్రత్యేక ప్యాకేజీ కోరిన ఆర్ఎల్‌డి పార్టీ






**కొత్తగూడెం, ఆగస్టు 7(నినాదం)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆర్ ఎల్ డి పార్టీ జిల్లా కార్యదర్శి మూడ్ వీరన్న మరియు ఆర్ఎల్డి పార్టీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు గుగులోత్ వినాయక్ భద్రది జిల్లా సర్వతోముఖ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ ప్రకటించి రూ. 500 కోట్ల నిధులు కేటాయించాలని రాష్ట్రీయ లోక్ దళ్ (ఆర్ఎల్డీ) పార్టీ డిమాండ్ చేసింది. హైదరాబాద్ ప్రజా భవన్‌లో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో పార్టీ రాష్ట్ర నాయకులు ఈ మేరకు వినతిపత్రాన్ని సమర్పించారు. జిల్లా వెనుకబడిన ప్రాంతంగా కొనసాగుతోందని, విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి, గిరిజన సంక్షేమం, రోడ్లు, తాగునీటి వంటి కీలక రంగాల్లో సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని వారు కోరారు. విద్యారంగంలో గిరిజన గురుకులాలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో మౌలిక వసతులు పెంచడంతో పాటు ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేయాలని, ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడిని అరికట్టి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని సూచించారు. ప్రతి తండాలో డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేయాలని కూడా కోరారు. వైద్యరంగంలో ప్రతి మండలంలో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులు ఏర్పాటు చేసి వైద్యులు, మందులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా చూడాలని, ప్రైవేట్ ఆసుపత్రుల అధిక ఫీజులు, అనవసర వైద్య పరీక్షలపై నియంత్రణ తీసుకురావాలని, ఆరోగ్యశ్రీ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ రంగంలో రైతులకు సకాలంలో రుణాలు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించడంతో పాటు కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) వద్ద ధాన్యం కొనుగోలు చేసి దళారీల దోపిడిని అరికట్టాలని, సేంద్రీయ వ్యవసాయానికి ప్రోత్సాహకాలు అందించాలని పేర్కొన్నారు. అలాగే సీతారామ ప్రాజెక్టుతో పాటు పెండింగ్‌లో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేసి ఆయకట్టుకు నీరు అందించాలని కోరారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు ఐటీడీఏ ద్వారా స్వయం ఉపాధి పథకాలను విస్తరించాలని, గిరిజన యువతకు రుణ సౌకర్యాలు కల్పించాలని సూచించారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వడం, అటవీ హక్కుల చట్టాన్ని కచ్చితంగా అమలు చేయడం, జిల్లాలో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయడం వంటి డిమాండ్లను కూడా వినతిపత్రంలో పొందుపరిచారు. ప్రతి తండాకు సీసీ రోడ్లు నిర్మించడం, మిషన్ భగీరథ ద్వారా 24 గంటల తాగునీటి సరఫరా కల్పించాలని ఆర్ఎల్డీ కోరింది. ఈ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులకు అందజేస్తున్నట్లు తెలిపింది. ప్రభుత్వం 15 రోజుల్లోగా ఈ డిమాండ్లపై సానుకూలంగా స్పందించాలని, లేనిపక్షంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో భారీ ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తామని రాష్ట్రీయ లోక్ దళ్ పార్టీ హెచ్చరించింది.

## ఫ్యూచర్‌లైన్‌లో బోనాల వేడుకలు



**నిజామాబాద్ ప్రతినిధి, ఆగస్టు 7 (నినాదం) :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ ఫ్యూచర్ లైన్ పాఠశాలలో శుక్రవారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు బోనాల పండుగ విశిష్టత, తెలంగాణ సంస్కృతిలో దాని ప్రాముఖ్యత, పండుగకు సంబంధించిన సంప్రదాయాలు, ఆచారాల గురించి విద్యార్థులకు వివరించారు. భావితరాలకు మన సంస్కృతి, సంప్రదాయాలను పరిచయం చేయడం, విద్యార్థుల్లో సాంస్కృతిక విలువల పట్ల అవగాహన పెంపొందించడమే ఇటువంటి కార్యక్రమాల ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ప్రియాంక, ఇన్‌చార్జ్ లావణ్య, ఉపాధ్యాయులు సంధ్య, గౌతమి, శిరీష, మాధవి పాల్గొన్నారు. వారు విద్యార్థులకు బోనాల పండుగ ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాధాన్యతను వివరించి, మన సంప్రదాయాలను గౌరవిస్తూ వాటిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సూచించారు.

## మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అరెస్ట్



**కల్వకుర్తి ఆగస్టు 7 (నినాదం):** నాగర్ కర్నూల్ జిల్లా లింగాల మండల కేంద్రంలో పండుగ సాయన్న విగ్రహం తొలగింపు అంశంపై కొనసాగుతున్న ఆందోళనకు సంఘీభావం తెలిపేందుకు వెళ్తున్న విషయాన్ని పోలీసులు ముందస్తుగా గుర్తించి కొట్ర గేట్ సమీపంలో తన వాహనాన్ని అడ్డుకున్నారు. అనంతరం ఊర్కొండపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో పోలీసులకు మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజుకు మధ్య వాగ్వివాదం జరిగింది. శాంతి భద్రతల పరిరక్షణ కొరకు సహకరించాలని స్థానిక పోలీసులు బుజ్జగించారు. అయినా జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ పై ఆయన అసహనం వ్యక్తం చేశారు. పలుమార్లు ఫోన్ చేసినా ఈ ఎస్పీ స్పందించడం లేదన్నారు. పోలీసు బలగం వందల్లో ఉంటే తనకు లక్షల మంది ప్రజాబలం ఉందని తన సత్తా ఏమిటో చూపిస్తేనే పోలీసులకు తెలిసి వస్తుందంటూ పోలీసులపై ఫైర్ అయ్యారు. దీంతో కొద్దిసేపు ఆ ప్రాంతాల్లో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఉరుకొండ పోలీస్ స్టేషన్ కి భారీగా అభిమానులు చేరుకోవడం జరిగింది.

## ఉమ్మడి జిల్లా కాంక్రీట్ మిల్లర్స్ కమిటీల ఏకగ్రీవ ఎన్నిక



**నారాయణ పేట ప్రతినిధి,ఆగస్టు7(నినాదం):** కాంక్రీట్ మిల్లర్ కార్మికుల సమస్యల పరిష్కారానికి అనునిత్యం కృషి చేస్తామని కాంక్రీట్ మిల్లర్స్ లేబర్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు వాకిటి నాగ రాజు, ప్రధాన కార్యదర్శి బి. గోపాల్ స్పష్టం చేశారు. నారాయణ పేట జిల్లా కేంద్రంలో శుక్రవారం నాడు నిర్వహించిన కాంక్రీట్ మిల్లర్స్ లేబర్ యూనియన్ సమావేశంలో మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్ కర్నూల్, నారాయణ పేట జిల్లాల నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మాట్లా డుతూ... కాంక్రీట్ మిల్లర్ లేబర్ గుర్తింపు కోసం అహర్నిశలు కృషి చేస్తున్నామని, ప్రభుత్వం తమను గుర్తించే వరకు పోరాటం ఆపేది లేదని తేల్చి చెప్పారు. కాంక్రీట్ మిల్లర్ కార్మికులకు ఇతర విభాగాల నుంచి ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించడానికి యూనియన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

**ఏకగ్రీవంగా ఎన్నికైన జిల్లాల నూతన కమిటీలు**

నారాయణ పేట జిల్లా అధ్యక్షులుగా జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శులుగా మల్లేష్, బాబు నాయక్. నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షులుగా జూపల్లి వెంకటయ్య, ఉపాధ్యక్షులుగా జంగయ్య, కోశాధికారిగా వెన్నచర్ల మల్లేష్. మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షులుగా కే. బుచ్చిబాబు, కార్య దర్శిగా సోమయ్య, కోశాధికారిగా అంజి. వనపర్తి జిల్లా అధ్యక్షులుగా ఆర్. నాగయ్య, ఉపాధ్యక్షులుగా మల్లేష్, కార్యదర్శిగా పరశురామ్. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పరశురాం, సలహాదారులు ఈ. తిరుపతయ్య, గ్రేటర్ ప్రధాన కార్యదర్శి తొండ వెంకటేష్, ఈస్ట్ జోన్ ప్రధాన కార్యదర్శి శ్రీరాములు, సభ్యులు లక్ష్మయ్య, ఆంజనేయులు, చెన్నప్ప, రాజేష్, బాల్రాజ్ లతో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో హాజరైన మిల్లర్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## 30 నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటు ప్రతిపాదన

**ప్రస్తుతం 880 పోలింగ్ కేంద్రాలు..**
**ప్రతిపాదనలు అమలైతే**
**910కు పెరగనున్న సంఖ్య**
**రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష**
**నిర్వహించిన జిల్లా ఎన్నికల అధికారి,**
**కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**



**నాగర్ కర్నూల్,ఆగస్టు7 (నినాదం)** నాగర్‌కర్నూల్ జిల్లాలో ఎన్నికల నిర్వహణను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా చేపట్టడంతో పాటు ప్రతి ఓటరు తన ఓటు హక్కును సులభంగా వినియోగించుకునేలా పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణకు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ తెలిపారు. నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ప్రతిపాదించిన నూతన పోలింగ్ కేంద్రాలు, పోలింగ్ కేంద్రాల మార్పులు, పేర్ల సవరణలకు సంబంధించిన అంశాలపై నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతిని ధులతో జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడు తూ.. ప్రస్తుతం జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలో 880 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. భారత ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాల మేరకు ఓటర్ల సంఖ్య, భౌగోళిక పరిస్థితులు, పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు చేరుకోవాల్సిన దూరం, గ్రామాల విస్తీర్ణం, ప్రజల సౌకర్యం వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించిన అనంతరం మరో 30 కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వెల్లడిం చారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణలో భాగం గా ప్రస్తుతం ఉన్న ఐదు పోలింగ్ కేంద్రాల లొకేషన్ లను మార్చేందుకు ప్రతిపాదనలు రూపొందిం చినట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లోని ఓటర్లకు మరింత సౌకర్యవంతంగా ఉండేలా ఈ మార్పులు చేపడుతున్నామని చెప్పారు. అలాగే స్థానిక పరిస్థితులు, రెవెన్యూ గ్రామాల పేర్ల మార్పులు, పరిపాలనా అవసరాలను దృష్టిలో ఉంచుకుని రెండు పోలింగ్ కేంద్రాల పేర్లను మార్చే ప్రతిపాదనలు కూడా సిద్ధం చేసినట్లు వెల్లడిం చారు. ప్రస్తుతం రెండు కిలోమీటర్లకు పైగా దూరంలో ఉన్న ప్రాంతాలను గుర్తించి 27 కొత్త పోలింగ్ కేంద్రాలను ప్రతిపాదించినట్లు తెలిపారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని ఓటర్లు సమీప పోలింగ్ కేంద్రాల్లోనే తమ ఓటు హక్కును సులభంగా వినియోగించుకునే అవకాశం కలుగుతుం దన్నారు. ఈ ప్రతిపాదనలన్నీ అమల్లోకి వస్తే ప్రస్తుతం ఉన్న 880 పోలింగ్ కేంద్రాల సంఖ్య 910కు పెరుగుతుందని, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటిస్తున్నామని రాజకీయ పార్టీల ప్రతినిధులకు, కలెక్టర్ స్పష్టం చేశారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు క్షేత్రస్థాయి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తమ సూచనలు, అభ్యంతరాలు, సలహాలను లిఖితపూర్వకంగా అందజేయాలని కోరారు. అందిన ప్రతి సూచనను ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పరిశీలించి, అవసరమైన మార్పులు చేసి తుది ప్రతిపాదనలు ఎన్నికల సంఘానికి పంపనున్నట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్త కుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని, నల్లమల్ల అటవీ ప్రాంతంలో ప్రతిపాదించిన పోలింగ్ కేంద్రాలకు ప్రభుత్వ భవనాలు ఉండేలా అంగన్వాడీ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపా దనలు పంపాలని కలెక్టర్ ఆర్డీవోను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. చిన్నయ్య, ఆర్డీవోలు బన్సీలాల్, అర్చన, యాదగిరి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రవికుమార్, జిల్లా ఎన్నికల శాఖ అధికారులు, రెవెన్యూ అధికా రులు, వివిధ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు వంశీ, నరేందర్ గౌడ్, నరేందర్ రావు, రామకృష్ణ, బాలకృష్ణ, ఎం. డి. హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

### తల్లిపాల ప్రాముఖ్యతను
## ప్రతి తల్లి గుర్తించాలి
### సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి



**కల్వకుర్తి,ఆగస్టు 7 (నినాదం):** తలకొండపల్లి మండలం పడకల్ లోని అంగన్వాడి కేంద్రలలో ఆగస్టు 1 నుంచి 7 వరకు నిర్వహిస్తున్న ప్రపంచ తల్లిపాల వారోత్సవాల కార్య క్రమంలో గ్రామ సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సర్పంచ్ డోకూరి సునీత ప్రభా కర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి తల్లి శిశువుకు తొలి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే అందించాలని, తల్లిపాలు శిశువుకు సం పూర్ణ పోషకాహారంతో పాటు రోగని రోధక శక్తిని పెంచుతా యని అన్నారు. తల్లి, బిడ్డ ఆరోగ్య పరిరక్షణలో తల్లిపాల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. తల్లులకు పోషక ఆహారంశిశు సంరక్షణ పై అవగాహన కల్పించారు. అనంతరం అక్షరాభ్యా సం, కార్యక్రమం నిర్వా హించారు. కార్యక్రమంలో అంగన్వా డి టీచర్లు అంతుల్ బేగం, సమంత, గ్రామ పంచాయతీ సెక్రెటరీ రమాదేవి, వార్డు సభ్యులు వాజీద్, లట్టుపల్లి వసంత, తల్లులు, గర్భిణీలు, బాలింతలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది.

### మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించిన
## సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి




**కల్వకుర్తి ఆగస్టు 7 (నినాదం)** తలకొండపల్లి మండలం పడకల్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించిన సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థు లకు నాణ్యమైన భోజనంతోపాటు మెనూ ప్రకారం భోజనాలు అందించాలని ఉపాధ్యాయులకు చూపించడం జరిగింది. అనంతరం పాఠశాలలో విద్యార్థిని, విద్యార్థులకు ఏమైనా సమస్యలు ఉన్నాయ అని విద్యార్థినీ, విద్యార్థు లకు, అడిగి తెలుసుకున్న గ్రామ సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి పాఠశాలలకు ప్రభు త్వం నుండి వచ్చిన షూ , యూనిఫామ్ లు త్వరలో విద్యార్థి విద్యార్థులకు పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు వార్డు సభ్యులు వాజిద్ గ్రామస్తులు పాల్గొన్నారు.

# చేనేత కళకు ఆదరణ పెంచి..
# చేనేత కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలి

**జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా హ్యాండ్లూమ్ వాక్ ర్యాలీ ప్రారంభించిన అడిషనల్ కలెక్టర్ పాండు**




**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 07 (నినాదం ):** చేనేత రంగాన్ని ప్రోత్సహించడంతో పాటు, చేనేత కార్మికుల కళానైపుణ్యానికి తగిన గుర్తింపు కల్పించి, వారి సంక్షేమానికి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని అడిషనల్ కలెక్టర్ పాండు అన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించు కొని శుక్రవారం సంగారెడ్డి ప్రభుత్వ ఐటీఐ కళాశాల నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించిన హ్యాండ్లూమ్ వాక్ ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత రంగం మన దేశ సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలుస్తోందన్నారు. తరతరాలుగా చేనేత వృత్తిని కొనసాగిస్తూ తమ నైపుణ్యంతో అద్భుతమైన వస్త్రాలను తయారు చేస్తున్న చేనేత కార్మికుల కృషిని ప్రతి ఒక్కరూ గుర్తించి గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలు చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి వినియోగించడం ద్వారా చేనేత కార్మికులకు తమ వంతు సహకారం అందించాలని కోరారు. చేనేత రంగానికి ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ, ప్రోత్సాహక పథకాలపై చేనేత కార్మికులకు అవగాహన కల్పించి, అర్హులైన ఒక్కరూ వాటిని సద్వినియోగం చేసుకు నేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ ర్యాలీ లో హ్యాండ్లూమ్ శాఖ సహాయ సంచాల కులు వెంకట్రావు,జిల్లా అధికారులు, సిబ్బంది, చేనేత కార్మికులు, యువత, ప్రజలు పాల్గొన్నారు.

# మంచిర్యాలలో మాఫియా రాజ్యం..!

**రూ.470 కోట్ల రుణం..**
**వారంలోనే రూ.190 కోట్ల చెల్లింపా?**
**ఎమ్మెల్యే పై ఈ డీ, ఏసీబీ, విజిలెన్స్ తో సమగ్ర విచారణ జరపాలి**
**బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్**



**మంచిర్యాల, ఆగస్టు 7 (నినాదం):** ఒకప్పుడు బొగ్గు గనులు, పారిశ్రామిక అభివృద్ధి, కార్మిక ఉద్యమాలకు చిరునామాగా పేరొందిన మంచిర్యాల జిల్లా ఇప్పుడు భూకబ్జాలు, చెరువుల ఆక్రమణలు, ఇసుక మాఫియా, భారీ ఆర్థిక లావాదేవీల ఆరోపణలతో రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారుతోందని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ఆర్థిక వ్యవహారాలపై కేంద్ర, రాష్ట్ర దర్యాప్తు సంస్థలు తక్షణమే విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేకు సంబంధిం చిన సంస్థలు బ్యాంకుల నుంచి రూ.470 కోట్ల రుణా లు తీసుకున్నాయని, అందులో కేవలం వారంలోనే రూ.190 కోట్ల మేర చెల్లింపులు జరిగినట్లు సమాచారం వస్తోందని పేర్కొంటూ, ఆ నిధుల మూలాలపై పూర్తి స్థాయి దర్యాప్తు అవసరమని అన్నారు.

**పారిశ్రామిక జిల్లాకు అక్రమాల మచ్చ..**

మంచిర్యాల ఒకప్పుడు పరిశ్రమలు, సింగరేణి గనులు, కార్మిక ఉద్యమాలతో రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు సాధించిందని గుర్తుచేసిన ఆయన, ప్రస్తుతం జిల్లా పేరు అక్రమాలు, భూకబ్జాలు, చెరువుల ఆక్రమణలు, అక్రమ ఇసుక రవాణా వంటి ఆరోపణలతో వినిపిస్తోందని విమర్శించారు. ప్రభుత్వ యంత్రాంగం స్పందించకపోవడం వల్ల అక్రమాలు మరింత పెరుగుతున్నాయని ఆరోపించారు. చెరువులు, నాలాలు, ఇసుక, అన్నీ అక్రమాల బాటలోనే జిల్లాలో చెరువులు, ప్రభుత్వ భూములు, నాలాలు ఆక్రమణలకు గురవుతున్నాయని, గోదావరి నదిలో అక్రమ ఇసుక, మట్టి తరలింపు నిరాటంకంగా సాగుతోందని ఆరోపించారు. సామాన్యుల నిర్మాణాలపై చర్యలు తీసుకుంటున్న అధికారు లు, పెద్ద ఎత్తున జరుగుతున్నట్లు ఆరోపిస్తున్న ఆక్రమణలపై మాత్రం మౌనం పాటిస్తున్నారని విమర్శించారు.

**ప్రజలకు ఒక న్యాయం..**
**నాయకులకు మరో న్యాయమా?**

జిల్లా కలెక్టర్, రెవెన్యూ, పోలీసు, ఇతర నియంత్రణ శాఖలు తమ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించడం లేదని ఆరోపించారు. చిన్నచిన్న కేసుల్లో వేగంగా స్పందించే అధికారులు, ప్రజాప్రతినిధులపై వస్తున్న భారీ ఆరోపణల విషయంలో కూడా అదే చురుకుదనం చూపాలని డిమాండ్ చేశారు.

**రూ.470 కోట్ల రుణం..**
**రూ.190 కోట్ల చెల్లింపు ఎలా?...**

ఎమ్మెల్యేకు సంబంధించిన కంపెనీలు భారీ రుణాలు తీసుకున్నాయని, వారంలోనే దాదాపు రూ.190 కోట్ల చెల్లింపులు జరగడం వెనుక ఉన్న ఆర్థిక లావాదేవీలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు. ఆ మొత్తం ఎక్కడి నుంచి వచ్చిందో దర్యాప్తులో తేల్చాలని అన్నారు.

**రూ.10 లక్షల సంస్థకు రూ.140 కోట్ల రుణమా?**

కేవలం రూ.10 లక్షల విలువ మాత్రమే ఉన్నట్లు చెబుతున్న సంస్థకు రూ.140 కోట్ల రుణం ఎలా మంజూరైందనే అంశంపైనా అనుమానాలు వ్యక్తం చేశారు. సామాన్య ప్రజలకు చిన్న రుణాలే అందని పరిస్థితిలో భారీ రుణాలు ఎలా లభించాయో బ్యాంకులు వివరణ ఇవ్వాలని కోరారు. ఈడీతో పాటు అన్ని దర్యాప్తు సంస్థలు రంగంలోకి రావాలి. జిల్లాలో జరుగుతున్న వ్యవహారంపై ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ (పీఎంఎల్ఏ) కింద ఈడీ విచారణ జరపాలని, అవసరమైతే రుణాలు మంజూరు చేసిన బ్యాంకుల పాత్రను కూడా పరిశీలించాలని సూచించారు.

**హైడ్రా ఎందుకు స్పందించడం లేదు?...**

రాష్ట్ర ప్రభుత్వం చెరువులు, నాలాల పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన హైడ్రా సంస్థ మంచిర్యాలలో జరుగుతున్నట్లు ఆరోపిస్తున్న ఆక్రమణలపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో హైడ్రా జోక్యం చేసుకోవాలని కోరారు.

**ప్రజల సమాచారం**
**ఉంటే పోరాటం మరింత ఉధృతం..**


జిల్లాలో అక్రమాలకు సంబంధించిన సమాచారం ప్రజలు బీఆర్ఎస్ నాయకులకు అందించాలని, ప్రతి అంశాన్ని ప్రజల తరఫున వెలుగులోకి తీసుకువస్తామని తెలిపారు. కేసీఆర్, కేటీఆర్ నాయకత్వంలో మంచిర్యాలను అక్రమాల నుంచి విముక్తి చేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

**ఎమ్మెల్యే రోజుకు కోటి సంపాదిస్తున్నాడు..**

బిబీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు విజయ్ కుమార్ మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు రోజుకు కోటి చొప్పున 500 రోజుల్లో రూ. 500 కోట్లు సంపాదించాడని బీఆర్ ఎస్ రాష్ట్ర నాయకుడు విజిత్ కుమార్ ఆరోపించారు. ఆయన విలేకర్ల సమావేశంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎమ్మెల్యే బ్యాంకు నుంచి ఎంత రుణం తీసుకున్నాడు ఎప్పుడు తీసుకున్నాడు ఎంత కట్టాడని వివరించాడు. ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత రూ. 444 కోట్ల రూపాయలు బ్యాంకులకు చెల్లించాడని పేర్కొన్నారు. అంత మొత్తంలో డబ్బులు ఎలా చెల్లించాలి అని ప్రశ్నించారు.

# సోలక్‌పల్లిలో ఘనంగా బోనాల పండుగ

**హాజరైన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి జిన్నారం**





**పటాన్చెరు, ఆగస్టు 07(నినాదం) :** గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే జాతరలు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. జిన్నారం మున్సిపల్ పరిధిలోని సోలకపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన బోనాల పండుగ, జాతర కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై.. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ప్రతి ఒక్కరూ భక్తి, ఐకమత్యంతో నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిన్నారం మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, ఆయా వార్డుల కౌన్సిలర్లు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# డీఏపీని అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

**జేడీఏ కున్ రెడ్డి జగదీశ్వర్ రెడ్డి**



**మిర్యాలగూడ, ఆగస్టు 7(నినాదం ):** డీఏపీ ఎరువులను గరిష్ట చిల్లర ధర (ఎంఆర్‌పీ)కంటే అధిక ధరలకు విక్రయించే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని జాయింట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ (జేడీఏ) కున్ రెడ్డి జగదీశ్వర్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారంఎరువుల నియంత్రణ ఉత్తర్వులు–1985 ప్రకారం మిర్యాలగూడ వ్యవసాయ డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో హోల్‌సేల్, రిటైల్ ఎరువుల దుకాణాలపై వ్యవసాయ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డీలర్లు ఎంఆర్‌పీ కంటే అధిక ధర వసూలు చేయరాదని, స్టాక్ రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని, రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని ఇప్పటికే హోల్‌సేల్ డీలర్లకు మెమోలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్స్ రద్దు చేయడంతో పాటు స్టాక్‌ను స్వాధీనం చేసుకుని, ఎరువుల నియంత్రణ ఉత్తర్వులు–1985, నిత్యావసర వస్తువుల చట్టం–1955 కింద క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మిర్యాలగూడ వ్యవసాయ డివిజన్ పరిధిలో డీఏపీ ఎరువులకు ఎలాంటి కొరత లేదని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అవసరమైన మేరకు నిరంతర సరఫరా జరుగుతోందని తెలిపారు. రైతులు అధికారిక లైసెన్స్ కలిగిన డీలర్ల వద్ద మాత్రమే ఎరువులు కొనుగోలు చేసి తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని సూచించారు. ఎవరైనా ఎంఆర్‌పీ కంటే అధిక ధర వసూలు చేస్తే సంబంధిత మండల వ్యవసాయ అధికారి లేదా మిర్యాలగూడ సహాయ వ్యవసాయ సంచాలకుల కార్యాలయానికి ఫిర్యాదు చేయాలని కోరారు. ఫిర్యాదు అందిన 24 గంటల్లో చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట శ్రీకాంత్ ముదిరాజ్ తదితరులు ఉన్నారు

# స్పందించకుంటే 'చలో అసెంబ్లీ'

**నల్ల బ్యాడ్జీలతో ఉపాధ్యాయుల రాష్ట్రవ్యాప్త నిరసన**
**పీఆర్సీ సహా 13 డిమాండ్ల సాధనకు యూఎస్‌పీసీ ఉద్యమం**




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, ఆగస్టు 7(నినాదం):** ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ఉపాధ్యా య సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) చేపట్టిన దశలవారీ ఉద్యమం శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా ప్రారం భమైంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. పీఆర్సీ ప్రకటన, పెండింగ్ డీఏల విడుదల, బదిలీలు, పదోన్నతులు, పాత పెన్షన్ అమలు తదితర 13 ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. యూఎస్‌పీసీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, ఉపాధ్యాయులు, విద్యారంగ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. తక్షణమే పీఆర్సీ ప్రకటించ డం, పెండింగ్ డీఏలను విడుదల చేయడంతో పాటు నెల 15లోగా బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేయా లని, విద్యారంగానికి 15 శాతం బడ్జెట్ కేటాయించి జీవో–25 సవరణ, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయాలన్నారు. కేజీబీవీ, యూఆర్ఎస్, సమగ్ర శిక్ష ఉద్యోగులకు కనీస వేతనాలు, జీవో–317 బాధితులకు న్యాయం, టెట్‌లో సర్వీస్ వెయిటేజ్, మోడల్, ఎయిడెడ్ పాఠశాలలను విద్యాశాఖలో విలీనం చేయడం, పెండింగ్ బిల్లుల చెల్లింపు, హెల్త్ కార్డుల పూర్తి అమలు వంటి డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు. యూఎస్‌పీసీ ప్రకటించిన నాలుగు దశల ఉద్యమంలో భాగంగా ఈ నెల 12, 13 తేదీల్లో ఎమ్మార్వో కార్యాలయాల ఎదుట నిరసనలు, వినతిపత్రాల సమర్ప ణ, అనంతరం జిల్లా కేంద్రాల్లో ధర్నాలు, చివరిదశలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అయినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే శాసనసభ సమావేశాల సందర్భంగా 'చలో అసెంబ్లీ' కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.

**మహాముత్తారంలో నిరసన**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో జరిగిన నిరసన కార్యక్రమంలో డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అయిత తిరుపతి, జిల్లా కార్యదర్శి చేరి ప్రభాకర్, ప్రధానోపాధ్యాయులు సురేందర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు హట్కర్ దేవ్‌సింగ్, లావుడియా ప్రకాశ్, డీటీఎఫ్ మండల అధ్యక్షుడు జాటోత్ రామ్‌సింగ్, ఉపాధ్యాయులు అనిల్‌తో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

**రూ.3.25 లక్షల నగదు, స్కూటీ, చోరీ పరికరాలు స్వాధీనం**
**అడిషనల్ ఎస్పీ జి రమేష్**



**నల్లగొండ ప్రతినిధి ఆగస్టు 7(నినాదం ):** నల్లగొండ పట్టణంలో ఇటీవల జరిగిన వరుస పగటి పూట చోరీల కేసులను అంతర్రాష్ట్ర దొంగను అరెస్ట్ చేసినట్లు నలగొండ అడిషనల్ ఎస్పీ జి రమేష్ తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నల్లగొండ వన్‌టౌన్, టూ టౌన్ పోలీసుల సమన్వయంతో అంతర్రాష్ట్ర దొంగల ముఠాకు చెందిన ప్రధాన నిందితుడు మహమ్మద్ నసీమ్ 48ను అరెస్టు చేసి, అతని వద్ద నుంచి రూ. 3.25 లక్షల నగదు, ఒక స్కూటీ, రెండు ఇనుప రాడ్లు, మాస్క్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మరో ఇద్దరు నిందితులు ఇర్షాద్, షరీఫ్ పరారీలో ఉండగా, వారి కోసం ప్రత్యేక బృందాలు గాలింపు కొనసాగిస్తున్నాయని వెల్లడించారు. జూలై 26న నల్లగొండలోని వి.టి. కాలనీలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ తాళం పగులగొట్టి బంగారు ఆభరణాలు చోరీ చేసిన ఘటనపై టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలు, నిఘా సమాచారాన్ని విశ్లేషించి దర్యాప్తు చేపట్టాయి. దర్యాప్తులో భాగంగా ఆగస్టు 6న సాయంత్రం పానగల్ బైపాస్ వద్ద మరోసారి చోరీలకు పాల్పడేందుకు వస్తున్న మహమ్మద్ నసీమ్‌ను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా వేదాయపాలెం, తిరుపతి జిల్లా తిరుచానూరు ప్రాంతాల్లో జరిగిన పలు చోరీ కేసుల్లో తన ప్రమేయాన్ని నిందితుడు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం, ఈ ముఠా ముందుగా తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి రెక్కీ నిర్వహించి, ఇంట్లో ఎవరూ లేరని నిర్ధారించుకున్న తర్వాత పగటి సమయంలో తాళాలు పగులగొట్టి బంగారు ఆభరణాలు, నగదు అపహరించి పరారయ్యేది. ఈ కార్యక్రమంలో డీఎస్పీ కె. శివరాం రెడ్డి , వన్‌టౌన్ సీఐ ఎ. రాజశేఖర్ రెడ్డి, టూ టౌన్ సీఐ కె. ఆది రెడ్డి సిబ్బంది తదితరులు ఉన్నారు

# డిఇఓ కార్యాలయాన్ని ముట్టడించిన బిఆర్ఎస్వీ నాయకులు

**విద్యార్థి మరణానికి పూర్తి బాధ్యత ప్రభుత్వానిదే.. బి ఆర్ ఎస్వీ**
**బేషరతుగా సీఎం రాజీనామా చేయాలంటూ డిమాండ్.**
**ప్రభుత్వ పాఠశాలల తనిఖీలపై నిర్లక్ష్యం వహించిన డీఈవో పై చర్యలకు డిమాండ్.**
**డీఈవో కార్యాలయం ముందు బైఠాయించిన బి.ఆర్.ఎస్.వి**
**జిల్లా వైద్యులను సస్పెండ్ చేయాలని డిమాండ్**





**నారాయణపేట ప్రతినిధి, ఆగస్టు 7, (నినాదం):** ఎక్లాస్‌పూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థి మరణించిన ఘటనపై బిఆర్ఎస్వీ నాయకులు శుక్రవారం నాడు ఆందోళన చేపట్టి ర్యాలీ నిర్వహించి డిఇఓ కార్యాలయాన్ని ముట్టడించారు. పాఠశాలలో మౌలిక వసతుల లేమి, ఉపాధ్యాయులు, అధికారుల నిర్లక్ష్యమే దీనికి ప్రధాన కారణమని వారు ఆరోపించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎక్లాస్‌పూర్ పాఠశాల ఉపాధ్యాయులను వెంటనే సస్పెండ్ చేయాలనీ, బాధిత విద్యార్థి కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారం చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే సమయానికి జిల్లా ఆస్పత్రికి తీసుకు వెళ్లినప్పటికీ అక్కడ సరైన వైద్యం అందించకపోవడం పై కూడా వారు కూడా ఇందులో వైద్యాధికారుల నిర్లక్ష్యం కూడా కొట్టొచ్చినట్టు కనిపిస్తుందని ఆరోపిస్తూ అట్టి అధికారుల ను సైతం సస్పెండ్ చేయాలని ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో ఇంత జరుగుతున్నప్పటికీ ఎమ్మెల్యే లేకపోవడం శోచనీయమని, అసలు జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నాయకత్వమే లేదని, ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదంటూ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. విద్యాశాఖను సీఎం రేవంత్ రెడ్డి తన వద్దనే ఉంచుకొని ప్రభుత్వ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నాడంటూ ఆరోపిస్తూ దీనికి పూర్తి బాధ్యత ముఖ్యమంత్రి వహించి రాజీనామా చేయాలంటూ పట్టుబట్టారు. విద్యావ్యవస్థ లో జరుగుతున్న నిర్లక్ష్య ధోరణిని నిరసిస్తూ రెండు గంటలుగా డీఈఓ కార్యాలయం ఎదుట బైఠాయించిన బి ఆర్ఎస్వీ నాయకులు. కార్యాలయ ఆవరణలోకి వారిని వెళ్ళనీయకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. డీఈవో ప్రతినిధులుగా సిబ్బంది వచ్చినప్పటికీ డీఈఓ నే రావలసిందిగా పట్టుబట్టడంతో ఎట్టకేలకు ఫోన్ లైన్ లోకి వచ్చిన డీఈవో గోవిందరాజులు. వీరి డిమాండ్లను విన్న డీఈవో గోవిందరాజులు సమాధానం ఇస్తూ ఈ ఘటనపై విచారణ జరిపిస్తామని, సిబ్బంది లేదా ఉపాధ్యాయుల నిర్లక్ష్యం ఉన్నట్లు తేలితే తగిన చర్యలు (సస్పెన్షన్) తీసుకుంటామని హామీ ఇవ్వడంతో శాంతించిన బి.ఆర్.ఎస్.వి విద్యార్థి విభాగం నాయకులు. చర్యలు చేపట్టకపోతే మరోసారి ఉద్యమించాల్సి వస్తుందని ప్రభుత్వానికి గట్టి హెచ్చరికను చేశారు. ఇట్టి కార్యక్రమంలో బిఆర్ ఎస్ వి జిల్లా అధ్యక్షుడు కోరం శివరాజు రెడ్డి, కోలు నరేష్, వినయ్ రెడ్డి, తరుణ్ కుమార్, శరత్ కుమార్, సమీర్, ఇర్ఫాన్, లక్ష్మీనారాయణ, విద్యార్థి విభాగం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# భౌరంపేట్ పోచమ్మ ఆలయ నూతన కమిటీ ఎన్నిక

**కమిటీ చైర్మన్గా ఎస్ వి సురేందర్ రెడ్డి ఎంపిక**



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 7 (నినాదం) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ సర్కిల్ పరిధిలోని భౌరంపేట్ గ్రామంలో ఉన్న అతి పురాతన శ్రీ పోచమ్మ ఆలయం నూతన కమిటీని శుక్రవారం గ్రామ పెద్దలు, నాయకుల చైర్మన్గా సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామంలో ప్రతి సంవత్సరం నిర్వహించే ఆషాఢ మాస బోనాల ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ కృషి చేయాలని గ్రామస్తులు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్‌గా ఎస్.వి. సురేందర్ రెడ్డి, వైస్ చైర్మన్‌గా బి. హన్మంత్ రెడ్డి, ట్రెజరర్‌గా బి. బసంత్ రెడ్డి, క్యాషియర్‌గా సి. హెచ్. ఆనంద్ రెడ్డి, జనరల్ సెక్రటరీగా సి. హెచ్. సుదర్శన్ రెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా ఈ. పాండు, డి. భిక్షపతి, అలాగే కమిటీ సభ్యులుగా మహిపాల్ రెడ్డి తదితరులను ఎన్నుకున్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను గ్రామ పెద్దలు, నాయకులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి, వారికి శుభాకాంక్షలు తెలిపారు.

# గాజులరామారం జిల్లా పరిషత్ హై స్కూల్ ల్లో ఘనంగా బోనాల వేడుకలు

**తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక బోనాల వేడుకలు**
**మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సొంటి రెడ్డి పున్నారెడ్డి**





**కుత్బుల్లాపూర్, ఆగస్టు 7 (నినాదం) :** కుత్బుల్లాపూర్ నియోజక వర్గంగా జులరామారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బోనాల పండుగ వేడుకలు పాఠశాల ప్రధానోపాధ్యాయులు అధ్యాపక బృందం విద్యార్థులతో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ నాయకులు, శ్రీ ఎస్ పి ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ అండ్ చైర్మన్ సొంటి రెడ్డి పున్నారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరైనారు. గాజులరామారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బోనాల పండుగ వేడుకల్లో విద్యార్థుల పోతరాజుల నృత్యాలు, అమ్మవారికి సమర్పిం చుటకు విద్యార్థినిలు నెత్తిన బోనం ఎత్తుకొని భక్తిశ్రద్ధ లతో అమ్మవారికి బోనాలు సమర్పించుకున్నా రు. ఈ వేడుకలను చూసిన పలువురికి నయనానందభరితంగా జరుపుకోవడంతో విద్యార్థులు తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యా యులు ఎంతో ఉత్సాహంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించడం జరిగింది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించ డం మనందరి బాధ్యత అని తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నానని పాఠశాలలో జరిగిన బోనాల వేడుకలు సందర్భంగా సొంటి రెడ్డి పున్నారెడ్డి వివరించారు.

# తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా ఘనంగా బోనాల పండుగ వేడుకలు





**వికారాబాద్, ఆగస్టు 7(నినాదం):**
వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన బోనాల పండుగ వేడుకల్లో బీజేపీ వికారాబాద్ మాజీ జిల్లా అధ్యక్షుడు కరణం ప్రహ్లాద్ రావు, జిల్లా అధ్యక్షు యు. రమేష్ కుమార్, బీజేపీ పరిగి అసెంబ్లీ ఇంచార్జ్ మారుతి కిరణ్ బూనేటి పాల్గొని భక్తిశ్రద్ధలతో ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు. వికారాబాద్ జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని, రాష్ట్రంలో సుభిక్షం నెలకొనాలని అమ్మవారిని వేడుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన బోనాల పండుగ సందర్భంగా జిల్లా ప్రజలకు, భక్తులందరికీ హృద యపూర్వక బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వర్షాల కోసం వరుణయాగం

ఎల్ నినో ప్రభావం నుంచి విముక్తి కలిగి, కృష్ణా–గోదావరి నదులతో పాటు రైతాంగం సుభిక్షంగా ఉండాలనే ప్రత్యేక సంకల్పంతో ఈ మహా క్రతువును చేపడుతున్నారు. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి చెందిన వేద పండితులు, అర్చకులతో పాటు మొత్తం 108 మంది రుత్వికులు 11 హోమకుండాలలో ఈ యాగాన్ని నిర్వహించనున్నారు. యాగ పూర్ణాహుతి కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యక్షంగా పాల్గొననున్నారు. రాష్ట్ర శ్రేయస్సును కాంక్షిస్తూ ఈ మహా వరుణ యాగాన్ని నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారని యాదగిరిగుట్ట దేవస్థానం పాలక మండలి చైర్మన్ తెలిపారు.



# హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ కొత్త క్లౌడ్ రీజియన్..

## ఏఐ సేవలకు మరింత ఊతం

**హైదరాబాద్,ఆగస్టు7(నినాదం):** ప్రముఖ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్, భారత్‌లో తన క్లౌడ్ సేవలను మరింత విస్తరించింది. హైదరాబాద్ కేంద్రంగా "ఇండియా సౌత్ సెంట్రల" పేరుతో తన నూతన క్లౌడ్ రీజియన్‌ను ప్రారంభించింది. ఈ కొత్త కేంద్రం ఏర్పాటుతో దేశంలో మైక్రోసాఫ్ట్ క్లౌడ్ రీజియన్ల సంఖ్య నాలుగుకు చేరుకుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ఎంటర్‌ప్రైజ్ సేవలకు అవసరమైన మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు సంస్థ వెల్లడించింది. తెలంగాణలో ఏర్పాటైన ఈ నూతన రీజియన్ ద్వారా వినియోగదారులు తమ డేటాను స్థానికంగానే భద్రపరుచుకోవచ్చు. దీనివల్ల అత్యున్నత భద్రతతో పాటు వేగవంతమైన సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే పూణె, చెన్నై, ముంబై నగరాల్లో మైక్రోసాఫ్ట్‌కు క్లౌడ్ రీజియన్లు ఉండగా, తాజా విస్తరణతో భారత్‌లో అతిపెద్ద హైపర్‌స్కేల్ క్లౌడ్ నెట్‌వర్క్ కలిగిన సంస్థగా మైక్రోసాఫ్ట్ నిలిచింది. సేవల్లో ఎలాంటి అంతరాయాలు కలగకుండా ఉండేందుకు వీలుగా ఈ కేంద్రంలో మూడు అవైలబిలిటీ జోన్‌లను ఏర్పాటు చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా, 2030 నాటికి నీటి వినియోగాన్ని గణనీయంగా తగ్గించే లక్ష్యంతో ఇందులో "జీరో–వాటర్ కూలింగ" సాంకేతికతను వినియోగిస్తున్నారు. అదానీ గ్రూప్, బజాజ్ ఫిన్‌సర్వ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, పీబీ పే వంటి ప్రముఖ భారతీయ సంస్థలు ఇప్పటికే ఈ హైదరాబాద్ రీజియన్ సేవలను వినియోగించుకుంటున్నాయి. భారత్‌లో డిజిటల్, ఏఐ మౌలిక సదుపాయాల కోసం మైక్రోసాఫ్ట్ ప్రకటించిన 20.5 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడులలో భాగంగా ఈ నూతన రీజియన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మైక్రోసాఫ్ట్ ఇండియా ప్రెసిడెంట్ పునీత్ చందోక్ మాట్లాడుతూ, ఏఐ సాంకేతికతతో విలువైన ఫలితాలను సాధించాలంటే, డేటాకు సమీపంలో నమ్మకమైన మౌలిక సదుపాయాలు ఉండటం అత్యంత కీలకమని పేర్కొన్నారు.




# హైదరాబాద్‌లో భారీ బస్ టెర్మినల్ నిర్మాణం

ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారంలో హెచఎంటీ భూములకు సమీపంలోనే 100 ఎకరాల స్థలాన్ని టీజీఎసఆర్టీసీకి కేటాయించిందని గడ్కరీ స్పష్టం చేశారు. ప్రస్తుతం జగద్గిరిగుట్ట మీదుగా 28 జిల్లా బస్సులు, 47 సిటీ బస్సులు రోజూ 404 ట్రిప్పులు నడుపుతున్నాయని, కొత్త డిపోతో ఈ ప్రాంతంలో రవాణా వ్యవస్థ మరింత మెరుగుపడుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రతిపాదిత గాజులరామారం డిపోను అత్యంత ఆధునికంగా తీర్చిదిద్దనున్నారు. ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చే బస్సుల కోసం ప్రత్యేకంగా ఇంటర్ స్టేట్ బస్ టెర్మినల్, సిటీ బస్సుల కోసం మరో టెర్మినల్ ఏర్పాటు చేస్తారు. పర్యావరణ హితమైన రవాణాను ప్రోత్సహించేందుకు ఎలక్ట్రిక్ బస్సుల కోసం ప్రత్యేక ఛార్జింగ్ స్టేషన్‌ను కూడా నిర్మించనున్నారు. ఈ టెర్మినల్ అందుబాటులోకి వస్తే ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల నుంచి వచ్చే బస్సులు నగరం నడిబొడ్డుకు రాకుండా ఇక్కడి నుంచే తమ సర్వీసులను నడుపుతాయి. తద్వారా ఎంజీబీఎస్, జేబీఎస్ వంటి బస్టాండ్లపై ఒత్తిడి తగ్గి, నగరంలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించగలదని ప్రభుత్వం భావిస్తోంది.

# రూ 5,400 వేల కోట్ల జరిమానా

మిగిలిన నిధులను రాబోయే ఐదేళ్లలో అవగాహన, నివారణ కార్యక్రమాలు, స్క్రీనింగ్ సేవలు, ఇతర సంబంధిత ఖర్చుల కోసం వినియోగించాలని ఆదేశించింది. ఈ కేసులో గత మార్చి నెలలో వెలువడిన తీర్పునకు ఇది కొనసాగింపు కావడం గమనార్హం. ఆ సమయంలో మెటా ఉద్దేశపూర్వకంగానే పిల్లల మానసిక ఆరోగ్యానికి హాని కలిగించిందని, లైంగిక దోపిడీకి సంబంధించిన సమాచారాన్ని దాచిపెట్టిందని నిర్ధారించిన జ్యూరీ, కంపెనీకి 375 మిలియన్ డాలర్ల సివిల్ పెనాల్టీ విధించింది. ఈ కేసు విచారణలో ప్రాసిక్యూటర్లు మెటా ప్లాట్‌ఫామ్‌లలో కీలక మార్పులు చేయాలని కోరారు. ముఖ్యంగా యువతను వ్యసనపరులుగా మార్చే ఫీచర్లను నియంత్రించాలని, వయసు నిర్ధారణ పద్ధతులను కఠినతరం చేయాలని, పిల్లల లైంగిక దోపిడీని అరికట్టేందుకు డిఫాల్ట్ ప్రైవసీ సెట్టింగులను మెరుగుపరచాలని వాదించారు. అయితే, ప్రాసిక్యూటర్ల అభ్యర్థనలను కోర్టు పాక్షికంగానే అంగీకరించింది. 13 ఏళ్లలోపు పిల్లలకు వయసు నిర్ధారణను తప్పనిసరి చేయాలన్న వాదనను తోసిపుచ్చింది. అమెరికాలోని 'చిల్డ్రన్స్ ఆన్‌లైన్ ప్రైవసీ ప్రొటెక్షన్ యాక్ట' (సీఓపీపీఏ) ప్రకారం కేవలం వయసు నిర్ధారణ కోసం పిల్లల నుంచి వ్యక్తిగత సమాచారం సేకరించడం కుదరదని కోర్టు స్పష్టం చేసింది. అంతేగాక ఇతర సోషల్ మీడియా కంపెనీలకు లేని నిబంధనలను కేవలం మెటాపై మాత్రమే విధించడం సరికాదని, అది కంపెనీపై అనవసర భారం మోపుతుందని అభిప్రాయపడింది. ఈ తీర్పుపై మెటా ఇంకా స్పందించలేదు. ఇదిలా ఉంటే.. ఇటీవల మెటాకు చెందిన ఏఐ మోడల్ సైబర్ సెక్యూరిటీ పరీక్షల్లో భాగంగా బయటి సర్వీస్‌లోకి హ్యాక్ చేయడం, టెక్నాలజీపై నియంత్రణకు సంబంధించి కొత్త ఆందోళనలను రేకెత్తించింది.

# అమెరికాలో జన్మహక్కు పౌరసత్వం కఠినతరం

ఇద్దరు తల్లిదండ్రులు అమెరికా పౌరులు కానప్పుడు, వారిలో ఒకరిని 'శత్రు దేశస్థుడు'గా, అంటే విదేశీ ఉగ్రవాద సంస్థల్లో సభ్యుడిగా గుర్తిస్తే, వారి పిల్లలకు పౌరసత్వం వర్తించదు. దీంతోపాటు దౌత్యపరమైన మినహాయింపులు ఉన్న విదేశీ ప్రభుత్వ ఉద్యోగులు, కేవలం పౌరసత్వం కోసమే చేసుకున్న వాణిజ్య ఒప్పందాలు (కొన్ని సరోగసీ కేసులు), ఫెడరల్ చట్టం ద్వారా పౌరసత్వం కల్పించని యూఎస్ టెరిటరీలలో జన్మించిన వారికి కూడా ఈ నిబంధన వర్తిస్తుంది. ఇక, రెండో ఆదేశం పూర్తిగా 'బర్త్ టూరిజం'ను లక్ష్యంగా చేసుకుంది. కేవలం బిడ్డకు అమెరికా పౌరసత్వం ఇప్పించడం కోసమే దేశానికి వచ్చేవారిని అడ్డుకోవాలని ఈ ఉత్తర్వులో స్పష్టం చేశారు. ఇలాంటి వారికి వీసాలు నిరాకరించడం, అధికారిక అనుమతులు రద్దు చేయడం, దేశంలోకి ప్రవేశాన్ని నిరోధించడం వంటి కఠిన చర్యలు తీసుకోవాలని హోంల్యాండ్ సెక్యూరిటీ, విదేశాంగ శాఖలను ఆదేశించారు. కాగా, 14వ రాజ్యాంగ సవరణ కింద అమెరికాలో పుట్టిన దాదాపు ప్రతి ఒక్కరికీ పౌరసత్వం లభిస్తుందని జూన్ 30న 'ట్రంప్ వర్సెస్ బార్బరా' కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు జన్మహక్కు పౌరసత్వాన్ని ఒక 'జోక'గా మార్చిందని ట్రంప్ విమర్శించారు. అందుకే తమ ప్రభుత్వం 'కొన్ని సర్దుబాట్లు' చేస్తోందని వ్యాఖ్యానించారు. చారిత్రకంగా దౌత్యవేత్తలు, ఆక్రమణ దళాలకు చెందిన వారికి మాత్రమే ఈ నిబంధన నుంచి మినహాయింపులు ఉండేవి. ఇప్పుడు ట్రంప్ జారీ చేసిన ఈ కొత్త ఆదేశాలు సుప్రీంకోర్టు తీర్పులో పేర్కొన్న మినహాయింపుల పరిధిలోనే ఉన్నప్పటికీ, వాటి సరిహద్దులను పరీక్షించేలా ఉన్నాయని, ఇవి కూడా న్యాయస్థానంలో సవాలుకు గురయ్యే అవకాశం ఉందని విశ్లేషకులు అంటున్నారు.

# హిందూజా సోదరులకు ఊరట

విచారణ వాయిదా వేయాలని పిటిషనర్ తరఫు న్యాయవాది కోరినా, కోర్టు అంగీకరించలేదు. ఇప్పటికే చాలా కాలం గడిచిందని పేర్కొంటూ పిటిషన్‌ను తిరస్కరించింది. విచారణ సందర్భంగా "హిందూజా సోదరులు, సీబీఐ వ్యవహారం ఇంకా ఎందుకు కొనసాగుతోంది? అన్ని కేసులను హైకోర్టు కొట్టేసింది కదా. ఇంకా ఎంతకాలం ఈ వ్యవహారం కొనసాగుతుంది?" అని జస్టిస్ పార్డీవాలా వ్యాఖ్యానించారు. దీనికి పిటిషనర్ తరఫు న్యాయవాది 1986లో ఈ ఒప్పందం జరిగిందని వివరించే ప్రయత్నం చేసినా, ధర్మాసనం మరిన్ని వాదనలు వినేందుకు నిరాకరించింది. 2005 మే 31న ఢిల్లీ హైకోర్టు హిందూజా సోదరులు శ్రీచంద్, గోపీచంద్, ప్రకాశ్ హిందూజాలతో పాటు స్వీడన్‌కు చెందిన ఏబీ బోఫోర్స్ కంపెనీపై ఉన్న క్రిమినల్ కేసులను కొట్టివేసింది. అప్పట్లో దర్యాప్తు తీరుపై కూడా సీబీఐని హైకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. ఆ తీర్పును సవాలు చేస్తూ సీబీఐ దాఖలు చేసిన అప్పీల్‌ను కూడా సుప్రీంకోర్టు 2018లో తిరస్కరించింది. అప్పీల్ దాఖలులో 4,522 రోజుల ఆలస్యం జరిగిందని పేర్కొంటూ దానిని స్వీకరించలేదు. 1986లో భారత ప్రభుత్వం స్వీడన్‌కు చెందిన ఏబీ బోఫోర్స్ సంస్థతో రూ.1,437 కోట్ల విలువైన 400 హోవిట్జర్ గన్‌ల కొనుగోలు ఒప్పందం చేసుకుంది. 1987లో ఈ ఒప్పందంలో అక్రమ కమీషన్లు చెల్లించారనే ఆరోపణలు వెలుగులోకి రావడంతో దేశవ్యాప్తంగా రాజకీయ దుమారం చెలరేగింది. అనంతరం సీబీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. తాజాగా సుప్రీంకోర్టు చివరి పిటిషన్‌ను కూడా కొట్టివేయడంతో బోఫోర్స్ కేసు చట్టపరంగా ముగిసినట్లైంది.

# రూ.61 కోట్లతో ప్రభుత్వాసుపత్రులకు వైద్య పరికరాల కొనుగోలు

**సమకూరనున్న పరికరాల వివరాలు**

బిఎఫ్‌సి ఆమోదం మేరకు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డిఎంఈ) ఆసుపత్రుల్లో రూ.27 కోట్ల వ్యయంతో కీలకమైన 235 ఐసియు వెంటిలేటర్లు సమకూరనున్నాయి. నవజాత శిశువుల ఆరోగ్య భద్రత కోసం డిఎంఈ ఆసుపత్రులకు రూ.11.50 కోట్ల వ్యయంతో 38 నియోనేటల్ వెంటిలేటర్లు లభించనున్నాయి. క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించే ప్రయత్నంలో భాగంగా క్షయ వ్యాధి పరీక్షల కోసం రూ. 22 కోట్ల వ్యయంతో ఏఐ ఆధారంగా పనిచేసే 100 పోర్టబుల్ హ్యాండ్ హెల్డ్ ఎక్స్‌రే మెషీన్లను కొనుగోలు చేయనున్నారు. రూ. 70 లక్షల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబొరెటరీల కోసం 26 ఆటోమెటిక్ హెమటాలజీ ఎనలైజర్లు, క్రిటికల్ కేర్ బ్లాకుల కోసం రూ. 1కోటి వ్యయంతో వివిధ పరికరాలు, రూ. 30 లక్షల వ్యయంతో ఐ బ్యాంకుల కోసం వివిధ పరికరాలు, ఔషధ నాణ్యత పరీక్షల కోసం రూ. 70 లక్షల వ్యయంతో స్పెక్ట్రో మీటర్లు మరియు సెమీ మైక్రో ఎనలిటికల్ వెయింగ్ పరికరాలను కొనుగోలు చేసేందుకు బిఎఫ్‌సి ఆమోదించింది.

# ముజ్తబా ఖమేనీకి తీవ్ర అస్వస్థత!

జెరూసలేం పోస్ట్ మరో అడుగు ముందుకేసి 'ఆయన అమరత్వం పొందారంటూ త్వరలోనే వార్త వస్తే మేము ఆశ్చర్యపోము' అని పేర్కొంది. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ ఇటీవల ఒక ప్రభుత్వ టీవీ ఇంటర్వ్యూలో ఖమేనీతో ప్రత్యక్ష సంభాషణ ప్రస్తుతం 'చాలా కష్టం' అని అంగీకరించడం ఈ ఊహాగానాలకు మరింత ఆజ్యం పోస్తున్నాయి. కాగా, 2026 ఫిబ్రవరి 28న అమెరికా–ఇజ్రాయెల్ జరిపిన సంయుక్త సైనిక దాడులలో తన తండ్రి మరణించిన కొద్దికాలానికే ఖమేనీ సుప్రీం లీడర్ పదవిని చేపట్టారు.

# మైసీలియం, వ్యవసాయ వ్యర్థాలతో 'ఫంగీ లెదర్'



**న్యూఢిల్లీ,ఆగస్టు7(నినాదం):** బూట్లు, బ్యాగులు, బెల్టులు, జాకెట్లు, వాహనాల సీట్లు ఇలా మనం రోజూ ఉపయోగించే ఎన్నో వస్తువుల తయారీలో జంతువుల తోలును విస్తృతంగా వినియోగిస్తుంటారు. అయితే దీనికోసం లక్షలాది జంతువులు బలవుతుండగా, పర్యావరణ కాలుష్యం కూడా పెరుగుతోంది. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే ప్రయత్నంలో ఒడిశాకు చెందిన ఓ స్టార్టప్ వినూత్న ఆవిష్కరణ చేసింది. శిలీంధ్రాల (ఫంగస్)లోని భాగమైన మైసీలియం, వ్యవసాయ వ్యర్థాలను ఉపయోగించి జంతు తోలుకు ప్రత్యామ్నాయంగా 'ఫంగీ లెదర'ను అభివృద్ధి చేసింది. ఈ పర్యావరణహిత ఉత్పత్తి ఇప్పుడు రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శనలో ప్రశంసలు అందుకుంది. ఒడిశాకు చెందిన అర్బన్–హైఫ్ బయోసైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే స్టార్టప్‌ను యువ పారిశ్రామికవేత్తలు నిషరాజ్ మహాపాత్ర, వివేక్ సింగ్ అనే ఇద్దరు స్నేహితులు స్థాపించారు. పర్యావరణాన్ని కాపాడుతూ ఫ్యాషన్ రంగంలో మార్పు తీసుకురావాలన్న లక్ష్యంతో వీరు ఈ సాంకేతికతను అభివృద్ధి చేశారు. శిలీంధ్రాల్లోని ప్రధాన భాగమైన మైసీలియంను ప్రత్యేక పద్ధతిలో పెంచి, దానిని సాగే గుణం కలిగిన తోలుగా మార్చే ప్రక్రియను రూపొందించారు. దీనివల్ల జంతు తోలు, సింథటిక్ లెదర్‌కు ప్రత్యామ్నాయంగా ఉపయోగించగల నాణ్యమైన బయో మెటీరియల్‌ను తయారు చేస్తున్నారు. ఈ వినూత్న ఉత్పత్తికి ఇప్పటికే విశేష గుర్తింపు లభించింది. రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక ప్రదర్శనలో ఈ స్టార్టప్ తమ ఉత్పత్తులను ప్రదర్శించగా ప్రశంసలు అందుకుంది. పర్యావరణ పరిరక్షణ, ఆధునిక బయోటెక్నాలజీ కలయికతో రూపొందిన ఈ ఫంగీ లెదర్ భవిష్యత్తులో ఫ్యాషన్ పరిశ్రమకు కొత్త దిశ చూపుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఈ స్టార్టప్ తయారు చేస్తున్న ఫంగీ లెదర్‌తో బ్యాగులు, బూట్లు, పర్సులు, బెల్టులు, వాచ్ పట్టీలు, దుస్తులు వంటి ఉత్పత్తులను రూపొందిస్తున్నారు. భవిష్యత్తులో ఫర్నిచర్, ఇంటీరియర్ డిజైన్, ఆటోమొబైల్ పరిశ్రమ, లైఫ్‌స్టైల్ ఉత్పత్తుల తయారీలో కూడా దీనిని వినియోగించే అవకాశాలు ఉన్నాయని సంస్థ ప్రతినిధులు చెబుతున్నారు. అంతేకాదు, ఈ బయో మెటీరియల్‌ను ప్యాకేజింగ్, నిర్మాణ రంగం, ఇన్సులేషన్ మెటీరియల్స్, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌లకు ప్రత్యామ్నాయంగా కూడా ఉపయోగించవచ్చని వారు పేర్కొంటున్నారు. ఫంగీ లెదర్ తయారీ తర్వాత మిగిలిపోయే సేంద్రియ పదార్థాలను కూడా పూర్తిగా రీసైకిల్ చేయడం వల్ల వ్యర్థాలు దాదాపు ఉండవు. ఈ వినూత్న ఉత్పత్తి తయారీకి వరి పొట్టు, చెక్క ముక్కలు వంటి వ్యవసాయ వ్యర్థాలను వినియోగిస్తారు. ముందుగా వాటిని క్రిమిరహితం చేసి, ప్రయోగశాలలో తయారుచేసిన ప్రత్యేక పోషక మాధ్యమంతో కలుపుతారు. అనంతరం నియంత్రిత ఉష్ణోగ్రత, తేమ ఉన్న గదిలో పెద్ద ట్రేలలో ఉంచుతారు. కొన్ని రోజుల తర్వాత మైసీలియం క్రమంగా పెరిగి మొత్తం ఉపరితలాన్ని ఆక్రమిస్తుంది. సుమారు 20 రోజుల తర్వాత ఇది దట్టమైన పీచు నిర్మాణంగా మారుతుంది. దాదాపు 30 రోజుల తర్వాత ఆ పొరను సేకరించి, ప్రత్యేక ప్రక్రియల ద్వారా శుద్ధి చేసి, సాగే గుణం కలిగిన తోలుగా మారుస్తారు. చివరగా దీనిని అవసరానికి అనుగుణంగా రంగులు, ఫినిషింగ్ ఇచ్చి మార్కెట్‌కు సిద్ధం చేస్తారు.

# విచారణకు సహకరించని ఉదయ్ కృష్ణారెడ్డి..

హైదరాబాద్: ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి రెండు రోజుల పోలీసు కస్టడీ ముగిసింది. లైంగిక వేధింపుల కేసు విచారణ సందర్భంగా కస్టడీలో కృష్ణారెడ్డి నోరు మెదపలేదని తెలుస్తోంది. పోలీసులు అడిగిన చాలా ప్రశ్నలకు ఆయన సమాధానాలు చెప్పేందుకు నిరాకరించినట్లు సమాచారం. దీంతో మరోసారి కస్టడీకి కోరుతూ ఉప్పర్‌పల్లి కోర్టులో పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. విచారణకు కృష్ణారెడ్డి సహకరించలేదని, మరికొన్ని కీలక విషయాలు తెలుసుకునేందుకు నిందితుడిని కస్టడీకి అప్పగించాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం నాడు కోర్టులో ఈ పిటిషన్ విచారణకు వచ్చే అవకాశం ఉంది. కాగా, సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ పోలీసు అకాడమీలో మహిళా ట్రైనీ ఐపీఎస్‌పై లైంగిక వేధింపులు, దాడికి పాల్పడ్డారన్న ఆరోపణలపై కృష్ణారెడ్డిపై కేసులు నమోదు అయ్యాయి. అత్తాపూర్ పోలీసులు ఆయనపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), ఐటీ చట్టం కింద కేసులు నమోదు చేశారు. విచారణలో భాగంగా కృష్ణారెడ్డిని తమకు రెండు రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని ఉప్పర్‌పల్లి కోర్టులో పోలీసులు ఇటీవల పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం గత బుధవారం కస్టడీకి అనుమతించింది. కోర్టు ఆదేశాల మేరకు గురు, శుక్రవారాల్లో అత్తాపూర్ పోలీస్ స్టేషన్, ఉమెన్ సేఫ్టీ వింగ్ అధికారుల పర్యవేక్షణలో విచారణ జరిగింది. అయితే, కృష్ణారెడ్డి సహకరించకపోవడంతో పోలీసులు మరోసారి కోర్టును ఆశ్రయించారు.

# తెలంగాణలో అధికారంలోకి రావడమే బీజేపీ టార్గెట్

**ఢిల్లీ, ఆగస్టు 7(నినాదం):** వచ్చే ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేసి గెలుపు సాధిస్తామన్నారు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు. తెలంగాణలో అధికారంలోకి రావడమే బీజేపీ టార్గెట్ అని స్పష్టం చేసారు. అధికారం చేపట్టే విషయంలో ఎవరితోనూ పొత్తు ఉండదని పేర్కొన్నారు. తెలంగాణలో జనసేనతో సహా ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోబోమని ఆయన తేల్చి చెప్పారు. అయితే, ఎన్డీయే కూటమిలో జనసేన పార్టీ భాగస్వామి అని, దానిపై జాతీయస్థాయిలోనే నిర్ణయం ఉంటుందని స్పష్టం చేశారు. బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎంపీలతో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో బీజేపీ బలోపేతంపై కీలకంగా చర్చించారు. నియోజకవర్గాల వారీగా పార్టీ పరిస్థితిని సవిOక్షించారు. సంస్థాగత విస్తరణ, భవిష్యత్ కార్యాచరణపైనా చర్చ జరిగింది. అనంతరం రాంచందర్ రావు విOడియాతో మాట్లాడుతూ.... రాష్ట్రంలో అధికారం కోసం రోడ్ మ్యాప్ సిద్ధం చేస్తున్నామని తెలిపారు. 937 మండలాల్లో పార్టీని బలోపేతం చేస్తున్నామని వెల్లడించారు. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీదే గెలుపని, కచ్చితంగా అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్ తరహాలో ఇక్కడా విజయం సాధించి అధికారం చేపడతామన్నారు. రాష్ట్రంలోని కీలక నేతలంతా బీజేపీలో చేరేందుకు సమయం కోసం వేచి చూస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. తమ పార్టీ నేతల మధ్య విభేదాలు లేవని, భేదాభిప్రాయాలు మాత్రమే ఉన్నాయని రాంచందర్ రావు పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వంలో అవినీతి పెరిగిపోయిందని, కలిసి పోరాటం చేయాలని నితిన్ నబీన్ దిశానిర్దేశం చేశారని చెప్పుకొచ్చారు.

అసెంబ్లీ సమావేశాల అనంతరం రాష్ట్ర బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో మరోసారి సమావేశం నిర్వహిస్తామని రాంచందర్ రావు తెలిపారు. ఇకపై ప్రతి మOడు నెలలకు ఒకసారి నితిన్ నబీన్.. రా□ష్టానికి వస్తారని, ఇక్కడి నేతలతో సమావేశమై దిశానిర్దేశం చేస్తారన్నారు. ప్రజా సమస్యల విషయంలో రాష్ట్ర ప్రభుత్వంపై పోరాడుతామని చెప్పారు. కాగా, ఈ సమావేశంలో సునీల్ బన్సల్, అభయ్ పాటిల్ వంటి నేతలు కూడా పాల్గొన్నారు.

# చేనేత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**హైదరాబాద్, ఆగస్టు 7 (నినాదం):** చేనేత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తుమ్మల నాగేశ్వరావు అన్నారు. జాతీయ చేనేత దినోత్సవ వేడుకల్లో మంత్రి పాల్గొని ప్రసంగించారు. పీపుల్స్ ప్లాజాలో 100కు పైగా చేనేత స్టాల్స్ ప్రారంభించినట్లు తెలిపారు. ఆగస్టు 7 నుంచి 16 వరకు చేనేత వస్త్ర ప్రదర్శన కొనసాగుతుందన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ చేనేత పురస్కార గ్రహీతలను సత్కరిస్తామని చెప్పారు. చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసి నేతన్నలను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. భారతీయ సంస్కృతి, వారసత్వానికి చేనేత ప్రతీకన్నారు. గద్వాల, పోచంపల్లి, నారాయణపేట చేనేతకు ప్రపంచస్థాయిలో గుర్తింపు ఉందని మంత్రి తెలిపారు. చేనేత కార్మికుల జియో ట్యాగింగ్‌లో తెలంగాణ అగ్రస్థానంలో ఉందన్నారు. IIHT ద్వారా యువతకు ఆధునిక చేనేత నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. 'నేతన్న భరోసా' కింద ఏడాదికి రూ.18 వేల ఆర్థిక సాయం అందజేస్తున్నామని, 'నేతన్నకు భద్రత' పథకంలో రూ.5 లక్షల బీమా సౌకర్యాన్ని కల్పించినట్లు తెలిపారు. చేనేత రుణమాఫీకి రూ.49.27 కోట్లు విడుదల చేశామన్నారు. చేనేత రంగానికి మొత్తం రూ.980 కోట్లు ప్రభుత్వ విడుదల చేసినట్లు చెప్పారు. వేములవాడ యార్న్ డిపో ద్వారా 3096 మెట్రిక్ టన్నుల నూలు సరఫరా అవుతోందని అన్నారు. పెండింగ్‌లో ఉన్న చేనేత సహకార సంఘాల ఎన్నికల నిర్వహిస్తామన్నారు. రైతన్నకు, నేతన్నకు కాంగ్రెస్ ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

# ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు

విజయవాడ,ఆగస్ట7(ఆరఎనఎ): డీఎస్సీలో అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తూ వైసీపీ చేపడుతున్న రిలే నిరాహార దీక్షా శిబిరాలపై దాడులు చేయించడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. విజయవాడలో మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు నేతృత్వంలోని దీక్షా శిబిరంపై దాడి చేసి టెంట్లు ధ్వంసం చేయడం, కార్యకర్తలు, మహిళలపై రాళ్లు, కోడిగుడ్లతో దాడులు చేయడం రాజకీయ ఉన్మాదానికి పరాకాష్ఠ అని ఆయన వ్యాఖ్యానించారు. దీక్షా శిబిరం టెంట్‌పై మూత్ర విసర్జన చేయడం, మల్లాది విష్ణును వ్యాన్‌లో తరలిస్తుంటే జెండా కర్రతో దాడికి తెగబడటం రాష్ట్రంలో శాంతిభద్రతల క్షీణతకు అద్దం పడుతోందన్నారు. దాడులను అడ్డుకోవాల్సిన పోలీసులే బాధితులైన వైసీపీ నాయకులను అరెస్ట్ చేయడం విచారకరమని బొత్స విమర్శించారు. డీఎస్సీ నియామకాల అక్రమాలపై ప్రభుత్వం సీబీఐ విచారణ జరిపించాలని, ఈ దందాకు నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి నారా లోకేశ్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దాడులు చేసిన వారిపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని, ప్రభుత్వం ఎంతగా అణచివేయాలని చూసినా ప్రజా సమస్యలపై తమ పోరాటం ఆగేది లేదని బొత్స స్పష్టం చేశారు.

# రాహుల్ ప్రయాగ్‌రాజ్ సభకు అనుమతి

న్యూఢిల్లీ :
ఆగస్టు 8న ప్రయాగ్‌రాజ్‌లో రాహుల్ గాంధీ తలపెట్టిన 'ఛాత్రోన్ కీ గూంజ' (విద్యార్థుల గళం)సభకు యోగీ సర్కారు అనుమతిచ్చింది. పేపర్ లీకులు, నిరుద్యోగంపై విద్యార్థులతో రాహుల్ గాంధీ ఈసభలో ముఖాముఖి చర్చించనున్నారు. అయితే ముందుగా సభా వేదిక అయిన కేపీ గ్రౌండ్‌కు గతంలో ఇచ్చిన అనుమతిని రద్దు చేసి తీవ్ర ఉత్కంఠకు కారణమైన కాయస్థ పాఠశాల (కేపీ) ట్రస్ట్.. గురువారం అర్ధరాత్రి వెనక్కి తగ్గింది. కొన్ని షరతులతో సభ నిర్వహణకు మళ్లీ అనుమతి ఇస్తున్నట్లు ప్రకటించింది. సదస్సుకు పర్మిషన్ రావడంతో కాంగ్రెస్ శ్రేణులు సభా ఏర్పాట్లు చేస్తున్నారు. సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8:30 గంటల వరకు కేపీ గ్రౌండ్‌లో వేలాది మంది విద్యార్థులు, నిరుద్యోగ యువతతో నేరుగా సంభాషిస్తారు రాహుల్ గాంధీ.

# విశాఖపట్నంలో ఇవాళ భారీ ఉద్యోగ మేళా!

విశాఖపట్నం : విశాఖపట్నం జిల్లా పరిపాలన యంత్రాంగం, జిల్లా ఉపాధి కార్యాలయం కలిసి నేడు మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నాయి. నేషనల్ కెరీర్ సర్వీస్ సహకారంతో ఉదయం 10 గంటలకు ఇది ప్రారంభం అవుతుంది. కంచరపాలెం బాలికల ఐటీఐ క్యాంపస్‌లో ఉన్న.. జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయం ప్రాంగణంలో ఇది జరుగుతుంది. దేశీయ, రాష్ట్రస్థాయి ప్రైవేట్ సంస్థల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి, అర్హులైన అభ్యర్థులను ఉద్యోగాల కోసం ఎంపిక చేస్తారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

# నేడు పింఛనుదారుల మహాధర్నా

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం నేడు ఆగస్టు 7న మహాధర్నాకు పిలుపునిచ్చారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలు, పీఆర్సీ అమలు, హెల్త్ స్కీమ్ మెరుగుదల వంటి ప్రధాన డిమాండ్లతో ఈ ఆందోళన చేపడుతున్నారు. వృద్ధాప్యంలో ఉన్న తమను ప్రభుత్వం విస్మరించడం సరికాదనీ, తక్షణమే జోక్యం చేసుకుని డిమాండ్లను నెరవేర్చాలని వారు కోరుతున్నారు. రాజధాని హైదరాబాద్‌తో పాటుగా అన్ని జిల్లాల కలెక్టరేట్ల దగ్గర ఈ నిరసన కార్యక్రమాలు జరగనున్నాయి. న్యాయమైన తమ హక్కుల కోసం చేస్తున్న ఈ పోరాటంలో ప్రభుత్వం వెంటనే స్పందించకుంటే, రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని పింఛనుదారుల సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని తీవ్రంగా హెచ్చరించారు.

# టీపీసీసీ సోషల్ మీడియా ఛైర్మన్‌గా నవీన్ పెత్తెం

హైదరాబాద్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ)లో పలు కీలక నియామకాలు జరిగాయి. టీపీసీసీ సోషల్ మీడియా విభాగానికి నూతన ఛైర్మన్‌గా నవీన్ పెత్తెంను అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) నియమించింది. అలాగే మీడియా, పబ్లిసిటీ విభాగం ఛైర్మన్‌గా భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డికి బాధ్యతలు అప్పగించారు. ఈ నియామకాలకు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదం తెలిపారని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో సోషల్ మీడియా విభాగం కోఆర్డినేటర్‌గా పనిచేసిన నవీన్ పెత్తెం, ప్రస్తుతం రాష్ట్ర రవాణా అథారిటీలో సభ్యుడిగా కూడా ఉన్నారు.

# జీఐ ట్యాగ్‌తో కుప్పడం పట్టుకు మరింత విశిష్టత

12వ జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు నేతన్న సేవలో పథకాన్ని చీరాల నియోజకవర్గం కొత్తపేటలో ప్రారంభించారు.

కొత్తపేట గ్రామంలోని ఓ చేనేత మగ్గం యూనిట్ ను ముఖ్యమంత్రి సందర్శించారు. చేనేత మగ్గం వద్దకు వచ్చిన ముఖ్యమంత్రికి చేనేత యూనిట్ యజమాని బండారు బాలసుబ్రహ్మణ్యం స్వాగతం పలికారు. అనంతరం చేనేత కార్మికులతో సీఎం మాట్లాడారు. కుప్పడం పట్టు చీరల ప్రత్యేకత, సంప్రదాయ నేత వృత్తి నైపుణ్యం, మార్కెట్ పరిస్థితులపై వారితో చర్చించారు. ప్రభుత్వ సాయం మాకు కొండంత అండ : చేనేత కార్మికులుచేనేతల జీవనోపాధి, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలుపై చేనేత వర్క్‌షాప్‌లోని కార్మికులతో ముఖ్యమంత్రి మాట్లాడారు. వర్క్‌షాప్ ఏర్పాటుకు దారితీసిన ఆలోచన, యూనిట్ స్థాపన, ఎదురైన సవాళ్లు, వాటిని అధిగమించి తీర్చిదిద్దిన తీరు, యూనిట్ ను సమర్థంగా నడిపిస్తున్న అంశాన్ని వారు సీఎంకు వివరించారు. ముందుగా కంచి బోర్డర్ చీరల తయారీ దారు బత్తా ధనుంజయరావుతో ముఖ్యమంత్రి మాట్లాడారు. కుటుంబ పరిస్థితులు, చేనేత వృత్తి, ఉత్పత్తి వ్యయం, ఆదాయం, మార్కెటింగ్, విక్రయాల గురించి వివరంగా అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఎంతో ఉపయోగపడుతోందని, రూ.25 వేల ఆర్థిక సాయం తమకు ప్రోత్సాహంగా ఉంటుందని వివరించారు. అనంతరం ముఖ్యమంత్రి బండారు బాలసుబ్రహ్మణ్యంతో కలిసి వర్క్‌షాప్ లోని తొలి అంతస్తును పరిశీలించారు. భవనాన్ని విస్తరించి మరిన్ని మగ్గాలు ఏర్పాటు చేసి మరింత మంది చేనేత కార్మికులకు ఉపాధి కల్పించాలన్న ప్రణాళికలను ఆయన సీఎంకు వివరించారు. కోవిడ్ కారణంగా నిలిచిపోయిన విస్తరణ పనులను తిరిగి ప్రారంభించ నున్నట్లు తెలిపారు. అనంతరం వర్క్‌షాప్‌లో పనిచేస్తున్న ఇతర చేనేత కార్మికులతో ముఖ్యమంత్రి ముచ్చటించారు. బొడ్డు అరుణ అనే మహిళ మగ్గం పై చీర నేస్తున్న తీరును సీఎం ఆసక్తిగా పరిశీలించారు. ప్రభుత్వం అందించిన రూ.25 వేల ఆర్థిక సాయం తమ బ్యాంకు ఖాతాల్లో జమ అయినట్లు మొబైల్ ఫోన్లలో వచ్చిన సంక్షిప్త సందేశాన్ని కార్మికులు ముఖ్యమంత్రికి చూపించారు. ప్రభుత్వ సహకారంతో తమ జీవనోపాధికి భరోసా లభించిందని చేనేతలు సంతోషం వ్యక్తం చేశారు.



# డైట్ పాటించినా షుగర్ రాకుండా ఆగదా?



**వ్యాయామం, సరైన డైట్ ఫాలో అవ్వాలని నిపుణులు చెబుతారు. ఇవి ఇప్పటికీ అత్యంత ముఖ్యమైనవే అయినప్పటికీ, అందరికీ ఒకేలా రక్షణ ఇవ్వలేవని ఒక కొత్త అధ్యయనం చెబుతోంది. ఈ లైఫ్‌స్టైల్ అలవాట్లు పాటిస్తున్నప్పటికీ కొందరిలో టైప్-2 డయాబెటిస్ వస్తూనే ఉందని పరిశోధకులు కనుగొన్నారు. టైప్-2 డయాబెటిస్ అనేది శరీరం తగినంత ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేయలేకపోవడం లేదా ఉన్న ఇన్సులిన్‌ను సరిగ్గా ఉపయోగించుకోలేకపోవడం వల్ల వచ్చే ఆరోగ్య సమస్య. ఇన్నాళ్లూ టైప్-2 డయాబెటిస్‌ను నివారించడానికి సరైన పోషకాహారం తీసుకోవడం, రోజూ వ్యాయామం చేయడమే ఉత్తమ మార్గాలుగా భావిస్తూ వచ్చాం. ఇవి ఇప్పటికీ అత్యంత ముఖ్యమైనవే అయినప్పటికీ, అందరికీ ఒకేలా రక్షణ ఇవ్వలేవని ఒక కొత్త అధ్యయనం చెబుతోంది.**

**ఈ రోజుల్లో చాలా మంది షుగర్ వ్యాధితో బాధపడుతున్నారు. ముఖ్యంగా టైప్-2 డయాబెటిస్‌తో సఫర్ అవుతున్నారు. అయితే, రక్తంలో షుగర్ లెవల్స్ అదుపు చేయడానికి**

ఎంతో కాలంగా జీవనశైలి మార్పులు పాటిస్తూ, బరువు తగ్గినప్పటికీ కొందరిలో టైప్-2 డయాబెటిస్ వస్తూనే ఉందని పరిశోధకులు గుర్తించారు. డయాబెటిస్ రావడానికి కేవలం ఆహారం, వ్యాయామం మాత్రమే కాకుండా జన్యువులు , శరీరంలో కొవ్వు నిల్వ ఉండే విధానం వంటి అనేక ఇతర అంశాలు కూడా కారణమవుతాయని ఇది స్పష్టం చేస్తోంది. అయితే, డైట్, వ్యాయామం నిరుపయోగమని ఈ అధ్యయనం చెప్పడం లేదు. ఒకే రకమైన జీవనశైలి మార్పులకు వేర్వేరు వ్యక్తుల శరీరాలు వేర్వేరుగా స్పందిస్తాయని మాత్రమే తెలుపుతోంది. బరువు తగ్గిన తర్వాత చాలామందిలో బ్లడ్ షుగర్ కంట్రోల్, ఇన్సులిన్ సున్నితత్వం బాగా మెరుగుపడగా, మరికొందరిలో జీవక్రియల (వీమ్రుఎశీశ్రీఱంఎ) మార్పులు చాలా తక్కువగా కనిపిస్తాయి. అందువల్ల డయాబెటిస్ నివారణకు అందరికీ ఒకే రకమైన సూచనలు కాకుండా, ప్రతి ఒక్కరి శరీర తత్వాన్ని బట్టి వ్యక్తిగత సంరక్షణ అవసరమని ఈ అధ్యయనం సూచిస్తోంది. కొందరు



ఇన్సులిన్ పట్ల ఎక్కువ సెన్సిటివిటీని పొంది, బ్లడ్ షుగర్‌ను సమర్థవంతంగా నియంత్రించగలిగారు. మరికొందరు బరువు తగ్గి, ఆరోగ్యకరమైన అలవాట్లు పాటించినప్పటికీ, వారిలో ఇన్సులిన్ నిరోధకత కొనసాగి, డయాబెటిస్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉన్నట్లు తేలింది. 'డయాబెటిస్' జర్నల్‌లో ప్రచురితమైన ఈ అధ్యయనం ప్రకారం కేవలం బరువు తగ్గడం మాత్రమే మెటబాలిక్ ఆరోగ్యాన్ని పూర్తిస్థాయిలో వివరించలేదు. ఈ అధ్యయన ప్రధాన శాస్త్రవేత్త ప్రొఫెసర్ నార్బర్ట్ స్టెఫాన్ మాట్లాడుతూ "ప్రమాదకరమైన 'రిస్క్ క్లస్టర్ 5'లో ఉన్న వ్యక్తులు 9 సంవత్సరాల సుదీర్ఘ కాలంలో ఏకంగా 8% వరకు బరువు తగ్గి, దానిని అలాగే నిలబెట్టుకున్నప్పటికీ... వారిలో గ్లూకోజ్ స్థాయిలు పెరగడం, ఇన్సులిన్ ఊరే ప్రక్రియ తగ్గడం, డయాబెటిస్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉండటం మమ్మల్ని తీవ్ర ఆశ్చర్యానికి గురిచేసింది" అని పేర్కొన్నారు.

ఇన్సులిన్ రెసిస్టెన్స్ అంటే ఏంటి?

ఇన్సులిన్ అనేది రక్తంలోని గ్లూకోజ్ (షుగర్)ను శక్తి కోసం శరీర కణాల్లోకి పంపడానికి సాయపడే ఒక హార్మోన్. శరీర కణాలు ఇన్సులిన్‌కు సరిగ్గా స్పందించకపోతే, శరీరం మరింత ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేయాల్సి వస్తుంది. ఈ పరిస్థితినే ఇన్సులిన్ నిరోధకత అంటారు. కాలక్రమేణా, ప్యాంక్రియాస్ (క్లోమం) శరీరం కోరేంత ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేయలేక సమర్థత కోల్పోతుంది. దీంతో రక్తంలో షుగర్ స్థాయిలు పెరిగి, టైప్-2 డయాబెటిస్‌కు దారితీస్తుంది. బయటికి ఎలాంటి లక్షణాలు కనిపించకుండానే, డయాబెటిస్ నిర్ధారణ కావడానికి కొన్నేళ్ల ముందే ఈ ఇన్సులిన్ నిరోధకత మొదలవుతుంది.

### లివర్‌లో కొవ్వు ఎక్కువైతే

# ముఖం, చర్మంపై కనిపించే లక్షణాలు

## ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం చేయొద్దంటున్న డాక్టర్!

**ఫ్యాటీ లివర్ రెండు రకాలు. ఒకప్పుడు మద్యం తాగేవారిలో ఇది ఎక్కువగా కనిపించేది. దీనిని ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్ అంటారు. అయితే, ఇప్పుడు మద్యం తాగనివారిలో కూడా ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తుంది. ఈ పరిస్థితిని నాన్-ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్ అంటారు. ఫ్యాటీ లివర్ అంటే కాలేయంలో కొవ్వు పేరుకుపోవడం. ఈ పరిస్థితిని నిర్లక్ష్యం చేయకూడదు. ప్రతి నలుగురిలో ఒకరు ఈ వ్యాధితో బాధపడుతున్నారు. ఈ రోజుల్లో ఫ్యాటీ లివర్ సమస్య వేగంగా పెరుగుతోంది. మారుతున్న లైఫ్‌స్టైల్, సరైన ఆహారం తీసుకోకపోవడం వల్ల ఈ సమస్య బారిన పడుతున్నారు.**

మనకు ఏదైనా వ్యాధి లేదా సమస్య వచ్చినప్పుడు, మన శరీరం దాని లక్షణాల్ని చూపించడం ప్రారంభిస్తుంది. అయితే, ఫ్యాటీ లివర్ (కాలేయంలో కొవ్వు చేరడం) అనే సమస్యను తరచుగా "సైలెంట్ డిసీజ్" (లక్షణాలు బయటకు కనిపించని వ్యాధి) అని పిలుస్తారు. ఎందుకంటే ప్రారంభ దశల్లో చాలామందిలో ఎలాంటి స్పష్టమైన లక్షణాలు కనిపించవు. అయితే, కాలేయ పనితీరు క్షీణించినా లేదా ఫ్యాటీ లివర్ వాపు, తీవ్రమైన కాలే య దెబ్బతినడానికి దారితీసినా కొన్ని మార్పులు ముఖం, చర్మంపై స్పష్టంగా కనిపించడం ప్రారంభి స్తాయి. ఫ్యాటీ లివర్ ఉన్నప్పుడు ముఖం, చర్మంపై ఎలాంటి లక్షణాలు కనిపిస్తాయో డాక్టర్ వినయ్ కుమార్ బి.ఆర్. (కన్సల్టెంట్ – హెపటాలజీ, ఫోర్టిస్ హాస్పిటల్, బన్నర్‌ఘట్ట రోడ్, బెంగళూరు) వివరించారు. ఆ పూర్తి వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం.



**ముఖంలో మార్పులు, వాపు:** ముఖం బాగా అలసిపోయినట్లుగా లేదా ఉబ్బినట్లుగా కనిపించడం ఇందులో ఒక సాధారణ మార్పు. ముఖ్యంగా కళ్ల చుట్టూ వాపు రావచ్చు. శరీరంలో ద్రవాల అసమతుల్యత, నిద్రలేమి, శరీరంలో వాపు లేదా ఇతర మెటబాలిక్ సమస్యల వల్ల ఇది జరుగుతుంది.

**చర్మం కాంతిహీనంగా మారడం:** కొంతమందిలో చర్మం జీవం లేకుండా, గ్లో కోల్పోయినట్లు మారుతుంది. కాలేయ వ్యాధి వల్ల జీవక్రియల్లో లోపాలు, పోషకాహార లోపాలు ఏర్పడటమే కారణం.

**ముదిరిన కాలేయ సమస్యల్లో లక్షణాలు:** వ్యాధి తీవ్రమైనప్పుడు చర్మం, కళ్ళు పసుపు రంగులోకి మారతాయి. దీనినే కామెర్లు అంటారు. శరీరంలో 'బిలిరుబిన్' అనే పదార్థం ఎక్కువగా చేరిపోవడం వల్ల ఇది జరుగుతుంది.

**ఇతర చర్మ లక్షణాలు**

కళ్ల కింద నల్లటి వలయాలు, ముఖంపై మచ్చలు చర్మం పొడిబారడం, దురద ముఖంపై సన్నటి రక్తనాళాలు పైకి కనిపించడం వంటివి కూడా కొందరిలో చూడవచ్చు.

**ఇన్సులిన్ నిరోధకత :** ఫ్యాటీ లివర్ ఉన్నవారిలో ఊబకాయం, ఇన్సులిన్ రెసిస్టెన్స్ సాధారణంగా కనిపిస్తాయి. దీనివల్ల మెడ, ముఖం చుట్టూ చర్మం నల్లగా మారే అవకాశం ఉంది. కేవలం ముఖంలో వచ్చే మార్పుల ఆధారంగానే ఫ్యాటీ లివర్ ఉందో లేదో నిర్ధారించలేం.

# పాదాల నొప్పులు తగ్గాలంటే...



రోజంతా నడకలు, షూటింగ్‌లు, డ్యాన్స్‌లు, నిరంతర ప్రయాణాలతో సెలబ్రిటీల పాదాలపై కూడా ఎక్కువ ఒత్తిడి పడుతుంది. అయినప్పటికీ వారు ఎప్పుడూ ఉత్సాహంగా కనిపించడం వెనుక కొన్ని సాధారణ సెల్ఫ్‌కేర్ అలవాట్లు ఉంటాయి. అలాంటి వాటిలో ఒకదానిని తాజాగా నటి రష్మిక మందన్న అభిమానులతో పంచుకున్నారు. ఖరీదైన స్పా ట్రీట్‌మెంట్ల కంటే, ఇంట్లోనే గోరువెచ్చని నీటిలో ఎప్సమ్ సాల్ట్ కలిపి పాదాలను కొద్దిసేపు నానబెట్టడం తనకు ఎంతో ఇష్టమని అన్నారు. ఈ నేపథ్యంలో అసలు ఈ సెల్ఫ్‌కేర్ పాదాలను ఏ విధంగా సంరక్షిస్తుందో తెలుసుకుందాం..

రోజంతా నిలబడి పనిచేయడం, ఎక్కువసేపు నడవడం, తరచూ ప్రయాణాలు చేయడం, హైహీల్స్, బిగుతైన షూస్ ధరించడం వల్ల పాదాలు బాగా అలసిపోతాయి. కానీ ముఖం, జుట్టు సంరక్షణకు ఇచ్చే ప్రాధాన్యతను చాలా మంది పాదాల ఆరోగ్యానికి ఇవ్వరు. అయితే ప్రముఖ నటి రష్మిక మందన్న మాత్రం ఎంత బిజీ షెడ్యూల్ ఉన్నా తన పాదాల సంరక్షణను అస్సలు నిర్లక్ష్యం చేయనని ఇటీవల వెల్లడించారు. షూటింగ్‌లు, డ్యాన్స్, ప్రయాణాల వల్ల అలసిపోయిన పాదాలకు ఉపశమనం కలిగించేందుకు ఆమె గోరువెచ్చని నీటిలో ఎప్సమ్ సాల్ట్ కలిపి అందులో పాదాలను కొద్దిసేపు ఉంచుతానని చెప్పారు. ఈ సులభమైన, తక్కువ ఖర్చుతో చేసే ఫుట్‌కేర్ రొటీన్ రష్మిక ఫ్యాన్స్‌ను బాగా అట్రాక్ట్ చేసింది. అయితే ఎప్సమ్ సాల్ట్ అంటే ఏమిటి? ఇది నిజంగా పాదాల ఆరోగ్యానికి ఉపయోగపడుతుందా? నిపుణులు ఏమి చెబుతున్నారో తెలుసుకుందాం..

**ఎప్సమ్ సాల్ట్ అంటే ఏమిటి?**

ఎప్సమ్ సాల్ట్ అంటే సాధారణ వంటలో వేసే ఉప్పు కాదు. ఇది మెగ్నీషియం సల్ఫేట్ అనే ఖనిజం. గోరువెచ్చని నీటిలో కరిగించి పాదాలను నానబెట్టడానికి చాలామంది ఉపయోగిస్తుంటారు. గోరువెచ్చని నీటిలో పాదాలను ఉంచడం వల్ల కండరాలు రిలాక్స్ అవుతాయి. ఎప్సమ్ సాల్ట్‌తో కలిపి ఉపయోగించడం వల్ల పాదాలు ఫ్రెష్‌గా అనిపిస్తాయని రీసెర్చ్‌గేట్ అధ్యయనం సైతం పేర్కొంది.

**వాపును తగ్గిస్తుంది**

ఎప్సమ్ సాల్ట్‌తో పాదాలను నానబెట్టడం శరీరం నుంచి విషపదార్థాలను తొలగిస్తుందని కొందరు చెప్పినప్పటికీ దీనిని ధృవీకరించడానికి బలమైన ఆధారాలు లేవు. అయితే చర్మం ద్వారా మెగ్నీషియం శరీరంలోనికి వెళ్లి, మన బాడీలో మెగ్నీషియం స్థాయిలు పెరిగి, వాపు తగ్గే అవకాశం ఉంది. వాపు తగ్గడం వల్ల ఆర్థరైటిస్, గౌట్ వంటి సమస్యలతో సంబంధం ఉన్న నొప్పి, బిగువు తగ్గే అవకాశం ఉంది.

**చర్మాన్ని ఎక్స్‌ఫోలియేట్ చేస్తుంది**

ఎప్సమ్ సాల్ట్ క్రిస్టల్ సమ్మేళనం పాదాలపై ఉన్న మృత చర్మాన్ని తొలగిస్తుంది. మన పాదాలను గోరువెచ్చని నీటిలో ఎప్సమ్ సాల్ట్ వేసి నానబెడితే పాదాల గరుకుదనం తగ్గి, మృదువుగా మారుతాయి. ఆ తర్వాత ప్యూమిస్ స్టోన్ లేదా ఫుట్ ఫైల్‌తో మృదువుగా శుభ్రం చేసి మంచి మాయిశ్చరైజర్ రాస్తే పాదాలు మరింత మృదువుగా మారుతాయి. రష్మిక కూడా పాదాలను నానబెట్టిన తర్వాత మాయిశ్చరైజర్ రాయడం తన రొటీన్‌లో తప్పనిసరి అని చెప్పారు.

**అలసిపోయిన పాదాలకు ఉపశమనం ఇస్తాయి**

రోజంతా నిలబడి పనిచేసే వారు లేదా ఎక్కువసేపు నడిచిన తర్వాత పాదాలు బరువుగా అనిపించడం సహజం.

### ఎస్‌బీఐ సంచలన

# ఆర్థిక ఫలితాలు

## రూ. 21,121 కోట్ల రికార్డు లాభం





**చారిత్రాత్మక ఆర్థిక పురోగతి**

దేశీయ అతి పెద్ద బ్యాంక్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) 2027 ఆర్థిక సంవత్సర తొలి త్రైమాసికంలో (క్యూ1ఎఫ్ వై27) అత్యుత్తమ ప్రదర్శన కనబరిచింది. గతంలో ఎన్నడూ లేనంతగా రూ. 21,121 కోట్ల అత్యధిక త్రైమాసిక నికర లాభాన్ని నమోదు చేసింది. ఇది వార్షికంగా 10.23 శాతం వృద్ధిని సూచిస్తోంది. ఆపరేటింగ్ లాభం వార్షికంగా 9.77 శాతం పెరిగి రూ. 33,529 కోట్లకు చేరగా, నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) 14.88 శాతం వృద్ధి చెంది రూ. 46,992 కోట్లకు చేరుకుంది. దేశీయ నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) 3.00 శాతంగా, మొత్తం బ్యాంక్ ఎన్ఐఎం 2.86 శాతంగా నమోదయ్యాయి.

**వ్యాపార విస్తరణ మరియు అడ్వాన్సులు**

బ్యాంక్ మొత్తం వ్యాపారం రూ. 110 లక్షల కోట్లను దాటింది. డిపాజిట్లు రూ. 60 లక్షల కోట్లు, అడ్వాన్సులు రూ. 50 లక్షల కోట్లకు పైగా నమోదయ్యాయి. మొత్తం బ్యాంక్ అడ్వాన్సుల వృద్ధి 18.63 శాతంగా ఉంది. రిటైల్, వ్యవసాయం, ఎస్ఎంఈ (రామ్) విభాగాలు 18.20 శాతం వృద్ధి సాధించాయి. విడివిడిగా చూస్తే వ్యవసాయ అడ్వాన్సులు 25.43 శాతం, ఎస్ఎంఈ 22.33 శాతం, రిటైల్ పర్సనల్ 15.15 శాతం, కార్పొరేట్ అడ్వాన్సులు 18.05 శాతం చొప్పున పెరిగాయి. విదేశీ కార్యాలయాల అడ్వాన్సులు రూపాయి రూపంలో 21.38 శాతం, డాలర్ రూపంలో 9.97 శాతం వృద్ధి నమోదు చేశాయి.

**డిపాజిట్లు మరియు ఆస్తి నాణ్యత**

మొత్తం బ్యాంక్ డిపాజిట్లు వార్షికంగా 9.73 శాతం పెరిగాయి. రిటైల్ టర్మ్ డిపాజిట్లు 14.39 శాతం, కాసా డిపాజిట్లు 9.30 శాతం వృద్ధి చెందాయి. జూన్ 30, 2026 నాటికి కాసా నిష్పత్తి 39.24 శాతంగా ఉంది. స్థూల ఎన్పీఏ నిష్పత్తి 1.47 శాతానికి, నికర ఎన్పీఏ నిష్పత్తి 0.38 శాతానికి మెరుగుపడ్డాయి, ఇవి గత రెండు దశాబ్దాలలోనే అత్యల్పం. ప్రొవిజన్ కవరేజ్ రేషియో 74.20 శాతంగా, స్లిప్పేజ్ నిష్పత్తి 0.57 శాతంగా, క్రెడిట్ కాస్ట్ 0.27 శాతంగా ఉన్నాయి. క్యాపిటల్ అడిక్వెసీ రేషియో (సిఏఆర్) 15.67 శాతానికి చేరింది. ఆర్ఓఏ 1.11 శాతంగా, ఆర్ఓఈ 17.87 శాతంగా నమోదయ్యాయి.

**సాంకేతికత మరియు భవిష్యత్ దిశ**

ముంబైలో ఆగస్టు 7, 2026న జరిగిన సమావేశంలో బ్యాంక్ చైర్మన్ సీఎస్ శెట్టి మాట్లాడుతూ డిజిటల్ ఫస్ట్, కస్టమర్ ఫస్ట్, నేషన్ ఆల్వేస్ అనే సూత్రంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. బ్యాంకింగ్ సులభతరం చేసేందుకు 'సరళ్' ప్రాజెక్ట్, యోనో బిజినెస్ కోసం ఏఐ వర్చువల్ అసిస్టెంట్ 'యోనో జీ', రూ. 10 కోట్ల వరకు ఉన్న ఎస్ఎంఈ రుణాల వేగవంత నిర్ణయాలకు 'ఎంఎస్ఎంఈ డ్రీమ్', ఒత్తిడి ఖాతాలను ముందస్తుగా గుర్తించే 'ప్రిజమ్' ప్లాట్‌ఫామ్‌లను వినియోగిస్తున్నట్లు చెప్పారు. ఎస్బీఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ విజయవంతంగా లిస్ట్ కావడం ముఖ్యమైన మైలురాయి అని పేర్కొన్నారు. 64 శాతానికి పైగా సేవింగ్స్ ఖాతాలు యోనో ద్వారానే తెరువబడగా, డిజిటల్/ప్రత్యామ్నాయ లావాదేవీల వాటా 98.8 శాతానికి చేరింది. యోనోకు 10.5 కోట్లకు పైగా రిజిస్టర్డ్ వినియోగదారులు ఉన్నారు.

HDFC BANK
We understand your world





### లోన్ వడ్డీ రేట్లు తగ్గించి

# హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ శుభవార్త

## ఈరోజు నుంచే అమలు.. తగ్గనున్న ఈఎంఐ భారం





ప్రైవేట్ రంగం అతిపెద్ద బ్యాంక్ అయిన హెచ్‌డీఎఫ్‌సీ నుంచి అదిరే శుభవార్త వచ్చింది. ఈ బ్యాంకులో వివిధ రకాల రుణాలు తీసుకున్న వారికి నెల నెలా చెల్లించే ఈఎంఐల భారం కొంత తగ్గనుంది. ఎందుకంటే ఎంపిక చేసిన టెన్యూర్లపై రుణాల వడ్డీ రేట్లను తగ్గిస్తూ బ్యాంక్ నిర్ణయం తీసుకుంది. తగ్గించిన ఎంసీఎల్ఆర్ రేట్లు ఆగస్టు 7, 2026 నుంచే అమలులోకి వస్తాయని తెలిపింది. మరి ఏ టెన్యూర్ పై ఎంత మేర తగ్గించారు? అనే వివరాలు ఇప్పుడే మనం తెలుసుకుందాం. దేశంలోని అతిపెద్ద ప్రైవేట్ బ్యాంక్ అయిన హెచ్‌డీఎఫ్‌సీ తమ రుణ గ్రహీతలుక తీపి కబురు అందించింది. బ్యాంక్ తన మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ ఆధారిత లెండింగ్ రేట్లు ను ఎంపిక చేసిన కాల పరిమితులపై తగ్గించినట్లు ప్రకటించింది. వివిధ టెన్యూర్లపై 5 బేసిస్ పాయింట్ల వరకు వడ్డీ రేట్లను తగ్గించినట్లు తాజాగా ప్రకటించింది. ఈ సవరించిన కొత్త వడ్డీ రేట్లను ఆగస్టు 7, 2026 శుక్రవారం నుంచే అమలులోకి తెచ్చినట్లు తన అధికారిక బ్యాంక్ వెబ్‌సైట్లో పేర్కొంది. మరి ఏ టెన్యూర్ రుణాలపై వడ్డీ రేట్లు తగ్గాయి, కొత్త వడ్డీ రేట్లు ఎలా ఉన్నాయి? అనే పూర్తి వివరాలు తెలుసుకుందాం. ఈ వడ్డీ రేట్ల తగ్గింపుతో ఎంసీఎల్ఆర్ తో అనుసంధానించిన హోమ్ లోన్, పర్సనల్ లోన్, కార్ లోన్ వంటి వివిధ రుణాలు తీసుకున్న వారిపై వడ్డీ భారం స్వల్పంగా తగ్గనుంది. దీంతో నెల నెలా చెల్లించాల్సిన ఈఎంఐల భారం తగ్గుతుంది. అయితే, ఈ సవరణ అనేది ఫ్లోటింగ్ రేట్ వడ్డీ ఎంచుకున్న వారికి వర్తిస్తుంది. అలాగే కొత్తగా రుణాలు తీసుకున్న వారికి ఆటోమేటిక్‌గా తగ్గించిన వడ్డీ రేట్ల ప్రకారమే రుణాలు మంజూరు చేస్తారు.

**కొత్త ఎంసీఎల్ఆర్ రేట్లు ఇవే**

సవరణ తర్వాత హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో ఎంసీఎల్ఆర్ రేట్లు కాల పరిమితిని బట్టి 8 శాతం నుంచి 8.65 శాతంగా ఉన్నాయి. ఓవర్‌నైట్ ఎంసీఎల్ఆర్ రేటును 5 బేసిస్ పాయింట్లు తగ్గించి 8.05 శాతం నుంచి 8 శాతానికి సవరించారు. నెల రోజుల ఎంసీఎల్ఆర్ రేటును సైతం 5 బేసిస్ పాయింట్లు తగ్గించి 8.05 శాతం నుంచి 8 శాతానికి కుదించారు. 3 నెలల ఎంసీఎల్ఆర్ రేటును 5 బేసిస్ పాయింట్లు తగ్గించడంతో 8.20 శాతం నుంచి 8.15 శాతానికి తగ్గింది. 6 నెలల ఎంసీఎల్ఆర్ రేటును సైతం 5 బేసిస్ పాయింట్లు తగ్గించడంతో 8.35 శాతం నుంచి 8.30 శాతానికి తగ్గింది. 1 సంవత్సరం ఎంసీఎల్ఆర్ రేటు సైతం 5 బేసిస్ పాయింట్లు తగ్గించడంతో 8.45 శాతం నుంచి 8.40 శాతానికి తగ్గింది. 2 ఏళ్ల ఎంసీఎల్ఆర్ రేటులో ఎలాంటి మార్పు చేయకుండా 8.55 శాతంగా ఉంది. 3 సంవత్సరాల ఎంసీఎల్ఆర్ రేటును 5బేసిస్ పాయింట్లు తగ్గించడంతో 8.70 శాతం నుంచి 8.65 శాతానికి తగ్గింది. మరోవైపు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో ప్రస్తుతం తన బేస్ రేటును 8.80 శాతం నుంచి 8.70 శాతానికి తగ్గించింది. అలాగే బెంచ్ మార్క్ ప్రైమ్ లెండింగ్ రేటును (ధీూ=) ను 17.30 శాతం నుంచి 17.20 శాతానికి తగ్గించింది. ఇక ఫిక్స్‌డ్ డిపాజిట్ల వడ్డీ రేట్లను బ్యాంకు సాధారణ పౌరులకు 2.75 శాతం నుంచి 6.50 శాతం వరకు, సీనియర్ సిటిజన్లకు 3.25 శాతం నుంచి 7 శాతం వరకు అందిస్తోం ది.

# రూ. 1 లక్ష ఇన్వెస్ట్ చేసినోళ్లకు పదేళ్లలోనే రూ. 6 లక్షలొచ్చాయ్..

మ్యూచువల్ ఫండ్లలో లాంగ్ రన్‌లో అద్భుత స్థాయిలో రిటర్న్లు వస్తాయన్న సంగతి తెలిసిందే. కానీ కచ్చితమైన రాబడి అంటూ ఏం ఉండదు. గత పదేళ్లలో 15 శాతానికిపైగా వార్షిక రిటర్న్లు అందించిన 42 ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ ఇన్వెస్టర్లకు భారీ లాభాలు అందించాయి. కొన్ని ఫండ్లు ఈ క్రమంలో లక్ష పెట్టుబడిపై రూ. 6 లక్షలకుపైగా రాబడి అందించాయి. దీర్ఘకాలంలో సంపద సృష్టించాలనుకునే పెట్టుబడిదారులకు ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ మరోసారి తమ సామర్థ్యాన్ని నిరూపించాయి. గత పదేళ్లలో 15 శాతానికిపైగా వార్షిక రాబడి అందించిన 42 ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ ఇన్వెస్టర్ల పెట్టుబడుల్ని కనీసం 4 రెట్లకుపైగా పెంచినట్లు తాజా విశ్లేషణ వెల్లడించింది. కొన్ని ఫండ్లు రూ. 1 లక్ష లంప్ సమ్ పెట్టుబడిని రూ. 6 లక్షలకుపైగా మార్చి ఆకట్టుకున్నాయి. ఈ లిస్టులో నిప్పన్ ఇండియా స్మాల్ క్యాప్ ఫండ్ అగ్రస్థానంలో నిలిచింది. ఈ





ఫండ్ గత పదేళ్లలో చూస్తే 20.61 శాతం జూ+= రాబడి అందించింది. దీంతో రూ. 1 లక్ష పెట్టుబడి ప్రస్తుతం రూ. 6.52 లక్షలకు పెరిగింది. ఈ ఫండ్ స్మాల్ క్యాప్ విభాగంలోనే అతిపెద్ద ఫండ్లలో ఒకటిగా కొనసాగుతోంది. రెండో స్థానంలో క్వాంట్ స్మాల్ క్యాప్ ఫండ్ నిలిచింది. ఇది సగటున వార్షిక ప్రాతిపదికన 19.90 శాతం సీఏజీఆర్ రిటర్న్లు ఇచ్చింది. ఇక్కడ లక్ష పెట్టుబడిపై రూ. 6.14 లక్షలు వచ్చాయి. తర్వాత ఈ లిస్టులో క్వాంట్ ఈఎల్ఎస్ఎస్ టాక్స్ సేవర్ ఫండ్ 18.97 శాతం, క్వాంట్ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ 18.69 శాతం వార్షిక రాబడి అందించాయి. ఈ రెండు ఫండ్లు పెట్టుబడుల్ని 5 రెట్లకుపైగా పెంచాయి. ఇన్వెస్కో ఇండియా మిడ్ క్యాప్ ఫండ్ 18.35 శాతం సీఏజీఆర్ రిటర్న్స్‌తో రూ. 1 లక్షను రూ. 5.39 లక్షలుగా మార్చింది. యాక్సిస్ స్మాల్ క్యాప్ ఫండ్ ఇదే సమయంలో 18.22 శాతం రాబడితో లక్షను రూ. 5.34 లక్షలుగా మలిచింది. మిడ్ క్యాప్ విభాగంలో నిప్పన్ ఇండియా గ్రోత్ మిడ్ క్యాప్ ఫండ్, ఎడిల్ వైస్ మిడ్ క్యాప్ మ్యూచువల్ ఫండ్ రెండూ దాదాపు 18 శాతానికిపైగా రిటర్న్లు ఇచ్చాయి. ఇంకాస్మాల్ క్యాప్ ఫండ్స్, ఎణఖీజ మిడ్ క్యాప్ ఫండ్, క్వాంట్ మల్టీ క్యాప్ ఫండ్స్ కూడా మంచి రాబడిని అందించాయి.

## అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా న్యాయ అవగాహన సదస్సు




**సంగారెడ్డి బ్యూరో , ఆగస్టు 7 (నినాదం):** అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా నేడు జిల్లా న్యాయ సేవా సంస్థ (డీఎల్ఎస్ఏ), సంగారెడ్డి ఆధ్వర్యంలో గౌరవనీయులైన జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి బి. సౌజన్య పటాన్‌చెరు మండలంలోని ఇంద్రేశం, పెద్దకంజర్ల తెలంగాణ గిరిజన సంక్షేమ పురుషుల డిగ్రీ కళాశాలలో న్యాయ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ భారత రాజ్యాంగం గిరిజనులకు కల్పించిన రాజ్యాంగబద్ధమైన హక్కులు, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, విద్య, ఆరోగ్యం, ఉపాధి, భూ హక్కులు, అటవీ హక్కుల పరిరక్షణ, ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి విద్యార్థులకు సమగ్రంగా వివరించారు. గిరిజనుల సంప్రదాయాలు, సంస్కృతి, భాష, జీవన విధానాన్ని పరిరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. సమాజంలోని బలహీన వర్గాలకు న్యాయం అందించడంలో జిల్లా న్యాయ సేవా సంస్థ కీలక పాత్ర పోషిస్తోందని, ఆర్థిక ఇబ్బందులు ఉన్న వారికి ఉచిత న్యాయ సహాయం, న్యాయ సలహాలు, మధ్యవర్తిత్వం, లోక్ అదాలత్‌ల ద్వారా త్వరితగతిన న్యాయం అందించబడుతుందని తెలిపారు. అదేవిధంగా మహిళల హక్కులు, బాలల హక్కులు, పోక్సో చట్టం, గృహహింస నిరోధక చట్టం, సైబర్ నేరాల నివారణ, మాదకద్రవ్యాల దుష్పరిణామాలు, ర్యాగింగ్ నిరోధం, బాధితులకు అందించే పరిహార పథకం, రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రాథమిక హక్కులు మరియు ప్రాథమిక విధులపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఉన్నత విద్యతో పాటు చట్టాలపై అవగాహన పెంపొంది ంచుకొని, సమాజంలో జరుగుతున్న అన్యాయాలను నిరోధించడంలో చైతన్య వంతులుగా ఉండాలని సూచించారు. తమ కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలకు కూడా న్యాయ అవగాహన కల్పించి చట్టాల పట్ల గౌరవాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు. న్యాయపరమైన సమస్యలు ఎదురైనప్పుడు జిల్లా న్యాయ సేవా సంస్థను సంప్రదించి ఉచిత న్యాయ సహాయాన్ని పొందాలని, ప్రతి ఒక్కరూ న్యాయ సేవా సంస్థల సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమం అనంతరం విద్యార్థుల సందేహాలకు కార్యదర్శి గారు సమాధానాలు ఇచ్చి, న్యాయ అవగాహన కలిగిన యువతే సమాజాభివృద్ధికి బాటలు వేస్తారని పేర్కొన్నారు.

## మరోసారి పరమత సహనాన్ని చాటుకున్న ఎమ్మెల్యే జిఎంఆర్



- రూ.25 లక్షల సొంత నిధులతో చోటి మసీదు భవన నిర్మాణానికి అండ

**పటాన్చెరు, ఆగస్టు 07(నినాదం):** పరమత సహనం, సామరస్యానికి ప్రతీకగా నిలుస్తూ పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి (జిఎంఆర్) మరోసారి తన గొప్ప మనసును చాటుకున్నారు. పటాన్చెరు డివిజన్ పరిధిలోని ఎంజి రోడ్డు లో గల చోటి మసీదు ప్రార్థన స్థలానికి చెందిన స్థలంలో 25 లక్షల రూపాయల సొంత నిధులతో భవనాన్ని నిర్మించి మసీదు నిర్వాహకులకు అందించారు.. ఈ మేరకు శుక్రవారం మత పెద్దల సమక్షంలో భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చోటి మసీదు ఆర్థిక అవసరాలు తీర్చడంలో నూతన భవనం సహాయకారిగా ఉంటుందని తెలిపారు. ప్రపంచంలోని అన్ని మతాలు శాంతి, ప్రేమ, మానవత్వాన్నే బోధిస్తాయని అన్నారు. మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరి మనోభావాలను గౌరవించడం ప్రజాప్రతినిధిగా తన బాధ్యత అని పేర్కొన్నారు. పటాన్చెరు నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజలు సోదరభావంతో, పరస్పర గౌరవంతో జీవించే వాతావరణాన్ని మరింత బలోపేతం చేయడమే తన లక్ష్యమని తెలిపారు. నియోజకవర్గంలో పరమత సహనాన్ని పెంపొందించడంలో భాగంగా నేటి వరకు సొంత నిధులతో 200 లకు పైగా దేవాలయాలు, 100కు పైగా మసీదులు, 20 కి పైగా చర్చిలు నిర్మించడం జరిగిందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు ఎమ్మెల్యే జిఎంఆర్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఆయన చేపడుతున్న సేవా కార్యక్రమాలు ఆదర్శప్రాయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, ముస్లిం మత పెద్దలు లియాకత్ అలీ, మొయిజుర్ రెహ్మాన్, ఇక్బాల్, వెంకటేష్ పాల్గొన్నారు.

## రక్షణ నేత్రంతో.. భద్రత మరింత పటిష్టం

### జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఐపీఎస్



**వికారాబాద్, ఆగస్టు 7(నినాదం ):** ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణ, నేరాల నియంత్రణ, మహిళలు, చిన్నారుల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిర్వహణను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో వికారాబాద్ జిల్లా పోలీసులు ప్రతిష్ఠాత్మకమైన వికారాబాద్ రక్షణ నేత్రం కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఐ పి ఎస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే పరిగి, తాండూర్, చెంగోముల్, మర్పల్లి, మొమిన్‌పేట్, నవాబ్‌పేట్, కొడంగల్ మరియు ఇతర పోలీస్ స్టేషన్లలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయబడినట్లు చెప్పారు. అదేవిధంగా జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్‌లో కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లను ఏర్పాటు చేసి, వాటిని సీసీటీవీ నిఘా వ్యవస్థతో అనుసంధానం చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాదిలో తమ ఆదేశాల మేరకు నేను సైతం కార్యక్రమం ద్వారా 1,040 సీసీటీవీ కెమెరాలు, ప్రజల భాగస్వామ్యంతో 756 సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయగా, మొత్తం కొత్తగా ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల సంఖ్య 1,796కు చేరిందని ఆమె తెలిపారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ తమ పరిధిలో సీసీటీవీ కవరేజీ విస్తరణ కోసం స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకొని, వాటిని సమర్థవంతంగా అమలు చేసే విధంగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక (ప్లాన్ అఫ్ యాక్షన్ ) సిద్ధం చేయాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. అలాగే జిల్లాలో పనిచేస్తున్న దాదాపు అన్ని సీసీటీవీ కెమెరాలకు జియో ట్యాగింగ్ ప్రక్రియ పూర్తయిందని కూడా ఆమె తెలిపారు. నేరాల నియంత్రణను మరింత బలోపేతం చేయడానికి జిల్లాలోని ముఖ్యమైన కూడళ్లు, జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు మరియు ఇతర సున్నితమైన ప్రాంతాల్లో 20 ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ (ఏ ఎన్ పి ఆర్ ) కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు, అత్యాధునిక పీటీజెడ్ (పి టీ జడ్ పాన్–టిల్ట్–జూమ్) మరియు నైట్ విజన్ సీసీటీవీ కెమెరాలను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీసీటీవీ కెమెరాలు కేవలం నేరాల దర్యాప్తుకు మాత్రమే కాకుండా, నేరాల నివారణ, అనుమానాస్పద వ్యక్తులు మరియు వాహనాల గుర్తింపు, రోడ్డు ప్రమాదాలు, చోరీలు, మహిళలు మరియు చిన్నారులపై జరిగే నేరాల దర్యాప్తులో కీలకమైన ఆధారాలను అందించడం ద్వారా అత్యంత ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాయని ఎస్పీ వివరించారు. గ్రామాలు, పట్టణాలు, ప్రార్థనా మందిరాలు, వ్యాపార సంస్థలు, విద్యాసంస్థలు, బ్యాంకులు, పెట్రోల్ బంకులు, అపార్ట్‌మెంట్ సముదాయాలు మరియు ఇతర ముఖ్యమైన ప్రదేశాల్లో నాణ్యమైన సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు ఆమె విజ్ఞప్తి చేశారు. అలాగే “నేను సైతం” కార్యక్రమంలో ప్రజలు చురుకుగా పాల్గొని, మరింత సురక్షితమైన, భద్రమైన వికారాబాద్ జిల్లా నిర్మాణానికి తమ వంతు సహకారం అందించాలని ఆమె పిలుపునిచ్చారు. సీసీటీవీ కెమెరా అనేది కేవలం ఒక పరికరం మాత్రమే కాదు; అది ప్రజల భద్రత కోసం నిరంతరం పనిచేసే ఒక నిశ్శబ్ద పోలీసు అధికారి. ప్రజల సహకారంతో వికారాబాద్ జిల్లాను రాష్ట్రంలోనే అత్యంత సురక్షితమైన జిల్లాగా తీర్చిదిద్దడమే మా లక్ష్యమని ఆమె తెలిపారు.

## పీహెచ్‌సీల భవన నిర్మాణ పనులు శరవేగంగా పూర్తి చేయాలి

- మంత్రి దామోదర్ రాజనర్సింహ
- మంత్రి అధ్యక్షతన ఉన్నత స్థాయి సమీక్ష
- హెల్త్, ఎడ్యుకేషన్, ఇరిగేషన్, డ్రింకింగ్ వాటర్, అగ్రికల్చర్, రెవిన్యూ, ఉమెన్స్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ శాఖలలో జిల్లాలో చేపట్టిన కార్యక్రమాల అమలు పై చర్చ






**సంగారెడ్డి బ్యూరో , ఆగస్టు 7 (నినాదం):** సంగారెడ్డి జిల్లాలో వైద్య, ఆరోగ్య సేవల బలోపేతంపై మంత్రి దామోదర్ రాజనర్సింహ క్షేత్రస్థాయిలో చేపట్టిన చర్యలపై చర్చించారు. జోగిపేట ఏరియా ఆసుపత్రిలో డ్యూటీ డాక్టర్ స్థానంలో విధుల్లో మరొక నకిలీ డాక్టర్ విధులు నిర్వహిస్తున్న ఘటన పై రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహ డిసిహెచ్ఎస్, ఆస్పత్రి సూపరింటెండెంట్ లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కంకోల్ , సింగీతం పీహెచ్సిల ప్రారంభోత్సవంపై డీఎంహెచ్వో చర్చించారు. బర్దిపూర్ , సుల్తాన్ పూర్, నేరడిగుంట పీహెచ్సి ల భవన నిర్మాణ పనులను శరవేగంగా పూర్తి చేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. జిల్లా లో సీజనల్ వ్యాధుల నియంత్రణ, చేపట్టిన చర్యలు, డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా జిల్లాలో నమోదైన కేసులను అడిగి మంత్రి తెలుసు కున్నారు. మందులు, ఎక్విప్మెంట్స్, ఇన్ఫ్రాస్ట్రక్చర్, డ్రగ్స్ లను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి నర్సింగ్ కాలేజీ, పటాన్ చెరు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, జహీరాబాద్ ఎం సి హెచ్ లను త్వరలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి జి జి హెచ్ , మెడికల్ కాలేజీ లలో వైద్య సౌకర్యాలపై మంత్రి చర్చించారు. జి జి హెచ్ లో అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా సిఎంఎస్ కేంద్రాలను నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి ఆదేశించారు. విద్య శాఖలో చేపట్టిన కార్యక్ర మాలపై మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీక్షించారు. జిల్లాలో 1 లక్ష 30 వేల మంది విద్యార్థులు చదువు తున్నారని జిల్లా విద్య శాఖ అధికారి తెలిపారు. అన్ని ప్రభుత్వ స్కూల్స్‌లో మిడ్ డే మిల్స్ అందిస్తున్నామన్నారు. కంది, పటాన్ చెరు, సంగారెడ్డి మండలాల్లో బ్రేక్ ఫాస్ట్ ను విద్యార్థులకు అందిస్తున్నామని సమీక్షలో తెలిపారు. కేజీబీవీ, మోడల్ స్కూల్స్ పై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి ఆదేశించారు. స్కూల్ లలో డ్రింకింగ్ వాటర్, డ్రైనేజ్, మరుగు దొడ్ల ఏర్పాటు పై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి వెల్లడించారు. పీహెచ్సీ లు, అంగన్వాడి లు, స్కూల్స్, KGBV, మోడల్ స్కూల్స్ , జెడ్ పి హెచ్ ఎస్ లలో డ్రింకింగ్ వాటర్, డ్రైనేజ్, మరుగు దొడ్ల ఏర్పాటు పై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ను మంత్రి ఆదేశించారు. సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఎస్సీ ఎస్టీ బీసీ , మైనారిటీ సంక్షేమ హాస్టల్స్ పై మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీక్షించారు. సంక్షేమ హాస్టల్స్ పనితీరు మెరుగు పడాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. సంక్షేమ హాస్టల్‌ల భవనాల నిర్మాణ పనుల పురోగతిపై చర్చించారు. అద్దె భవనాలలో నడుస్తున్న ప్రభుత్వ సంక్షేమ హాస్టల్స్ వివరాలను అధికారులను మంత్రి అడిగి తెలుసుకున్నారు. రేషన్ కార్డుల జారీ పై మంత్రి దామోదర్ రాజనర్సింహ గారు ప్రధానంగా చర్చించారు. ఈ నెల 15 న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంగారెడ్డి జిల్లా పర్యటన నేపథ్యం లో కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం పై అధికారులు సిద్ధం కావాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ గారు ఆదేశించారు. జిల్లాలో తాగునీటి సరఫరా పై రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ గారు చర్చించారు. మంజీర, సింగూరు ప్రాజెక్టులో నీటి మట్టం పై మంత్రి ఆరాతీశారు. బోరంచ, భూచారెడ్డి పల్లి ఇంటెక్ వెల్ ల ద్వారా నీటి సరఫరాపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో త్రాగునీటి సరఫరా వాస్తవికత ను దృష్టిలో పెట్టుకొని రానున్న రోజుల్లో ఎదురయ్యే పరిస్థితులపై యాక్షన్ ప్లాన్ ను రూపొందించాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ సంబంధిత అధికారులను ఆదేశించారు. మెదక్ జిల్లాలో 876 గ్రామాలు, సంగారెడ్డి 852 గ్రామాలు, 9 మున్సిపాలిటీ లు జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గ వర్గాల పరిధిలోని 472 గ్రామాల లో మెరుగైన మంచి నీటి సరఫరా కు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

## వరి సాగుపై పూర్తిగా ఆధారపడొద్దు

- ప్రత్యామ్నాయ పంటలు, కూరగాయల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలి
- వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టాలి
- జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి



**రంగారెడ్డి బ్యూరో, ఆగస్ట్ 7 (నినాదం):** ఈ నెల 15వ తేదీ తర్వాత వర్షాలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు వరి సాగుపై పూర్తిగా ఆధారపడకుండా, ప్రత్యా మ్నాయ పంటల సాగు, కూరగాయల సాగు వైపు మొగ్గు చూపాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి, ఐఏఎస్ సూచించారు. ప్రస్తుత వాతావరణ అంచనాలు, నీటి లభ్యత, జలాశ యాల పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని రైతులు సాగు ప్రణాళిక రూపొందించు కోవాలని తెలిపారు. అధిక నీటి అవసరం ఉండే వరి పంటకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల కంది, పెసర, మినుము, జొన్న, సజ్జ, మొక్కజొన్న, నువ్వులు వంటి పంటలను స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఎంపిక చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు ప్రతి గ్రామంలో రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు అందించి, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపికపై అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. రైతులు కూడా వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టాలని సూచించారు. అనిశ్చిత వర్షపాతం నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా పంట నష్టాలను గణనీయంగా తగ్గించు కోవచ్చని, అందువల్ల వాతావరణ హెచ్చరికలు, వ్యవసాయ శాఖ సూచనలను నిరంతరం అనుసరిస్తూ నిర్ణయాలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రైతులకు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా సెప్టెంబర్ నెలలో కూడా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నందున రైతులు పంటల ఎంపికలో అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి, ఐఏఎస్ సూచించారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటి అవసరం ఉండే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయడంతో పాటు, వ్యవసాయ శాఖ అధికారుల సాంకేతిక సూచనలను పాటిస్తూ శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టాలని కోరారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ముందస్తు ప్రణాళికతో వ్యవసాయం చేయడం ద్వారా పంట నష్టాలను గణనీయంగా తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు.

## ఎల్లమ్మ, పోచమ్మ తల్లి దయ ఉంటే అన్నీ ఉన్నట్లే..

### బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే వివేకానంద్



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 7 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం 125 – గాజుల రామారం డివిజన్ శ్రీరామ్ నగర్ “బి” కాలనీలోని శ్రీ ఎల్లమ్మ, పోచమ్మ దేవాలయంలో బోనాల పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల సందర్భంగా నిర్వహించిన ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవానికి బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్లేనని, అమ్మవారి దయతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఆంజనేయులు యాదవ్, నర్సింగ్ రావు, తిరుపతి యాదవ్, అమర్నాథ్, శ్రీనివాస్, మల్లేష్, మహేందర్, ప్రసాద్, శంకర్, పాక్స్ డైరెక్టర్ పరుశ శ్రీనివాస్ యాదవ్, దూలప్ప, సింగారం మల్లేష్, శేఖర్, శివ నాయక్, జునైద్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ హైమావతి





**సిద్ధిపేట బ్యూరో, ఆగస్టు ,07 ( నినాదం):** జిల్లాలో స్వతంత్ర దినోత్సవ వేడుకలను వైభవంగా సృజనాత్మకతతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ హైమావతి అధికారులను ఆదేశించారుశుక్రవారం రోజున కలెక్టరేట్లో జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి 15 ఆగస్టు స్వాతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణ పై తగు ఆదేశాలు జారీ చేశారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో నిర్వహించడం జరుగుతుందని ఈ వేడుకలను సాంప్రదాయబద్ధంగా ఇన్నోవేటివ్‌గా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమానికి వచ్చే అతిధులు, విద్యార్థులు, ప్రజలు, మీడియా వారు అందరూ సౌకర్యవంతంగా కూర్చునేలా సీటింగ్ ఏర్పాటు చేయాలని, త్రాగునీరు సౌకర్యం కల్పించాలని అన్నారు. ప్రోటోకాల్ ప్రకారం ముందస్తుగా ఇన్విటేషన్స్ పంపించాలని తెలిపారు. ప్రోటోకాల్ ప్రకారం పోలీస్ పెరేడ్ నిర్వహణ, ముఖ్య అతిథి ప్రసంగం, ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలపై వివిధ శాఖల ద్వారా శకటాల ప్రదర్శన, స్టాళ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. దేశభక్తి మరియు సాంప్రదాయక పాటలపై విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. మున్సిపాలిటీ మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని, నిరంతరాయ విద్యుత్ సరఫరా చేయాలని, ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో విద్యార్థులు, ప్రజలు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అన్ని శాఖల జిల్లా అధికారులు, వారి కార్యాలయం సిబ్బంది ఈ కార్యక్రమంలో తప్పక పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవిన్యూ లక్ష్మీ కిరణ్, అదనపు డిసిపి సుభాష్ చంద్రబోస్, డిఆర్ఓ నాగరాజమ్మ, ఆర్డీవోలు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నారాయణ పాఠశాలలో బోనాల వేడుకలు



**అల్వాల్, ఆగస్టు 7 (నినాదం):** బొల్లారం నారాయణ పాఠశాలలో బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పాడి పంటలు బాగా పండాలని, ఉపాధ్యాయులు. విద్యార్థులు. బోనాల వేడుకలు పాల్గొన్నారు. ఉపాధ్యాయులు పలువురు విద్యార్థులు పోతరాజుల ప్రత్యేక వేషధారాలతో ఆకట్టుకున్నారు,నృత్యాలు చేస్తూ,పాటలు పాడుతూ శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలోకి చేరుకొని పూజలు,బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎ.జి.ఎం పురుషోత్తం రెడ్డి, ప్రిన్సిపాల్ డా జాస్మిన్ మాథ్యూస్, కో ఆర్డినేటర్ దీప్తి, వైస్ ప్రిన్సిపాల్ శ్రావణి, విద్యార్థులు పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియపై సమీక్ష



**అల్వాల్, ఆగస్టు 7 (నినాదం):** అల్వాల్ మండల కేంద్రంలో శుక్రవారం పంచశీల కమ్యూనిటీ హాల్లో బి ఎల్ ఎ ,బి ఎల్ ఓ, లతో మండల తాసిల్దార్ రాములు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్ ప్రక్రియ అమలు. ఓటర్ జాబితా సవరణ. ఇంటింటి సర్వే తదితర అంశాలపై అల్వాల్ మండల ఎమ్మార్వో రాములు సమీక్షించారు. సర్ ప్రక్రియ నిబంధనల ప్రకారం సమర్థ వంతంగా పూర్తి చేయాలని సూచించారు.

## మౌలిక వసతుల కల్పనతో కొంపల్లి అభివృద్ధికి కృషి

- బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్





**కుత్బుల్లాపూర్, ఆగస్టు 7 (నినాదం):** సీఎంసీ కొంపల్లి సర్కిల్ పరిధి ఉమామహేశ్వర కాలనీలో బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదలు అధికంగా నివసించే ఈ ఉమామహేశ్వర కాలనీలో గత 12 ఏళ్ల కాలంలో ప్రజల జీవన ప్రమాణాల పెంపుకై అనేక అభివృద్ధి పనులు చేపట్టాం. మౌలిక వసతుల కల్పనలో భాగంగా భూగర్భ డ్రైనేజీ నిర్మాణంతోపాటు సీసీ రోడ్డు నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రానున్న రోజుల్లో కూడా ఉమామహేశ్వర కాలనీలో అన్ని మౌలిక వసతులతో కాలనీని మరింత అభివృద్ధి చేసేందుకు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. అంతకముందు బోనాల పండుగను పురస్కరించుకొని ఉమామహేశ్వర కాలనీలోని నల్ల పోచమ్మ దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి సర్కిల్ ఉప కమిషనర్ లావణ్య, డిఈలు సామ్రాట్, తిరుపతి, మాజీ మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, మాజీ ఎంపీపీ సన్న కవిత శ్రీశైలం యాదవ్, పార్టీ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ వినోద్, మహిళా అధ్యక్షురాలు సంగీతారెడ్డి, డివిజన్ ప్రెసిడెంట్ షేక్ రియాజుద్దీన్, నాయకులు షన్ను, కాలనీ జనరల్ సెక్రెటరీ రాధా, కాలనీవాసులు వెంకటయ్య, రాజిరెడ్డి వెంకటరాజు, మహేష్, చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉపాధి శిక్షణ టీజీ శాఖ కోర్సుల్లో అడ్మిషన్లు ప్రారంభం



**వికారాబాద్, ఆగస్టు 7(నినాదం ):** 2006,07 విద్యాసంవత్సరానికి గాను తెలంగాణ ఉపాధి మరియు శిక్షణ టీ జీ శాఖలో ఆయా కోర్సుల్లో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు వికారాబాద్ ప్రిన్సిపాల్ ఆర్ నరేంద్రబాబు తెలిపారు. ఆగష్టు 2026 సెషన్ కొరకు ఏటీసీ లు, ప్రభుత్వ ఐటి ఐ లు, ఆర్ ఐ టీ ఐ ఎస్, మైనారిటీ ఐ టీ ఐ ఎస్, మరియు ప్రైవేట్ ఐటి ఐ లలో ప్రవేశాలకోసం ఆగష్టు 2026 సెషన్ కొరకు రాష్ట్రంలోని ప్రభుత్వ ఐటి ఐ లు ఏ టీ సీలు మరియు ప్రైవేట్ ఐటి ఐ లలో ఎన్ సీ వి టీ పద్ధతిలో ప్రవేశాల కోసం అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు. వెబ్ సైట్ చిరునామా https://iti.telangana.gov.in అర్హత:- 10వ తరగతి, 8వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్హతలు గల వ్యక్తులు ఐటిఐలలో ప్రవేశం పొందవచ్చు. అవసరమైన కనీస అర్హత ఆయా ట్రేడ్ సిలబస్‌లో, అలాగే వెబ్‌సైట్‌లో ఇవ్వబడిన క్రాఫ్ట్స్‌మెన్ ట్రైనింగ్ స్కీమ్ సీ టీ ఎస్, ఏ టీ సీ ఎస్ క్రింద ఉన్న ట్రేడ్‌ల జాబితాలో సూచించబడిందని తెలిపారు. మొదటి దశలో ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు రెండవ దశలో మళ్లీ దరఖాస్తు చేయనవసరం లేదని అన్నారు. అయితే వారు ఇంతకు ముందు చేయని పక్షంలో వారి అసలు సర్టిఫికెట్లను ధృవీకరించు కోవాలన్నారు. అంతే కాకుండా, వారు తమ సంబంధిత లాగిన్‌ల ద్వారా ఆన్‌లైన్‌లో ఆప్షన్‌లను కూడా సమర్పించాలని చెప్పారు. ఆసక్తిగల అభ్యర్థులు వెబ్‌సైట్‌లో తమను తాము నమోదు చేసుకుని, ఐటీఐలు మరియు ట్రేడ్‌ల ప్రాధాన్యతా క్రమంలో వెబ్ ఆప్షన్‌లతో పాటు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించాలి. ఇందుకోసం ఆన్‌లైన్ దరఖాస్తులో అందించిన పేమెంట్ గేట్‌వే లింక్ ద్వారా రూ. 100 దరఖాస్తు ధృవీకరణ రుసుము చెల్లించాలి. అప్‌లోడ్ చేసిన, సర్టిఫికెట్ల ఆధారంగా దరఖాస్తు ధృవీకరణ ఆన్‌లైన్‌లో జరుగుతుంది. ప్రాస్పెక్టస్, సీట్ల లభ్యత, నోటిఫికేషన్‌లు మరియు ఎప్పటికప్పుడు జారీ చేయబడిన మార్గదర్శకాల వివరాల కోసం దయచేసి వెబ్‌సైట్‌ను సందర్శించండి. ఆన్‌లైన్‌లో ధృవీకరించబడి, ఆమోదించబడిన దరఖాస్తులు గల అభ్యర్థులకు సీట్లు కేటాయించ బడతాయి. ఇంతకుముందు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు, దరఖాస్తు ధృవీకరణ రుసుము చెల్లించ కుండానే ఆప్షన్‌లను సమర్పించవచ్చు మరియు స్లైడింగ్‌కు కూడా అర్హులు. అన్ని ఒరిజినల్ సర్టిఫికేట్‌లను స్కాన్ చేసి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. తెలంగాణ రాష్ట్రంలోని ఏవైనా ప్రభుత్వ ఐటీఐలు, ఏటీసీలు మరియు ప్రైవేట్ ఐటీఐలలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఒకే ఆన్‌లైన్ దరఖాస్తు సరిపోతుంది. సీటు పొందడానికి అభ్యర్థులు ఎక్కువ ఆప్షన్లు ఇవ్వాలని సూచించడమైనది. భౌతిక దరఖాస్తు ఫారమ్‌లు స్వీకరించబడవు. దరఖాస్తు చేసే ముందు, ఆధార్ కార్డులోని పేర్లు మరియు పుట్టిన తేదీ ఎస్ఎస్సి మెమో ప్రకారం ఉన్నాయో లేదో నిర్ధారించుకోవాలి. ఒకవేళ సీటు కేటాయించబడితే, ఐ.టి.ఐ కోర్సు పూర్తయ్యే వరకు దరఖాస్తులో అందించిన మొబైల్ నంబర్‌ను మార్చకూడదు. మొబైల్ నంబర్‌లో ఏ మార్పు చేసినా, ప్రవేశ ప్రక్రియలో ఏ సమయంలోనైనా అడ్మిషన్ రద్దు చేయబడవచ్చు. బోనఫైడ్, స్టడీ, నేటివిటీ/లోకల్, దివ్యాంగ్ మరియు కమ్యూనిటీ,కాస్ట్, బీ వో సీ డబ్ల్యూ, సర్టిఫికెట్లు తెలంగాణ ప్రభుత్వం జారీ చేసి ఉండాలి, లేనిచో అభ్యర్థులు నాన్ లోకల్‌గా పరిగణించబడతారు, బీ వో సీ డబ్ల్యూ సర్టిఫికెట్లు ద్వారా జారీ చేయబడాల్సిగా ఉండాలి. ఆన్‌లైన్ దరఖాస్తులు మరియు వెబ్ ఎంపికల సమర్పణలు అన్ని ధృవీకరణ కేంద్రాలలో అసలు ధృవపత్రాల ధృవీకరణ (శారీరకంగా వికలాంగులైన అభ్యర్థులతో సహా) 06-08-2026 నుండి 15-08-2026 వరకు ఉందని వికారాబాద్ ఐటీఐ ప్రిన్సిపాల్ తెలిపారు.

## అక్రమ కట్టడాలపై కఠిన చర్యలు తప్పవు

### ఉప కమిషనర్ వెంకటేశ్వర్లు



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 7 (నినాదం) :** సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్, కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ ఆదేశాల మేరకు గాజులరామారం సర్కిల్ గాజులరామారం చౌరస్తా నుండి మహాదేవపురం వరకు ఉన్న రహదారి ఆక్రమణలను శుక్రవారం అధికారులు తొలగించారు. సర్కిల్ పరిధిలో అక్రమ కట్టడాలు కట్టినచో అట్టి అక్రమ కట్టడాలుపై కఠిన చర్యలు తీసుకోబడునని గాజులరామారం ఉప కమిషనర్ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఆర్. సుమిత్ర, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ బి. సరిత సేన్ తమ సిబ్బందితో కలిసి పాల్గొని పర్యవేక్షించారు.

# వాడి వేడిగా మండల సర్వసభ్య సమావేశం

**సమస్యలపై అధికారులను నిలదీసిన సర్పంచ్‌లు .. రైతుల సమస్యలు పరిష్కరించాలి.. ఎమ్మెల్యే**



**జమ్మికుంట, ఆగస్టు 7 (నినాదం)** జమ్మికుంట పట్ట ణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశం వాడి వేడిగా జరిగింది. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశానికి హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన పలువురు సర్పంచులు వ్యవసాయ అధికారులు రుణమాఫీ విషయం గురించి చదువుతుం డగా అందరికీ రుణమాఫీ కాలేదని ప్రశ్నించారు. ప్రభుత్వం డి ఎ పి కి యూరియా కి లింకు పెట్టవద్దని దీనివల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని అదేవి ధంగా యూరియా యాప్ ను ఎత్తివేయాలని డిమాండ్ చేయడంతో పాటు ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆధ్వ ర్యంలో సభ్యులందరూ దీన్ని తీర్మానం చేయాలని కోరారు. అదేవిధంగా తనుగుల గుంపుల గ్రామాల మధ్య ఉన్న చెక్ డాం కూలిపోయినప్పటికీ ఇప్పటికీ దానిని పూర్తి చేయకపోవడం వల్ల ఇబ్బందులు కలుగుతున్నాయని వెంటనే దానిని నిర్మించే విధంగా చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ ఏఈ అఖిలను ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కోరారు. దీంతో పాటు వీణవంక మండలంలోని కల్వల ప్రాజెక్ట్ నిర్మాణం కూడా వేగవంతంగా చేపట్టాలని దాని ద్వారా జమ్మికుంట మండలంలోని దాదాపు 7 వేల నుంచి 8 వేల ఎకరాల రైతులకు సంబంధించిన భూమి నీటి ఎద్దడి లేకుండా ఉండే ఆస్కారం ఉంటుందని పేర్కొన్నారు. జమ్మికుం ట మండలం తనువుల గ్రామంలోని అంకుశాపాలి చెరువు కట్టను మరమ్మత్తు చేయాలని సర్పంచ్ జక్కకిరణ్ గౌడ్ అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లారు. జమ్మి కుంట మండలంలో ఉన్న ఇరిగేషన్ కు సంబంధించిన సమస్యలపై పూర్తిస్థాయిలో నివేదికలు తయారుచేసి ఉన్నత అధికారులకు అందజేస్తామని ఏ ఈ అఖిల పేర్కొన్నారు. అదేవిధంగా తనుగుల ప్రభుత్వ పాఠశా లలో విద్యార్థులు లేక తరగతి గదులు వృధాగా ఉంటు న్నాయని బడిబాట కార్యక్రమం చేపట్టినప్పటికీ విద్యా ర్థుల సంఖ్య పెరగపోవడానికి కారణం ఏమిటని సర్పం చ్ కిరణ్ గౌడ్ మండల విద్యాధికారి హేమలతను ప్రశ్నించారు. ఉద్యానవనశాఖ అధికారుల వైఫల్యం మండలంలో కొట్టొచ్చినట్టు కనబడుతుందని సర్పంచులు పార్లపల్లి విజయ్ కందికట్ల మధుసూదన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పామాయిల్ సాగులో అధికా రులు పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. తెలం గాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠ శాలల అభివృద్ధి కోసం చేస్తున్న సంక్షేమ పథకాలను ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షిస్తూ ఉండాలని వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పుల్లూరి స్వప్న కోరారు.

**రైతు సమస్యలను పరిష్కరించాలి.. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి**

సర్వసభ్య సమావేశం అనంతరం ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల సమస్యల పైన సర్పంచులు మాట్లాడడం జరిగిందని వాటి సమస్య పరిష్కారం కోసం అధికారులు తప్ప కుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతుల సమస్యలు పరిష్కారంలో అధికారులు అలసత్వం ప్రదర్శించకూడదని సకాలంలో రైతులకు ఎరువులు అందించాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో గడ్డం సుధాకర్ ఎంపీడీవో పద్మావతి ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగళి రమేష్ వివిధ గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# రూ.2 కోట్లకు పైగా అభివృద్ధి పనులకు శ్రీకారం

**మార్కెట్ యార్డుల ఆధునికీకరణ, ఆయిల్ పామ్ సాగు విస్తరణతో రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యం. మంత్రి పొన్నం ప్రభాకర్**



**కరీంనగర్, ఆగస్టు 7(నినాదం):** హుస్నాబాద్ నియోజకవర్గాన్ని వ్యవసాయం, గ్రామీణ మౌలిక సదుపాయాలు, మహిళా సాధికారత, పశుసంవర్ధక రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం సైదాపూర్, చిగురుమామిడి మండలాల్లో రూ. 2 కోట్లకు పైగా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపనలు చేసి, వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, మార్కెట్ కమిటీ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. సైదాపూర్ మండలంలోని వెంకటేశ్వరపల్లిలో రూ. 1.56 కోట్లతో వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిపాలన భవనం, ఓపెన్ షెడ్, ఆర్చి, బోర్‌వెల్, విద్యుద్దీపాల ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. అలాగే వెంకపల్లి మార్కెట్ యార్డులో రూ. 30 లక్షలతో 100 మెట్రిక్ టన్నుల గోదాం, నూతన మార్కెట్ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. చిగురుమామిడి మండలంలోని బొమ్మనపల్లిలో రూ. 30 లక్షలతో పశువైద్య ఉపకేంద్రం, రూ. 16 లక్షలతో మహిళా సంఘ భవన నిర్మాణానికి, మండల కేంద్రంలో రూ. 20 లక్షలతో ప్రాథమిక పశువైద్య కేంద్రానికి అదనపు గదులు, మరమ్మతు పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సైదాపూర్ మార్కెట్ యార్డు అభివృద్ధి ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉందని, రైతులకు మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించేందుకు ఆధునికీకరణ చేపడుతున్నామని తెలిపారు. ఐదు ఎకరాల స్థలం అందుబాటులో ఉంటే ఏ గ్రామంలోనైనా ఉప మార్కెట్ యార్డు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. రైతులు ఆరుతడి పంటలతో పాటు ఆయిల్ పామ్ సాగును విస్తృతంగా చేపట్టాలని సూచించిన మంత్రి, వర్షపు నీటి సంరక్షణ కోసం ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలు, వ్యవసాయ భూముల్లో ఇంజెక్షన్ బోర్లు ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. జలసిరి కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, ప్రతి పౌరుడు కనీసం ఒక మొక్క నాటాలని కోరారు. మహిళల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, మహిళా సంఘాలకు ఉపాధి అవకాశాల కల్పనతో పాటు ప్రతి గ్రామంలో మహిళా సమాఖ్య భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో రహదారులు, వంతెనలు, సాగునీటి ప్రాజెక్టులు సహా మౌలిక వసతుల అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేస్తామని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, సైదాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంత సుధాకర్, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి, ఆర్డీవోలు షర్మిల, జల కుమారి, ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, అధికారులు, రైతులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది..

**హుజరాబాద్ మునిసిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని**




**జమ్మికుంట, ఆగస్టు 7 (నినాదం):** చేనేత వృత్తి మన భారతీయ సంస్కృతికి, విశిష్ట సాంప్రదాయానికి ప్రతీక అని, చేనేత కార్మికుల సంక్షేమానికి, వారి ఆర్థిక అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని హుజూరాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ రొంటాల సుహాసిని పేర్కొన్నారు. శుక్రవారం హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా చేనేత సెల్ అధ్యక్షులు బండారి సదానందం అధ్యక్షతన 'అంతర్జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు' ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మున్సి పల్ చైర్ పర్సన్ రొంటాల సుహాసిని చేనేత కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సమాజానికి చేనేత కార్మికులు అందిస్తున్న సేవలను కొనియాడుతూ వారిని శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ... నేతన్నల శ్రమను, వారి నైపుణ్యాన్ని గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. ప్రభుత్వ పరంగా, పార్టీ పరంగా చేనేత వర్గాలకు ఎల్లప్పుడూ తగిన గుర్తింపు, తోడ్పాటు ఉంటాయని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, పట్టణ, గ్రామ శాఖల అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్, ఎన్ ఎస్ యూ ఐ వివిధ అనుబంధ సంఘాల నాయకులు, మహిళా నాయకురాళ్ళు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, పెద్ద సంఖ్యలో చేనేత కార్మికులు పాల్గొన్నారు.

## తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర సామాజిక మాధ్యమాల చైర్మన్‌గా పెట్టేం నవీన్ నియామకం

**పార్టీ బలోపేతంతో పాటు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేస్తానని నవీన్ వెల్లడి**



**కరీంనగర్, ఆగస్టు 7(నినాదం ):** కరీంనగర్‌కు చెందిన పెట్టేం నవీన్‌ను తెలంగాణ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సామాజిక మాధ్యమాల (సోషల్ మీడియా) చైర్మన్‌గా నియమించారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎంపీ కేసీ వేణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో రాష్ట్ర సామాజిక మాధ్యమాల సమన్వయకర్తగా పనిచేసిన పెట్టేం నవీన్, పార్టీ కార్యకలాపాల విస్తరణకు, కార్యకర్తల సమన్వయానికి సామాజిక మాధ్యమాలను సమర్థవంతంగా వినియోగిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేశారు. ఈ సందర్భంగా పెట్టేం నవీన్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి కీలక బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు, మంత్రి పొన్నం ప్రభాకర్, స్థానిక ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయడంతో పాటు, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు మరింత విస్తృతంగా చేరవేస్తానని ఆయన పేర్కొన్నారు.

## ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని నల్ల బ్యాడ్జీలతో నిరసన




**జమ్మికుంట, ఆగస్టు 7 (నినాదం)** పెండింగ్ లో ఉన్న పీఆర్సీ, ఆరు డీఏల తోపాటు అనేక విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ శుక్రవారం ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి ఆధ్వర్యంలో జమ్మికుంట లోని ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జి లు ధరించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా డీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆవాల నరహరి , టీపిటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మర్రి అవినాష్ లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించిఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని లేకపోతే ఉద్యమం మరింత తీవ్రతరం చేస్తామని ఆగస్టు 12, 13 తేదీలలో మండల కేంద్రాలలో , ఆగస్టు 19 వ తారీఖున జిల్లా కేంద్రంలో , ఆగస్టు 29 న ఇందిరా పార్కులో ధర్నా చేస్తామని తెలిపారు. అప్పటికి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రయత్నించకపోతే అసెంబ్లీని సైతం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో మండలంలోని అందరూ ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నార

# శభాష్.... మున్సిపల్ చైర్మన్

**సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి**

**రాత్రి సమయంలో రోడ్లపై గుంతల పూడ్చి వేత.. అభినందిస్తున్న పట్టణ ప్రజలు**

**జమ్మికుంట, ఆగస్టు 7 (నినాదం) :** జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ పట్టణ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం తన కార్యక్రమాలను నిర్వహిస్తూ పట్టణ అభివృద్ధిలో పగలు రాత్రి తేడా లేకుండా ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నారు. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని పలు రహదారుల్లో గుంతలు ఏర్పడి వాహనదారులకు ఇబ్బందిగా మారడంతో ఈ విషయాన్ని పట్టణ ప్రజలు చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లడం తో సమయం కూడా చూడకుండా రాత్రి పూట తన సిబ్బందితో



కలిసి రోడ్లపై ఉన్న గుంతలను కూల్చివేసి పట్టణ ప్రజల మన్ననలను పొందారు. ఈ సందర్భంగా చైర్మన్ ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ, ప్రజలు తమకు సేవలు అందిస్తారని నమ్మి నన్ను గెలిపించారని వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా తన పరిధిలో ఉన్న అన్ని సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానని తెలిపారు. పట్టణ అభివృద్ధి తన లక్ష్యమని ప్రజా సంక్షేమం కోసం ఎంత దూరమైనా వెళ్తానని రాజకీయాలకు అతీతంగా తాను సేవలు అందిస్తానని పేర్కొన్నారు. రాష్ట్రంలోనే జమ్మికుంట మున్సిపాలిటీ అన్ని విభాగాల్లో మొదటి స్థానంలో నిలపడమే మా పాలకవర్గ లక్ష్యమని దానికి పట్టణ ప్రజల సహకరించి మున్సిపల్ సిబ్బందికి అండగా నిలవాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సానిటరీ ఇన్స్పెక్టర్ ఇల్లందుల రమేష్ మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వపై పోలీసుల దాడి

**30 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం: దుబ్బపల్లిలో నిందితుడి అరెస్ట్.,సివిల్ సరఫరాల శాఖకు బియ్యం అప్పగింత, ప్రజలకు హెచ్చరిక**

**కరీంనగర్, (నినాదం):** రూరల్ మండలంలోని దుబ్బపల్లి గ్రామంలో ఉచిత ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసిన వ్యక్తిని కరీంనగర్ రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి సుమారు 30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నా రు. విశ్వసనీయ సమాచారం మేరకు రూరల్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఏ. నిరంజన్ రెడ్డి తన సిబ్బందితో కలిసి దుబ్బపల్లిలో తనిఖీలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన శిరిగిరి సాగర్ (27) ఇంటిలో 37 సంచుల్లో నిల్వ ఉంచిన సుమారు 30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించి, పంచాయతీదారుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు చేరుకోగానే నిందితుడు పరారయ్యేందుకు



ప్రయత్నించగా అదుపులోకి తీసుకున్నారు . విచారణలో నిందితుడు పేద ప్రజల నుంచి తక్కువ ధరకు పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి, ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న ఇతర రాష్ట్రాల కార్మికులు, కోళ్ల ఫారాలకు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలి పారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని తదుపరి చర్యల కోసం పౌర సరఫరాల శాఖ అధికారులకు అప్పగించనున్నారు. ఈ సందర్భంగా పోలీసులు ప్రజలకు హెచ్చరిక జారీ చేశారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని దలారులకు విక్రయించవద్దని సూచించారు. అక్రమంగా బియ్యాన్ని కొనుగోలు చేయడం, నిల్వ చేయడం లేదా విక్రయించడం వంటి చర్యలకు పాల్పడిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

# పారమిత వరల్డ్ స్కూల్‌లో ఘనంగా హౌస్ ప్రారంభోత్సవం

**హౌస్ విధానంతో విద్యార్థుల్లో నాయకత్వం, క్రమశిక్షణ, జట్టుగా పనిచేసే నైపుణ్యం పెంపొందుతుంది, డైరెక్టర్ ఈ. ప్రసూన**

**కరీంనగర్, ఆగస్టు 7(నినాదం):** స్థానిక అల్గునూర్‌లోని పారమిత వరల్డ్ స్కూల్‌లో హౌస్ ప్రారంభోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ ఈ. ప్రసూన దీపప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు హౌస్‌ల వారీగా పతాకావిష్కరణ, క్రీడా ప్రమాణ స్వీకారం, ఆకట్టుకునే మార్చ్‌పాస్ట్‌తో వేడుకలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులను గగన్, పృథ్వి, అగ్ని, సూర్య హౌస్‌లుగా విభజించి వాటిని డైరెక్టర్ ప్రారంభించారు. అనంతరం ఆయా హౌస్‌ల విద్యార్థులు దేశభక్తి, ప్రకృతి పరిరక్షణ, శక్తి, విజ్ఞానాభివృద్ధి వంటి అంశాలపై సందేశాత్మక నృత్య ప్రదర్శనలు చేసి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. డైరెక్టర్ ఈ. ప్రసూన మాట్లాడుతూ, హౌస్



విధానం ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, జట్టుగా పనిచేసే సామర్థ్యం, సేవాభావం, క్రీడాస్ఫూర్తి పెంపొందుతాయని తెలిపారు. గత మూడు దశాబ్దాలుగా పారమిత విద్యాసంస్థల్లో ఈ విధానాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నామని, ప్రతి విద్యార్థి విద్య, క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని తన హౌస్‌కు గౌరవం తీసుకురావాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం. శ్రీకర్ మాట్లాడుతూ, హెడ్ బాయ్, హెడ్ గర్ల్‌తో పాటు ప్రతి హౌస్‌కు కెప్టెన్, ఉప కెప్టెన్, అసెంబ్లీ, సహపాఠ్య కార్యక్రమాలు, క్రీడల కెప్టెన్‌లను ఎన్నికల ద్వారా ఎంపిక చేసినట్లు తెలిపారు. వారి నాయకత్వంలో విద్యార్థులు ఏడాది పొడవునా వివిధ పోటీల్లో పాల్గొని ప్రతిభను చాటుకుంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు వి. యు. యం. ప్రసాద్, వినోద్ రావు, సమన్వయకర్త దీప్తి రాణి, హౌస్ కన్వీనర్ కె. శ్రీనివాస్, శారీరక విద్య ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కమలాపూర్‌లో సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన

**సహకార సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యం : నాప్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు**

**జమ్మికుంట, ఆగస్టు 7 (నినాదం)** కమలాపూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణ పనులకు శుక్రవారం నాప్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్రావు స్థానిక ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగళి రమేష్ తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాథమిక సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా సోలార్ పవర్ ప్లాంట్ల నిర్మాణాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే సహకార సంఘాల



ద్వారా ఎంతో మంది రైతులకు సకాలంలో రుణాలు అందిస్తూ వారికి చేయూత నిస్తున్నామని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. సోలార్ ప్లాంట్ లు ఏర్పాటు చేయడం వల్ల సహకార సంఘాలకు ఆర్థిక లబ్ధి చేకూరుతుందని అలాగే విద్యుత్తు ఖర్చు తగ్గించడం ద్వారా సంఘాలకు ఆర్థిక లబ్ధి చేకూరుతుందని తెలిపారు. అంతేకాకుండా పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహించడం వల్ల విద్యుత్ వ్యయం తగ్గుతుందని తద్వారా పర్యావరణ పరిరక్షణ ఉంటుందని సహకార సంఘాలకు దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూరుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక సహకార సంఘం కమలాపూర్ పాలకవర్గం సీఈవో డైరెక్టర్లు రైతులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం

**చేనేత కార్మికుల కళానైపుణ్యానికి దేశవ్యాప్త గుర్తింపు తీసుకొచ్చిన కేంద్ర ప్రభుత్వ కృషి అభినందనీయం.**

**సాయిని మల్లేశం,మేయర్ కొలగాని శ్రీనివాస్**

**కరీంనగర్, ఆగస్టు 7(నినాదం):** భారతీయ జనతా పార్టీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కరీంనగర్ 39వ డివిజన్‌లోని చేనేత సహకార సంఘం కార్యాలయం వద్ద జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్య క్షుడు సాయిని మల్లేశం, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు చేనేత మగ్గంపై నేయడం ద్వారా దాని పనితీరును పరిశీలించి, చేనేత కార్మికుల కళానైపుణ్యాన్ని అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేనేత ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు, మార్కెటింగ్ అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక కృషి చేశారని తెలిపారు. ఆ క్రమంలోనే 2015 నుంచి ఆగస్టు 7ను జాతీయ చేనేత దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు గుర్తు చేశారు. స్వాతంత్ర్య ఉద్యమంలో విదేశీ వస్త్ర బహిష్కరణ, స్వదేశీ ఉద్యమ విజయానికి చేనేత కార్మికుల సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఈ సందర్భంగా చేనేత సహకార సంఘం అధ్యక్షుడు, డైరెక్టర్లు, సభ్యులను సన్మానించి, చేనేత కార్మికుల సంక్షేమానికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు



వాసాల రమేష్, వేముల చంద్రశేఖర్, తెల్ల రమేష్, చొప్పరి జయశ్రీ, మాసం గణేష్, సరస్వతి సత్యం, గుంజెటి మెతుకు సత్యం, శివన్న, అడిచర్ల రాజు, సతీష్, మునిందర్‌తో పాటు చేనేత సంఘం సభ్యులు, డైరెక్టర్లు బోగా భద్రయ్య, చంద్రయ్య, గుర్రం ఆంజనేయులు, శ్రీపతి వెంకటేశం, తుమ్మ రామస్వామి, ఆరకాల కనకయ్య, మహిళలు, స్థానికులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## అల్ఫోర్స్‌లో ఘనంగా 'వర్షాకాల వినోదోత్సవం'

**వినోదాత్మక విద్యతో విద్యార్థుల్లో ఉత్సాహం సృజనాత్మకత పెంపొందుతుంది**

**అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి**




**కరీంనగర్, ఆగస్టు 7(నినాదం):** స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ జెన్ నెక్స్ట్ పాఠశాల (ఎస్–6 ప్రాంగణం)లో "వర్షాకాల వినోదోత్సవం"ను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వినోదాత్మక పద్ధతిలో బోధన అందిస్తే విద్యార్థులు పాఠ్యాంశాలను సులభంగా అర్థం చేసుకుని ఎక్కువకాలం గుర్తుంచుకోవడంతో పాటు పోటీ పరీక్షల్లోనూ మెరుగైన ఫలితాలు సాధిస్తారని అన్నారు. విద్యార్థుల్లో నేర్చుకోవాలనే ఆసక్తి, ఆనందం, సృజనాత్మకత, స్నేహభావం పెంపొందించడం విద్యాసంస్థల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. ప్రకృతి ఒడిలో వర్షపు చినుకుల మధ్య పాటలు, నృత్యాలు, ఆటలు, సృజనాత్మక కార్యక్రమాలతో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. విద్యతో పాటు వినోదానికి కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలనే సందేశాన్ని ఈ కార్యక్రమం ప్రతిబింబించిందన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణాన్ని ఆకర్షణీయంగా అలంకరించగా, విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజా ఉద్యమాలకు విమలక్క సేవలు స్ఫూర్తిదాయకం

**కరీంనగర్‌లో జన్మదిన వేడుకలు.. అనాథ వృద్ధులకు అన్నప్రసాదం పంపిణీ**



**కరీంనగర్, ఆగస్టు 7(నినాదం):** అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఉమ్మడి రాష్ట్రాల గౌరవ అధ్యక్షురాలు, తెలంగాణ యునైటెడ్ ఫ్రంట్ (టఫ్) చైర్‌పర్సన్, తెలంగాణ ఉద్యమ గాయని విమలక్క జన్మదిన వేడుకలను తెలంగాణ యునైటెడ్ ఫ్రంట్ కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కరీంనగర్ నగరంలోని వీబీ ఫౌండేషన్ నిర్వహిస్తున్న అనాథ వృద్ధుల ఆశ్రమంలో టఫ్ జిల్లా మాజీ అధ్యక్షుడు బొల్లం లింగమూర్తి, మాజీ కార్యదర్శి బిజిగిరి నవీన్ కుమార్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, వృద్ధులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమ సమయంలో విమలక్క తన ఆట, పాటల ద్వారా ప్రజల్లో చైతన్యం నింపి ఉద్యమాన్ని విస్తృత స్థాయికి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనతో పాటు ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆమె నిరంతరం ఉద్యమాలు కొనసాగిస్తూ, అన్ని వర్గాల ప్రజలను ఏకం చేస్తూ పోరాటాలకు నాయకత్వం వహిస్తున్నారని కొనియాడారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం విమలక్క ప్రజల్లోనే ఉంటూ పోరాటాలు సాగిస్తున్నారని పేర్కొన్నారు. ఆమె ప్రజాసేవ మరింత కాలం కొనసాగాలని, సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పల్లె నారాయణ గౌడ్, సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలర్ సత్తన్న, ఉద్యమకాల ఫోరం కరీంనగర్ అధ్యక్షుడు గౌడిశాల రమేష్ గౌడ్, కుల సంఘాల జేఏసీ అధ్యక్షుడు లింగంపల్లి సత్యనారాయణ, రజక సంఘం అధ్యక్షుడు పూసాల సంపత్, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మందకృష్ణ మాదిగ కృషివల్లే ఆరోగ్యశ్రీ పథకం

**ఎమ్మార్పీఎస్ మండల ఇన్చార్జి తునికి వసంత్**

**ఘనంగా ఆరోగ్యశ్రీ దినోత్సవ వేడుకలు**



**జమ్మికుంట, ఆగస్టు 7 (నినాదం):** ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ కృషి ఫలితంగా ఏర్పడిన ఆరోగ్యశ్రీ దినోత్సవాన్ని జమ్మికుంట అంబేద్కర్ చౌరస్తా దగ్గర ఎమ్మార్పీఎస్ జమ్మికుంట మండల ఇన్చార్జి తునికి వసంత్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వసంత్ మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ గత 30 సంవత్సరాలుగా సమాజంలోని అన్ని వర్గాల సమస్యల పట్ల పోరాటం చేస్తూ అణగారిన వర్గాల ప్రజలకు అండగా ఉన్నారని అన్నారు . దీనిలో భాగంగా నిరుపేద ప్రజలకు కార్పొరేట్ ఆసుపత్రులలో ఉచితంగా వైద్య సేవలు అందించే ఆరోగ్యశ్రీ పథకాన్ని 2004లో ఆనాటి ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం పైన పోరాటం చేసి సాధించారని గుర్తు చేశారు. మందకృష్ణ మాదిగ కృషి ఫలితంగా ఏర్పడిన విజయాలు ఈనాడు ప్రతి ఇంటిలో కనిపిస్తాయని వసంత్ వివరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు మారేపల్లి శ్రీనివాస్ హుజురాబాద్ మండల ఇంచార్జ్ ఎర్ర ఆదిత్య, కనగర్తి సర్పంచ్ రామంచ సంపత్ , ముంజల రాజేష్ గౌడ్, దొడ్డ అనిల్, రామంచ రాజు, రాచపల్లి సమ్మయ్య జీడి మోహన్, రాచపల్లి వంశీ, ఎర్ర జస్వంత్ సాయి, పూరెల్ల రాహుల్ , తౌడం దిలీప్ పాల్గొన్నారు.

# చేనేత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- చేనేత వస్త్రాల కొనుగోలుతో నేతన్నలకు భరోసా
- చేనేత రంగానికి వరంగల్ నగరం వేదిక
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**హన్మకొండ, ఆగస్టు 7, (నినాదం):** చేనేత కార్మికుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం అని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా జిల్లా చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ చేనేత అనేది కేవలం ఒక వృత్తి మాత్రమే కాదని, భారతీయ సంస్కృతి, సంప్రదాయం, కళాత్మక నైపుణ్యానికి ప్రతీక అన్నారు. తెలంగాణలో చేనేత రంగానికి విశిష్టమైన చరిత్ర ఉందని, ముఖ్యంగా వరంగల్ ప్రాంతం దేశవ్యాప్తంగా చేనేత కళకు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటోందని, వారి జీవనోపాధి మెరుగుపడేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు. చేనేత ఉత్పత్తులకు మార్కెట్ విస్తరణ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, వినూత్న డిజైన్లు, నైపుణ్యాభివృద్ధి శిక్షణలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. అలాగే ముడి సరుకు, రుణ సౌకర్యాలు, బీమా, సంక్షేమ పథకాలు మరింత సమర్థవంతంగా అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి చేనేత కార్మికులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. చేనేత కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ముఖ్యంగా హనుమకొండ జిల్లాలోని చేనేత కార్మికుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని చేనేత కార్మికుల అభ్యున్నతికి అవసరమైన మౌలిక సదుపాయాలు, సంక్షేమ కార్యక్రమాల కోసం నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా చేనేత రంగానికి చేయూతనిచ్చే విధంగా డిపిఆర్ తయారుచేసి ఇవ్వాలని, డిపిఆర్ ను సీఎం దృష్టికి తీసుకు వెళ్తానని పేర్కొన్నారు. చేనేత రంగాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. చేనేతను కాపాడుకుంటూ చేనేత కార్మికులకు అండగా నిలవాలని: ఆయన పిలుపునిచ్చారు. చేనేత కార్మికులందరికీ జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలను ఎమ్మెల్యే తెలియజేశారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్చార్జి కలెక్టర్ రవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేనేత రంగానికి ప్రోత్సాహాన్ని అందిస్తుందన్నారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సూచించిన విధంగా చేనేత సంఘం ప్రతినిధులు చేనేత సంక్షేమానికి డిపిఆర్ తయారుచేసి అందించాలని తెలియజేశారు. అనంతరం చేనేత కార్మికులను ఘనంగా సన్మానించడంతో పాటు చేనేత రంగంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో ప్రతిభ కనబర్చిన వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించి చేనేత వస్త్రాలతో సన్మానించారు. కలెక్టరేట్ ప్రాంగణంలో జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాల విక్రయ స్టాల్ ను సందర్శించి చేనేత చీరను ఎమ్మెల్యే కొనుగోలు చేశారు. కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ జయరాజ్, ఏడీ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## అవగాహనతోనే ఎయిడ్స్ నివారణ



- ఎం జి యు రీజినల్ కోఆర్డినేటర్ సైదా నాయక్

**సూర్యాపేట ప్రతినిధి ఆగస్టు 7 (నినాదం):** అవగాహనతోనే ఎయిడ్స్ వ్యాధిని నివారించవచ్చని ఆంధ్రప్రదేశ్ తెలంగాణ ఎన్ఎస్ఎస్ రీజినల్ కోఆర్డినేటర్ రామావత్ సైదా నాయక్ అన్నారు. శుక్రవారం డిస్టిక్ లెవెల్ వన్డే రెడ్ రిబ్బన్ కార్యక్రమంలో భాగంగా కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకుముందు జ్యోతి ప్రజల్వన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరు అవగాహన అవసరమని వ్యాధి నిర్మూలన పై విస్తృత ప్రచారం జరగాలని ఎన్ఎస్ఎస్ విద్యార్థులు తమ వంతు బాధ్యతగా తమ పరిసర ప్రాంతాలలోని ప్రజలకు గ్రామస్తులకు స్వచ్ఛందంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఎయిడ్స్ అనేది అంటువ్యాధి కాదని సాధారణ వ్యాధిగ్రస్తులేనని వారిని సమాజంలో చులకనగా చూడరాదని అన్నారు. మహాత్మా గాంధీ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మారం వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఎర్రరెబ్బన్ ఆధ్వర్యంలో యూనివర్సిటీ అనుబంధ కళాశాలలో ఎయిడ్స్ వ్యాధి పట్ల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని నషా ముక్తి భారత వంటి కార్యక్రమాలను నిర్వహించి మాదకద్రవ్యా వాడకం వలన కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరిస్తున్నామని పేర్కొన్నారు. అదేవిధంగా ఎస్వీ కళాశాల ప్రిన్సిపాల్ కెప్టెన్ ప్రొఫెసర్ వి. వెంకటేషులు మాట్లాడుతూ పాఠశాల, కళాశాలలు స్వచ్ఛంద సంస్థల ద్వారా ఇటువంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఎయిడ్స్ అంటువ్యాధి కాదని ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులను సమాజంలో చులకనతో చూడకూడదని అన్నారు. వ్యాస రచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు పాలకమండలి సభ్యులు కర్నాటి కిషన్ వక్త భవాని, వైస్ ప్రిన్సిపాల్ ఎంఎస్ఆర్ శాస్త్రి ప్రోగ్రాం ఆఫీసర్లు మధుసూదన్ సృజన అధ్యాపకులు కవిత నలిని మాధవి రజిత విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## అనంతగిరి కాంగ్రెస్ నూతన కమిటీ ఏర్పాటుపై నేడు సమావేశం



**కోదాడ,ఆగస్టు 7 (నినాదం):** అనంతగిరి మండల కాంగ్రెస్ నూతన కమిటీ ఏర్పాటుపై శనివారం కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి నివాసంలో కీలక సమావేశం నిర్వహించనున్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య ఆదేశాల మేరకు ఈ సమావేశం జరుగనున్నట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముసుకు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మండల కమిటీ పునర్వ్యవస్థీకరణ, గ్రామ కమిటీల బలోపేతంతో పాటు నూతన కమిటీల్లో యువతకు అధిక ప్రాధాన్యం కల్పించడంపై చర్చించనున్నట్లు తెలిపారు. మండల నాయకులు, గ్రామ శాఖ అధ్యక్షులు, సర్పంచ్‌లు, పార్టీ ముఖ్య నాయకులు తప్పనిసరిగా హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**భూపాలపల్లి ప్రతినిధి, ఆగస్టు07(నినాదం):** వైద్య కళాశాల బాలికల వసతి గృహ భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ఈ నెలాఖరు నాటికి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన బాలికల వైద్య కళాశాల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించిన కలెక్టర్ అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. వర్షాల కారణంగా పనులకు ఆటంకం కలగకుండా ఉండేందుకు, భవనం అంతర్గత (ఇంటీరియర్) పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. సమయం తక్కువగా ఉన్నందున పనుల్లో వేగం పెంచి, ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగస్టు నెలాఖరు నాటికి బాలికల వసతి భవనాన్ని పూర్తిస్థాయిలో అప్పగించాలని స్పష్టం చేశారు. బాలుర వసతి భవన నిర్మాణ పనుల్లో కూడా ఎలాంటి జాప్యం వహించవద్దని, దానిని సెప్టెంబర్ నెలాఖరు నాటికి సిద్ధం చేసి అందించాలని ఆదేశించారు. హాస్టల్ భవనంలో విద్యుత్తు అంతరాయం కలగకుండా ఉండేందుకు ఎంతమేర విద్యుత్ అవసరమవుతుందో అంచనా వేసి, సమగ్ర నివేదికలు అందించాలని ఆర్అండ్‌బీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా వేంకటేశ్వర రావు, ప్రధాన ఆసుపత్రి పర్యవేక్షకులు డా వెంకటరత్నం, ఆర్ అండ్ బీ ఈ ఈ రమేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నార్కోటిక్ డాగ్ 'రోలెక్స్'తో విస్తృత తనిఖీలు

గొండ్రియాల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన



**కోదాడ/అనంతగిరి, ఆగస్టు 7 (నినాదం):** జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ ఆదేశాల మేరకు శుక్రవారం అనంతగిరి మండల కేంద్రంలో ఎస్ఐ ఏడుకొండలు ఆధ్వర్యంలో నార్కోటిక్ డాగ్ 'రోలెక్స్'తో విస్తృత తనిఖీలు నిర్వహించారు. హోటళ్లు, టీ దుకాణాలు, మెడికల్ షాపులు, కూరగాయల దుకాణాలు, బహిరంగ ప్రదేశాల్లో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల గుర్తింపు కోసం సోదాలు చేపట్టారు. అనంతరం గొండ్రియాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల విని యోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. గంజాయి వంటి మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తాయని, విద్యార్థులు వాటికి పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రజల సహకారం ఎంతో అవసరమని, గంజాయి వినియోగం లేదా సరఫరాకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు అందించాలని కోరారు. కార్యక్రమంలో డాగ్స్ స్క్వాడ్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 10న సాగర్‌లో ముఖ్యమంత్రి పర్యటన

- వరుణయాగం నిర్వహించే యాగస్థలి, పరిశీలించిన కలెక్టర్ చంద్రశేఖర్





**నల్లగొండ ప్రతినిధి ఆగస్టు 7 (నినాదం ):** ఈ నెల 10న నాగార్జునసాగర్ సమీపంలోని విజయ విహార్ వద్ద నిర్వహించనున్న వరుణ యాగానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి హాజరుకానున్నారన్న ప్రాథమిక సమాచారం మేరకు ఏర్పాట్ల విషయమై నల్గొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ శుక్రవారం నాగర్జున సాగర్ సమీపంలోని విజయ విహార్ ను సందర్శించారు. వరుణ యాగం నిర్వహించే యాగస్థలి, ప్రవచనశాల ,యాగ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్ల పై దేవాదాయ , రెవెన్యూ, పోలీసు, ఇతర సంబంధిత శాఖల అధికా రులతో సమీక్ష నిర్వహించారు. వరుణ యాగానికి రాష్ట్ర ముఖ్యమంత్రి హాజరుకానున్న దృష్ట్యా అవసరమైన అన్ని ఏర్పాట్లను చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. యాగశాల ఏర్పాటు చేసే ప్రదేశం, భారీకేడింగ్ , పగోడాల ఏర్పాటు, ప్రవచనశాల ,టెంట్లు, ఎల్ఈడిలు, పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాటు వివిధ ప్రాంతాల నుండి యాగం నిర్వహించేందుకు వచ్చే ఋత్వికులు, అర్చకులకు వసతి సౌకర్యాల వంటి ఏర్పాట్లన్నీ చేయాలని చెప్పారు. అంతేకాక అన్ని చోట్లా భారీకేడింగ్ ఏర్పాటు చేయాలని ,ప్రవచనాలు వినేందుకు బయట నుండి వచ్చే సాధారణ ప్రజలకు , యాగానికి హాజరయ్యే ప్రముఖులకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు, మంత్రులు,పార్లమెంట్ సభ్యులు, శాసనమండలి, శాసనసభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు అధిరులు హాజరుకానున్న దృష్ట్యా యాగశాల వద్ద యాగాన్ని తిలకించేందుకు అవసరమయ్యే ఏర్పాట్లతో పాటు,బందోబస్తు, ఇతర ఏర్పాట్లను చేయాలని ఆదేశించారు. విజయవిహార్ మొత్తం పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కోటేశ్వరరావును ఆదేశించారు. అవసరమైన చోట పగోడాల ఏర్పాటుతోపాటు, తాగునీరు, మూత్రశాలలు, ముందు రోజు నుండి యాగానికి వచ్చే ఋత్వికులు ,అర్చకులకు భోజన, వసతి సదుపాయాలు కల్పించాలన్నారు. పోలీస్ శాఖ తరఫున అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని ,వరుణ యాగం నిర్వహించే స్థలం మొత్తం ప్లాన్ తో సహా సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అదనపు ఎస్పి రమేష్, మిర్యాలగూడ ఆర్డీవో రమణారెడ్డి, యాదాద్రి దేవాలయ డిప్యూటీ ఈవో డి. భాస్కర్ జిల్లా ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ కే. భాస్కర్ ,డీఎస్పీ రవి, ఆర్ ఐ శ్రీనివాస రెడ్డి, తదితరులు ఉన్నారు.

## తల్లిపాలు శిశువు ఎదుగుదలకు దోహదం



సూపర్వైజర్ సంధ్య

**మిర్యాలగూడ, ఆగస్టు 7 (నినాదం):** మిర్యాలగూడ అర్బన్ ప్రాజెక్టు సూపర్వైజర్ పి. వేణుగోపాల్ రావు ఆదేశానుసారం ప్రపంచ తల్లిపాల దినోత్సవం శుక్రవారం అన్నారం సెక్టార్ లోని జంకుతండ గ్రామపంచాయతీ పరిధిలోని మాలోతు తండా అంగన్వాడి కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మిర్యాలగూడ అర్బన్ అంగన్వాడి సూపర్వైజర్ సంధ్య మాట్లాడుతూ తల్లిపాలు శిశువుకు ఎదుగుదలకు దూ దోహదపడుతుందని మిర్యాలగూడ అర్బన్ సూపర్వైజర్ సంధ్య అన్నారు. అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రుపాలు అందించి శిశువు ఎదుగుదలకు రోగ నిరోధక శక్తి దోహదపడేలా తల్లి చర్యలు తీసుకోవాలని కోరారు. శిశు పుట్టిన దగ్గర నుండి ఆరు నెలల వరకు తల్లిపాలు అందిస్తే శిశువు ఎదుగుదల బాగుంటుందని సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ ఉపాధ్యాయురాలు లక్ష్మీ మహిళలు పాల్గొన్నారు.

## పట్టణ అభివృద్ధికి ప్రత్యేక కార్యచరణ




**భూపాలపల్లి, ఆగస్టు 7 (నినాదం) :** భూపాలపల్లి పట్టనా అభివృద్ధికి, ప్రజా ఆరోగ్యం,అటవీశాఖ భూముల వివాదాలు పరిష్కారంపై ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సంబంధిత శాఖల అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మున్సిపల్ చైర్మన్ బుర్ర కొంరయ్య అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వివిధ వార్డుల్లో నెలకొన్న విద్యుత్తు సమస్యలను నెల రోజుల్లో పరిష్కరించాలని విద్యుత్ శాఖ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మౌలిక వసతుల లోపాలను మరో 15 రోజుల్లో పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పల్లె దావఖానలో మౌలిక వసతుల కల్పనకు అంచనాలు సిద్ధం చేసి కలెక్టర్ కు,ఎమ్మెల్యేకు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. క్షయ వ్యాధి, హెచ్ఐవిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, బాధితులకు నిరంతరం మందులు, వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం గా ప్రత్యేక ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఆసుపత్రికి సింగరేణి విద్యుత్ సరఫరా అనుసంధానంపై మున్సిపల్ కౌన్సిల్లో తీర్మానం చేయాలని ప్రతిపాదించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రూ. 14 కోట్లతో కోట్లతో అదనపు అంతస్తు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఆసుపత్రి సమస్యల పరిష్కారంపై మరో 15 రోజుల్లో ప్రత్యేక అభివృద్ధి సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. అటవీ భూముల అంశంలో శాఖల మధ్య సమన్వయంతో పెండింగ్ వివాదాలను త్వరగా పరిష్కరించాలని ఎమ్మెల్యే సూచించారు. 6, 26,5 వార్డుల్లో నిర్మిస్తున్న రక్షణ గోడ పనులను అనవసరంగా జోక్యం చేసుకోవద్దు అని తెలిపారు. జంగేడు రోడ్డుతో పాటు ప్రధాన రహదారి లోని డబ్బాలను వెనక్కి తరలించాలని అటవీశాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## విద్య ద్వారానే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చు

ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



**మిర్యాలగూడ, ఆగస్టు 7 (నినాదం ):** విద్యార్థులే దేశ భవిష్యత్తు, విద్య ద్వారానే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారంమిర్యాలగూడ పట్టణంలోని హౌసింగ్ బోర్డు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ నూకల కవిత వేణుగోపాల్ రెడ్డి కలిసి పంపిణీ చేశారు. మాట్లాడుతూ ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమశిక్షణతో, అంకితభావంతో చదువుకుంటే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆశయాలను నెరవేర్చేలా కష్టపడి చదవాలని విద్యార్థులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం, ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతానికి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ధర్మా నాయక్, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లను బాగుచేయండి

ప్రధాన రహదారిలో వరినాట్లతో నిరసన

డ్రైనేజీ సమస్యలపై వ్యాపారుల ఆగ్రహం



**భూపాలపల్లి ఆగస్టు 7( నినాదం):** భూపాలపల్లి లోని ప్రధాన రహదారిపై వరి నాట్లు వేసి,నిరసన తెలిపిన వ్యాపార వాణిజ్య యాజమాన్యాలు, ఈ ప్రధాన రహదారి గుండా సింగరేణి జనరల్ మేనేజర్ ఆఫీస్, జిల్లా ఎస్పీ ఆఫీస్, పోలీస్ స్టేషన్ మరియు మున్సిపల్ ఆఫీస్ కు వెళ్లేటటువంటి అధికారులు మరియు ప్రజలు నిత్యం ఈ దారి గుండానే ప్రయాణిస్తూ ఉంటారు. చినుకు పడకుండా కూడా ఈ రహదారిలో నిత్యం ఈ రోడ్డుపై నీరు నివసిస్తుంది. ఇక చినుకు పడితే బురద మయమే, చెరువులా అనిపిస్తుంది. కానీ ఏ ఒక్క అధికారి మాత్రం ఈ రోడ్డును పట్టించుకున్న దాఖలాలు లేవు, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం తో మురుగునీరు రోడ్డుపై నిలిచి దుర్వాసన వ్యాపిస్తుందని ఆవేద వ్యక్తం చేశారు. రోడ్డుపై నిలుస్తున్న నీరును చూసి జనాలు వాపోతున్నారు,కానీ అధికారులు మాత్రం పట్టించుకోరు. రోడ్డు ప్రక్కన ఉన్నటువంటి షాపుల యాజమాన్లు అధికారులకు చెప్పి చెప్పి విసుగుచెంది ఈరోజు రోడ్డు బురదమయంగా ఉండడంతో ఆగ్రహించిన వ్యాపారులు స్థానిక ప్రజలు వినూత్నంగా రోడ్డు పైననే వరి నాట్లు వేసి నిరసన తెలిపారు.


## మహిళ సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట

- మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే నాగరాజు



**హన్మకొండ, ఆగస్టు 7, (నినాదం):** కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని వర్ధన్నపేట ఎమ్మెల్యే,విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. శుక్రవారం ఎర్రగట్టుగుట్ట వెంకటేశ్వర కళ్యాణ మండలంలో 65,66వ డివిజన్లకు చెందిన మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలుచేస్తోందని. గ్రామీణ,పట్టణ ప్రాంతాల్లో మహిళల జీవిత స్థాయిని మెరుగుపరచడానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రయత్నాలు చేస్తోందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో మహిళా సాధికారత, స్వయం సహాయక సంఘాల అభివృద్ధి కోసం ఈ పథకాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. అర్హులైన పేద మహిళలకు, మహిళా సంఘాల సభ్యులకు ఈ చీరలను అందజేస్తామన్నారు. అర్హులైన ప్రతీ మహిళకు ఇందిరమ్మ చీరలు పంపిణీ అయ్యేలా పారదర్శకంగా, ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని అధికారులకు సూచించారు. కుటుంబ అభ్యున్నతిలో మహిళలే కీలకమని,భవిష్యత్ తరాల బాగు కోసం పిల్లలను చక్కగా చదివించాలని హితువు పలికారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు తదితర వాటిని ప్రభుత్వం మహిళల పేరుతోనే మంజూరు చేస్తోందని, మహిళల అభ్యున్నతికి పెద్దపీట వేస్తోందని అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో 66వ డివిజన్ అధ్యక్షులు కిరణ్ గారు, 65వ డివిజన్ అధ్యక్షులుసునీల్,ఆత్మకూరు మార్కెట్ వైస్ చైర్మన్ తిరుపతి,మండల అధ్యక్షులు అశోక్ కుమార్,మహిళ అధ్యక్షురాలు జోరిక పూల,మహిళ ఉప అధ్యక్షురాలు స్వాతి,మాజీ మండల అధ్యక్షులు మహేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు వీసం సురేందర్ రెడ్డి,వంగపహాడ్ పీ ఏ సీ ఎస్ చైర్మెన్ మెరుగు రాజేష్‌గౌడ్,మండల,డివిజన్ స్థాయి నాయకులు, కార్యకర్తలు,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ చేనేత కార్మికులకు సన్మానం



**హన్మకొండ, ఆగస్టు 7, (నినాదం):** జాతీయ చేనేత దినోత్సవం సందర్భం గా చేనేత జౌళి శాఖ హన్మకొండ ఆద్వర్యం లో హన్మకొండ జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్ లో శాయంపేట సహకార సంఘ సీనియర్ కార్మికుడు పూల ఐలుమల్లును ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డితో పాటు జాయింట్ కలెక్టర్ రవిలు ఇద్దరు కలిసి శుక్రవారం సన్మానం చేశారు. **శాయంపేటలో..** పేట చేనేత సహకార సంఘంలోని కార్మిక పెద్ద మనుషులకు పాలక వర్గం సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో సంఘం అధ్యక్షుడు బాసని ప్రకాష్ ,ఉపాధ్యక్షులు డీ. రమేష్ కార్యదర్శి వనం దేవరాజు ,కోశాధికారి బాసని నవీన్, డైరెక్టర్స్ సామల రవీందర్, దాసరి సమ్మయ్య, బాసని బాలకృష్ణ,బాసని ఉమాదేవి, వలుపదాసు స్వరూప సంఘం కార్మికులు పాల్గొన్నారు.



## షైన్ పాఠశాలలో బోనాల పండుగ

తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత

**భూపాలపల్లి ఆగస్టు 7 ( నినాదం):** తెలంగాణ సాంస్కృతి, సాంప్రదాయాలను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని షైన్ పాఠశాల కరస్పాండెంట్ భానుచందర్ అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని స్థానిక షైన్ పాఠశాలలో శుక్రవారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అమ్మవారు, పోతరాజు, బోనం తదితర వేషధారణతో నిర్వహించిన బోనాల ఊరేగింపు, జానపద నృత్యాలు, సంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. దీంతో పాఠశాల ఆవరణంలో అంతా పండుగ వాతావరణం తో నిండిపోయింది. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ బోనాల పండుగ చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో మన సాంస్కృతిపై గౌరవాన్ని సాంప్రదాయాల పట్ల అవగాహనను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ స్రవంతి, ఇన్చార్జి రాజేష్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# అమ్మ పాలు ..చిన్నారుల బలం..

**తల్లి పాల వారోత్సవాల్లో అక్షరాభ్యాసం**
**చిన్నారులకు విద్య శ్రీకారం**
**12 వ వార్డు కౌన్సిలర్ అమ్మిరి శెట్టి శ్రావణి రాకేష్**



**సుల్తానాబాద్, ఆగస్టు0 7 (నినాదం):** తల్లి పాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడంతో పాటు చిన్నారుల్లో విద్యాభ్యాసానికి పునాది వేయాలనే ఉద్దేశంతో 12వ వార్డులోని స్వప్న కా లనీ, జవహర్ నగర్ అంగన్వాడీ కేంద్రాల్లో తల్లి పాల వారోత్సవాల సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అక్షరాలు దిద్దిస్తూ విద్యాభ్యాసానికి శ్రీకారం చుట్టారు. తల్లులు తమ పిల్లల ఆరోగ్యం, పోషణతో పాటు విద్యపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. కార్యక్రమం లో స్థానిక 12వ వార్డు కౌన్సిలర్ అమిరిశెట్టి శ్రా వణీ--రాకేష్, అంగన్వాడీ టీచర్లు అమిరిశెట్టి మే ఘమాల, నరహరి స్వాతి, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

## తప్పుడు జనన ధ్రువీకరణ జారీ

**కార్యదర్శి సస్పెన్షన్**
**కంప్యూటర్ ఆపరేటర్ తొలగింపు**
**కలెక్టర్ కే. హరిత వెల్లడి**

**కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, ఆగస్టు 7 (నినాదం) :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) గ్రామపంచాయతీలో నిబంధనలకు విరుద్ధంగా తప్పుడు జనన ధ్రువీకరణ పత్రం జారీ చేసిన ఘటనలో గ్రామపంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేస్తూ, కంప్యూటర్ ఆపరేటర్‌ను విధుల నుంచి తొలగించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కే. హరిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విచారణలో జనన- మరణాల నమోదు చట్టం-1969 నిబంధనలను ఉల్లంఘిం చినట్లు తేలిందని పేర్కొన్నారు. సంబంధిత వ్యక్తి పొన్నం శ్రీనిధి జనన వివరాలు అధికారిక రిజిస్టర్‌లో నమోదు లేకపోయినా, దరఖాస్తు స్వీకరించకుండా, అవసరమైన ఆధార పత్రాలు పరిశీలించకుండా నేరుగా యూనిఫైడ్ బర్త్ అండ్ డెత్ పోర్టల్‌లో నమోదు చేసి జనన ధ్రువీకరణ పత్రం జారీ చేసినట్లు గుర్తించినట్లు వెల్లడించారు. విధి నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం, అధికార దుర్వినియోగం, ప్రభుత్వ నిబంధనల ఉల్లంఘనకు పాల్పడిన పంచాయతీ కార్యదర్శి పైనీ తిరుప తిని తక్షణమే సస్పెండ్ చేసి, శాఖాపరమైన క్రమశిక్షణ చర్య లు చేపట్టాలని ఆదేశించినట్లు తెలిపారు. తప్పుడు నమోదు ప్రక్రియలో బాధ్యత వహించిన కంప్యూటర్ ఆపరేటర్ నీలేష్‌ను విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొ న్నారు. ప్రభుత్వ రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం, తప్పుడు ధ్రువీకరణ పత్రాల జారీ వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని కలెక్టర్ హెచ్చరిం చారు. గ్రామపంచాయతీల్లో ప్రజలకు అందించే సేవలు పూర్తిగా పారదర్శకంగా, చట్టబద్ధంగా ఉండాలని, ప్రతి దరఖాస్తును సంబంధిత ఆధారాలు, రికార్డులను సమగ్రంగా పరిశీలించిన తర్వాతే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

## తల్లి పాలే తొలి అమృతం



**మంచిర్యాల, ఆగస్టు 7 (నినాదం):** ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా శు క్రవారం మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని 25వ డివిజన్‌లో కార్పొరేటర్ తోట రజిత ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షే మ అధికారి రవిఫ్ ఖాన్, సీడీపీఓ విష్ణుప్రియ, సూపర్వైజర్ రమాదేవి, అంగన్‌వాడీ టీచర్ దేవమ్మ గర్భిణులకు సామూహిక శ్రీమంతం నిర్వహించి ఆశీర్వదించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాస కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యత, శిశువుల ఎదుగుదలలో వాటి పాత్ర, తల్లి ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన పోషకాహారం గురించి గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. తల్లిపాలు శిశువుకు సహజ రోగనిరోధక శక్తిని పెంపొందిం చడంతో పాటు పలు వ్యాధుల నుంచి రక్షిస్తాయని అధికారులు తెలిపారు. తల్లి- బిడ్డ మధ్య అనుబంధాన్ని మరింత బలో పేతం చేయడంలో తల్లిపాల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ప్రతి కుటుం బం తల్లిపాల ప్రాముఖ్యతను గుర్తించి బాలింతలకు పూర్తి సహకారం అందించా లని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ఆపద్బాంధవుడిగా కేటీఆర్..

## షార్జా ప్రమాద బాధితుడికి అండ

**ఆసుపత్రి బిల్లు చెల్లింపు..**
**విమాన టికెట్లు ఏర్పాటు**



**మంచిర్యాల, ఆగస్టు 7 (నినాదం):** ఉపాధి కోసం విదేశాలకు వెళ్లిన ఓ యువకుడు ప్రమాదానికి గురై ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనలో మునిగి పోయారు. అలాంటి క్లిష్ట సమయం లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అందించిన భరోసా ఆ కుటుం బానికి కొత్త ఆశను కలిగించింది. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం నర్సాపూర్ గ్రామానికి చెందిన నరెడ్ల సతీష్ (40) కుటుంబ పోషణ కోసం గత రెండేళ్లుగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో బైక్ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ఈ నెల జూలై 29న షార్జాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సతీష్ తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులు ఆయనను షార్జా అల్ కాస్మియా ఆసుపత్రి అత్యవసర విభాగానికి తరలించి చికిత్స అందించారు. ప్రమాద వార్త తెలిసిన వెంటనే స్వగ్రామంలో ఉన్న సతీష్ భార్య భవాని, తండ్రి రామన్న తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఆసుపత్రి ఖర్చులు, స్వదేశానికి ఎలా తీసుకురావాలనే ఆలోచనతో కుటుంబం తీవ్ర మనోవేదనకు లోనైంది. ఈ విషయాన్ని తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర నాయకుడు విజిత్ రావు నర్సాపూర్ గ్రామానికి వెళ్లి సతీష్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో ఫోన్‌లో సతీష్ భార్య భవాని, తండ్రి రామన్నలను మాట్లాడించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన కేటీఆర్, సతీష్ చికిత్సకు సంబంధించిన ఆసుపత్రి బిల్లును చెల్లించడంతో పాటు, ఆయనను స్వదేశానికి తీసుకురావడానికి అవసరమైన విమాన టికెట్లను కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సతీష్ ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పు డు తెలుసుకుంటూ, వీలైనంత త్వరగా తెలంగాణకు తీసుకువచ్చేం దుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కేటీఆర్ హామీ ఇచ్చారు. ఈ పరిణామంతో సతీష్ కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. కష్టకాలంలో అండగా నిలిచి స్వగ్రామానికి తీసుకొచ్చేందుకు ముందుకొచ్చిన కేటీఆర్‌కు కుటుం బ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. విదేశాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటు న్న తెలంగాణ వలస కార్మికులకు ఇటువంటి సహాయం ఎంతో ధైర్యాన్నిస్తుందని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు.

## ఆటపాటలతోనే ప్రీ-ప్రైమరీ విద్యకు బలమైన పునాది

**కలెక్టర్ కె. హరిత**



**కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, ఆగస్టు 7 (నినాదం)** చిన్నారులకు ఆటలు, పాటలు, కథలు, చిత్రలేఖనం వంటి కార్యకలాపాల ద్వారా ఆనందదాయకమైన అభ్యసన వాతావరణాన్ని కల్పించి ప్రీ-ప్రైమరీ విద్యను మరింత బలోపేతం చేయాలని జిల్లా కలెక్టర్ కె. హరిత సూచించారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో శుక్రవారం ప్రీ-ప్రైమరీ సెక్షన్లు నిర్వహిస్తున్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు నిర్వహించిన జిల్లా స్థాయి ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. చిన్నారుల తొలి విద్యా భ్యాస దశ వారి భవిష్యత్ విద్యకు పునాది వంటిదని పేర్కొన్న కలెక్టర్, ఈ దశలో చదువు ఒత్తిడి లేకుండా ఆటలు, పాటలు, కథలు, సంభాషణలు, వివిధ సృజనాత్మక కార్యకలాపాల ద్వారా నేర్చుకునే అవకాశాలు కల్పించాలని సూచించారు. పిల్లలు పాఠశాలకు రావడానికి ఆసక్తి చూపేలా ప్రతి పాఠశాలలో సురక్షితమైన, సంతోషకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా ప్రధానో పాధ్యాయులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి చిన్నారి వయస్సు, ఆసక్తి, అభ్యసన స్థాయికి అనుగుణంగా బోధన సాగాలని, భాషా నైపుణ్యాలు, సంఖ్యా భావనలు, పరిశీలన, ఆలోచన, సృజనాత్మకత, సామాజిక నైపుణ్యాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. పాఠశాలల్లో అందుబాటులో ఉన్న ఇండోర్, అవుట్‌డోర్ ప్లే మెటీరియల్, టీఎల్ఎం, చిత్రాలు, బొమ్మలు, కథా పుస్తకాలను సమర్థంగా వినియోగించి అనుభవ పూర్వక అభ్యసన అందించాలని సూచించారు. పిల్లల భద్రత, పరిశుభ్రత, తాగునీరు, మరుగు దొడ్లు, తరగతి గది వాతావరణం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రధానోపాధ్యాయులు పరిపాలనా బాధ్యతలతో పాటు ప్రీ-ప్రైమరీ తరగతుల అకాడమిక్ మానిటరింగ్, మెంటరింగ్‌పై దృష్టి సారించి తరగతి గదులను క్రమం తప్పకుండా సందర్శించాలని కలెక్టర్ సూచించారు. చిన్నారి పాఠశాలలో పొందే తొలి అనుభవమే వారి విద్యా ప్రయాణాన్ని ప్రభావితం చేస్తుందని, ప్రతి ప్రీ-ప్రైమరీ తరగతి గదిని పిల్లలు ప్రతిరోజూ ఆనందంగా రావాలనుకునే ప్రదేశంగా తీర్చిదిద్దాలని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సచ్చిదానంద చారి, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఉప్పులేటి శ్రీనివాస్, తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మహేశ్వర్, రిసోర్స్ పర్సన్లు శంకర్, ఝాన్సీ, వెంకటేష్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# విద్యకు విజ్జన్న విజన్..

**సుల్తానాబాద్ లో తెలం గాణ పబ్లిక్ స్కూల్**
**నర్సరీ నుంచి ఇంటర్ వరకు నాణ్యమైన విద్య**
**జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం ప్రారంభం**
**చేనేత సొసైటీకి రూ.10 లక్షలు**
**పద్మశాలి భవనానికి రూ.5 లక్షలు**
**ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణ రావు**







**సుల్తానాబాద్, ఆగస్టు 07 (నినాదం):** సుల్తానాబా ద్ పట్టణం విద్యారంగ అభివృద్ధికి మ రో కీలక అడుగు పడింది. నియోజకవర్గానికి ఒక టి చొప్పున ఏర్పాటు చేయనున్న తెలంగాణ ప బ్లిక్ స్కూల్‌ను ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి సహకా రంతో సుల్తానా బాద్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభు త్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణ రావు తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి పాఠశాల ప్రారంభమవుతుందని, నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఉన్నత విద్యా ప్రమాణా లతో విద్య అందించనున్నట్లు వెల్లడించా రు. శుక్రవారం సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ప్రెషర్స్ డే కార్యక్రమా నికి ఆయన ముఖ్యఅతిది : గా హాజరై విద్యార్థుల ను ఉద్దేశించి మాట్లాడారు. సుల్తానాబాద్ ప్రభు త్వ కళాశాలలో చదివిన ఎంతోమంది ఉన్నత స్థానాలకు ఎదిగారని, తాను కూడా ఇదే కళాశా లలో చదవడం గర్వంగా ఉందన్నారు. పూర్వ విద్యార్థిగా కళాశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. జూనియర్ కళాశాల విద్యార్థు లకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభిస్తున్న ట్లు ప్రకటించారు. కళాశాలను క్రమ శిక్షణతో మంచి ఫలితాలు సాధించేలా నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులను అభినందించారు.

**చేనేతకు అండగా..**

అంతకుముందు సుల్తానా బాద్‌లోని శ్రీ వెంకటేశ్వ ర చేనేత సొసైటీ వద్ద పద్మశాలి సంఘం ఆధ్వర్యం లో నిర్వహించిన జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమంలో విజయరమణరావు పాల్గొన్నారు. భ క్త మార్కండేయ, తెలంగాణ ఉద్యమకారుడు కొం డా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చేనేత కార్మికుల సంక్షేమానికి ప్ర భుత్వం కట్టుబడి ఉంద ని ఆయన తెలిపారు. చే నేత సొసైటీ ప్రహరీ గోడ నిర్మాణానికి రూ.10 లక్ష లు, పద్మశాలి సంఘం భవన పూర్తి స్థాయి నిర్మా ణానికి రూ.5 లక్షలు కేటాయిస్తున్నట్లు ప్రకటించా రు. స్థానిక చేనేత సొసైటీ బకాయిల మాఫీ కోసం సంబంధిత మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి ప్రత్యేకంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో మున్సి పల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, జిల్లా లైబ్రరీ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, వైస్ చైర్మన్ అంతటి పుష్పలత, కమిషనర్ తిప్పరాజు రమేష్, కౌన్సిలర్లు, పద్మశాలి సంఘం సభ్యులు, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, ఓదెల మల్లన్న దేవాలయ చైర్మన్, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు రవీందర్, కాంగ్రెస్ నాయకులు, విద్యా ర్థులు తదితరులు పాల్గొన్నారు.

## చింతల శ్రీను తనయుడు రాజు జయంతి సందర్భంగా సేవా కార్యక్రమాలు..





**సుల్తానాబాద్, ఆగస్టు 7 (నినాదం):** సమాజ సేవే చిరస్మరణీయమైన నివాళి అని పె ద్దపల్లి జిల్లా గ్రం థాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్ అన్నారు. సుల్తానాబాద్ పట్టణం లోని మార్కండేయ కాలనీకి చెందిన కీర్తిశేషులు రాజు జయంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు శుక్రవారం పలు సేవా కార్య క్రమాలు ని ర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని 8వ వార్డు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పెన్ను లు, నోట్‌బుక్స్, ఇతర విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. అనంతరం స్థానిక వృద్ధాశ్రమాన్ని సంద ర్శించి అక్కడి వృద్ధులకు పండ్లు పంపిణీ చేసి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన పెద్దపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, 8వ వార్డు కౌన్సిలర్ చింతల రాజు మాట్లాడు తూ కీర్తిశేషులు రాజు సేవా భావాన్ని స్మరించు కుంటూ ఆయన జయంతి సందర్భంగా నిర్వ హిం చిన ఈ కార్యక్రమాలు ఆదర్శప్రాయమని, విద్యా ర్థులకు విద్యా సామగ్రి అందించడం, వృద్ధులను ఆదరించడం వంటి కార్యక్రమాలు సమాజంలో సేవా స్ఫూర్తిని పెంపొందిస్తాయని అన్నారు. కా ర్యక్రమంలో చిలుక రాజేశం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీ ప్రముఖులు, అభిమానులు పాల్గొని కీర్తిశేషులు రాజుకు ఘనంగా నివాళులర్పించారు.

## సైబర్ ఉచ్చులో చిక్కొద్దు.. జాగ్రత్త.!

**విద్యార్థులకు ఎలిగేడు ఎస్సై మధుకర్ గట్టి హెచ్చరిక..**
**ఆన్లైన్ మోసాలపై ఎస్సై సమరశంఖం..**



**సుల్తానాబాద్, ఆగస్టు 7 (నినాదం):** సైబర్ నేరాల బారిన పడకుండా విద్యార్థులు అ ప్రమ త్తంగా ఉండాలని ఎలిగేడు ఎస్సై మధుకర్ సూచించారు. పెద్దపల్లి జిల్లా ఎలిగేడు పోలీస్ స్టే షన్ పరిధిలోని జెడ్పీ హెచ్ఎస్ పాఠశాలలో ఎస్సై మధుకర్ ఆధ్వర్యంలో శుక్రవారం సైబర్ అవగాహ న కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల కు సైబర్ నేరాల తీరు, ఆన్‌లైన్ మోసా లు, అనుమా నాస్పద లింకులు, నకిలీ కాల్స్, మెసే జ్‌ల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, OTP, పాస్‌వర్డ్‌లు ఇతరులతో పంచు కోవద్దని సూచించారు. సైబర్ నేరగాళ్లు రోజురోజు కూ కొత్త పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతున్న నే పథ్యంలో విద్యార్థులు సాంకేతికతను జాగ్రత్తగా వినియోగిం చాలని ఎస్సై మధుకర్ సూచించారు. అనుమానా స్పద ఘటనలు ఎదురైతే వెంటనే త ల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసుల దృ ష్టికి తీసు కురావాలని తెలిపారు. విద్యార్థుల్లో సై బర్ భద్రతపై అవగాహన పెంపొందించడమే ల క్ష్యంగా నిర్వ హించిన ఈ కార్యక్రమం ఆలోచింపజే సేలా సాగింది.

## మంథని నుండి 14న శ్రీకృష్ణ సేవా విద్యానిధి యాత్ర

**యాదవ విద్యానిధి యాత్రను విజయవంతం చేయండి**
**జిల్లా అధ్యక్షులు మేకల మల్లేశం యాదవ్**



**మంథని, ఆగస్టు 7 (నినాదం) :** యాదవ విద్యార్థుల ఉన్నత విద్య కోసం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న యాదవ విద్యార్థి వసతి గృహం నిధుల సేకరణలో భాగంగా ఈనెల 14 నుండి 21 రోజుల పాటు శ్రీకృష్ణ సేవా - విద్యానిధి యాత్ర నిర్వహించనున్నట్లు అఖిల భారత యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు మేకల మల్లేశం యాదవ్ తెలిపారు. శుక్రవారం మంథని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 14న మంథని నుండి ప్రారంభమయ్యే ఈ యాత్ర వచ్చే నెల సెప్టెంబర్ 3 వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. యాదవ విద్యార్థుల్లో చైతన్యం నింపి, ఉన్నత విద్య పట్ల ఆసక్తి పెంచడమే ఈ యాత్ర ప్రధాన ఉద్దేశమని ఆయన అన్నారు. మంథని నియోజకవర్గంలోని యాదవులు పెద్ద సంఖ్యలో పాల్గొని యాత్రను విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా యాదవ విద్య నిధి యాత్ర పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యాదవ ట్రస్ట్ అధ్యక్షులు మారం తిరుపతి యాదవ్, ట్రస్టు సభ్యులు పర్స బక్కన్న యాదవ్, మంథని మండల యాదవ సంఘం అధ్యక్షుడు పర్శవేన మోహన్ యాదవ్, జిల్లా కార్యదర్శి ఉడుత పర్వతాలు యాదవ్, జిల్లా నాయకులు కనవేన శ్రీనివాస్ యాదవ్, నాయకులు వేముల లక్ష్మణ్ యాదవ్, కనగంటి ఓదెలు యాదవ్ , బాస అశోక్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# వానరమా.. మమ్మల్ని వదిలేయ్!

## మంచిర్యాలపై వానరాల దండయాత్ర



**మంచిర్యాల, ఆగస్టు 7 (నినాదం):** ఒకప్పుడు అడవుల్లో మాత్రమే కనిపించే వానరాలు ఇప్పుడు పట్టణాలు, గ్రామాల్లో స్వేచ్ఛగా సంచరిస్తూ ప్రజల దైనందిన జీవితాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. మంచిర్యాల జిల్లాలోని పలు కాలనీలు, గ్రామాల్లో వానరాల బెడద రోజురోజుకూ పెరుగుతుండటంతో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గుంపులుగా సంచరిస్తూ ఇళ్లపైకి ఎక్కడం, కిటికీలు, తలుపులు తెరిచి ఆహార పదార్థాలను ఎత్తుకెళ్లడం, ఎదురొస్తే భయపెట్టడం, కొన్నిసార్లు దాడులకు కూడా యత్నించడం వంటి ఘటనలు నిత్యకృత్యంగా మారాయి. ఇళ్లలో మహిళలు వంట చేస్తున్న సమయంలోనే వంటగదిలోకి చొరబడి పండ్లు, కూరగాయలు, వండిన ఆహారాన్ని తీసుకెళ్లడం తరచూ జరుగుతోందని స్థానికులు చెబుతున్నారు. ఇంటి తలుపులు కొద్దిసేపు తెరిచి ఉంచినా వానరాలు లోపలికి ప్రవేశించి వస్తువులను చిందరవందర చేయడంతో కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి.

**పిల్లలపై ఎక్కువ ప్రభావం...**

వానరాల బెడదతో చిన్నారుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. పాఠశాలకు వెళ్లే విద్యార్థులు చేతిలో టిఫిన్ బాక్స్ లేదా ఆహార పదార్థాలు పట్టుకుని కనిపిస్తే వానరాలు వెంటపడుతున్నాయని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పిల్లలను ఒంటరిగా బయటకు పంపాలంటేనే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**మహిళలు, వృద్ధులకు నిత్య భయం...**

ఇంటి పనుల కోసం బయటకు వచ్చే మహిళలు, నడకకు వెళ్లే వృద్ధులు వానరాల గుంపులను చూసి భయంతో వెనక్కి వెళ్లాల్సి వస్తోంది. పైకప్పులపై ఆరబెట్టిన దుస్తులు, ధాన్యం, పండ్లు, ఇతర వస్తువులను వానరాలు చించివేయడం, పడేయడం వల్ల ఆర్థిక నష్టం కూడా కలుగుతోందని ప్రజలు వాపోతున్నారు.

**పై కప్పులే వానరాల స్థావరాలు...**

జిల్లాలోని చాలా కాలనీల్లో ఇళ్లపై వానరాల గుంపులు గంటల తరబడి గడుపుతూ ఒక ఇంటి నుంచి మరో ఇంటికి దూకుతున్నాయి. విద్యుత్ తీగలు, నీటి ట్యాంకులు, డిష్ యాంటెనాలను కూడా ధ్వంసం చేస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. పైకప్పు పైకి వెళ్లాలన్నా భయపడే పరిస్థితి నెలకొంది.

**రోజువారీ జీవితం అస్తవ్యస్తం...**

ఒకప్పుడు ప్రశాంతంగా ఉండే కాలనీలు ఇప్పుడు వానరాల అరుపులతో మారుమోగుతున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు వాటి సంచారంతో ప్రజలు ఇంటి తలుపులు కూడా తెరవడానికి సంకోచిస్తున్నారు. పిల్లలు బయట ఆడుకోవడం తగ్గిపోయింది. వృద్ధులు ఉదయం, సాయంత్రం నడకకు వెళ్లడం మానేశారు. ప్రజల జీవనశైలి పూర్తిగా మారిపోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఫిర్యాదులు చేసినా ఫలితం శూన్యం...**

వానరాల సమస్యపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ శాశ్వత పరిష్కారం కనిపించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. అప్పుడప్పుడు సిబ్బంది వచ్చి పరిశీలించి వెళ్లిపోతున్నారే తప్ప సమస్య మాత్రం అలాగే కొనసాగుతోందని అంటున్నారు.

**తక్షణ చర్యలు తీసుకోవాలి**

వానరాలను హాని కలగకుండా సురక్షితంగా పట్టుకుని సమీప అటవీ ప్రాంతాలకు తరలించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. జనాభా అధికంగా ఉండే కాలనీలు, పాఠశాలలు, ఆసుపత్రుల పరిసరాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ప్రజల ప్రాణాలు, ఆస్తులకు ముప్పుగా మారుతున్న ఈ సమస్యపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# అంగన్వాడిలోనే పిల్లలకు పౌష్టికాహారం..

**ప్రతి చిన్నారి ఆరోగ్యంగా ఎదగాలి**
**9 వవార్డు కౌన్సిలర్**
**తోర్రికొండ ప్రభాకర్**



**సుల్తానాబాద్, ఆగస్టు 07 (నినాదం):** అంగన్వాడి కేం ద్రాల్లోనే పిల్లలకు పౌష్టికాహారం లభిస్తుందని 9 వ వార్డు కౌన్సిలర్ తోరికొండ ప్ర భాకర్ స్పష్టం చేశారు. సుల్తానాబాద్ మండల కేంద్రంలో 9వ వార్డు పరిధి లో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్య క్రమంలో గర్భిణీలు, బాలింతలకు తల్లి పాల ప్రా ముఖ్యత, శిశు సంరక్షణ పై అవగాహ న కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వార్డు కౌన్సిలర్ తొ్రికొండ ప్రభాకర్ హాజరై మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న పోషకాహార పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గర్భిణీలు, బాలింతలకు టీహెచ్ఆర్ (టేక్ హోమ్ రేషన్) పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది గర్భిణీల కు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం పిల్లలకు బట్టలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ తుమ్మ విజయలక్ష్మి, గర్భిణీలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

# చేతిలో గొడుగు.. జనంతో అడుగు..!

వర్షంలోనూ ప్రజల మధ్య మంత్రి పొంగులేటి
ఏదులాపురంలో క్షేత్రస్థాయి
పర్యటన - టీ కొట్టు వద్ద స్థానికులతో ముచ్చట్లు
రూ.100 కోట్లతో మోడల్ మున్సిపాలిటీగా అభివృద్ధి హామీ





**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 7: (నినాదం ) :** వర్షం కురుస్తున్నా ప్రజా సమస్యలను తెలుసుకునే తన పర్యటనను ఆపకుండా తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి శుక్రవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 22, 23వ వార్డులైన సాయిగణేష్ నగర్, ఇందిరమ్మ కాలనీల్లో క్షేత్రస్థాయిలో పర్యటించారు. జిల్లా కలెక్టర్ టి.ఎస్. దివాకర్‌తో కలిసి ఒక చేతిలో గొడుగు పట్టుకుని కాలనీల్లో కాలినడకన తిరుగుతూ ప్రజల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. పర్యటనలో భాగంగా సాయిగణేష్ నగర్‌లోని ఓ చిన్న టీ కొట్టు వద్ద మంత్రి ఆగి స్థానికులతో కలిసి టీ తాగుతూ ఆప్యాయంగా ముచ్చటించారు. తాగునీటి సమస్యలు, విద్యుత్ తీగల ప్రమాదం, వర్షపు నీటి నిల్వలు, డ్రైనేజీ ఇబ్బందులను ప్రజలు మంత్రి దృష్టికి తీసుకురాగా, వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మంత్రి తమ మధ్య కూర్చొని సమస్యలు వినడంపై కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఏదులాపురం మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా రూ. 100 కోట్ల నిధులు మంజూరు చేశారని తెలిపారు. గ్రామ పంచాయతీల కలయికగా ఏర్పడిన ఈ మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఆదర్శ మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. లోతట్టు ప్రాంతాల్లో శాశ్వత డ్రైనేజీ నిర్మాణం, తుమ్మ చెట్ల తొలగింపు, తాగునీటి సరఫరా మెరుగుదల వంటి పనులకు ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, స్థలాల కోసం ప్రజలు సమర్పించిన దరఖాస్తులను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని మంత్రి తెలిపారు. అలాగే మున్సిపాలిటీలో అభివృద్ధి చెందుతున్న పార్కుల పనులను ఈ నెలాఖరులోపు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో నాణ్యతతో పాటు అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో ఉండి ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఆర్అండ్‌బీ ఎస్ఈ యుగంధర్, పంచాయతీరాజ్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాస చారి, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, ఆర్డీఓ శ్రీనివాస్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు

# స్వదేశీ ఉద్యమ స్ఫూర్తితో చేనేత ఉత్సవం

కలెక్టర్ బి. చంద్రశేఖర్



**నల్లగొండ ప్రతినిధి ఆగస్టు 7 (నినాదం ):** స్వాతంత్రోద్యమంలో ప్రముఖ పాత్ర పోషించిన చేనేత ప్రాముఖ్యతను ప్రపంచవ్యాప్తంగా తెలియజేసేలా 1905 లో ప్రారంభమైన స్వదేశీ ఉద్యమ స్ఫూర్తితో చేనేత ఉత్సవాన్ని దేశంలో ప్రతి సంవత్సరం ఆగస్టు 7న "జాతీయ చేనేత దినోత్సవం" గా నిర్వహించుకోవడం సంతోషకరమని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం ఆయన నల్గొండ జిల్లా కేంద్రంలోని ఐటీ టవర్ వద్ద ఉన్న కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో అక్కడి నుండి రాఘవేంద్ర కాలనీ వరకు నిర్వహించిన చేనేత ర్యాలీని జిల్లా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ స్వతంత్ర ఉద్యమంలో భాగంగా నిర్వహించిన స్వదేశీ ఉద్యమం సందర్భంగా చేనేత గొప్పతనాన్ని అందరికీ చాటి చెప్పడం జరిగిందని, దాన్ని స్ఫూర్తిగా తీసుకునే తదనంతరం దేశంలో ప్రతి సంవత్సరం ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు,చేనేత రంగానికి వివిధ రకాలుగా సహాయ ,సహకారాలు అందిస్తున్నదని , చేనేత కార్మికులకు బ్యాంకు రుణాలు, పెన్షన్లు అందిస్తున్నదని చెప్పారు. కొండా లక్ష్మణ్ బాపూజీ చేనేత రంగానికి చేసిన సేవలను స్ఫూర్తిగా తీసుకొని వారి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించి చేనేత రంగానికి చేయూతనివ్వాలని చెప్పారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను చేనేత కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ర్యాలీలో చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు గోవిందయ్య, చేనేత సంఘాల నాయకులు కర్నాటి వెంకటేశం, గంజి మురళి ,రాపోలు దత్త గణేష్, చేనేత సంఘాల అధ్యక్షులు పద్మశాలి సంఘం అధ్యక్షుడు పి. సత్యనారాయణ, కర్నాటి యాదగిరి ,పవర్లూమ్స్ జిల్లా ఓనర్ల సంఘం అధ్యక్షులు చేరుపల్లి శ్రీనివాస్, చేనేత కళాకారులు, తదితరులు పాల్గొన్నారు.

# సైదాపూర్‌లో రూ.1.80 కోట్ల అభివృద్ధి పనులకు మంత్రి పొన్నం శంకుస్థాపన






వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటిన మంత్రి
ప్రతి గ్రామంలో సబ్ మార్కెట్ యార్డుల ఏర్పాటుకు హామీ

**హుజురాబాద్, ఆగస్టు 7(నినాదం):** సైదాపూర్ మండల అభివృద్ధికి మరో కీలక అడుగు పడింది. మండల కేంద్రంలోని వెన్కాపల్లిలో రూ. 30 లక్షల వ్యయంతో 100 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాం నిర్మాణానికి, అలాగే రూ. 1.50 కోట్లతో నూతన వ్యవసాయ మార్కెట్ యార్డు భవన నిర్మాణానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేశారు. అనంతరం వనమహోత్సవం సందర్భంగా వెన్కాపల్లి,సైదాపూర్ మండల కేంద్రంలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా ఒక మొక్క నాటాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... సైదాపూర్ మండలంలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న మార్కెట్ యార్డు అభివృద్ధి పనులకు రూ. 1.50 కోట్లతో శ్రీకారం చుట్టామని తెలిపారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూ. 30 లక్షలతో 100 మెట్రిక్ టన్నుల సామర్థ్యమున్న గోదాం నిర్మిస్తున్నామని చెప్పారు. భవిష్యత్తులో ఈ మార్కెట్ యార్డు రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేలా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. మండలంలోని ఏ గ్రామంలోనైనా ఐదు ఎకరాల భూమిని కేటాయిస్తే అక్కడ సబ్ మార్కెట్ యార్డు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి వెల్లడించారు. దీంతో రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను సమీపంలోనే విక్రయించుకునే అవకాశం కలుగుతుందని చెప్పారు. జల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్న మంత్రి, ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వం-ర్షపు నీటిని భూగర్భ జలాల్లోకి పంపించేలా ఇంజెక్షన్ బోర్లు ఏర్పాటు చేయాలని, "జలసిరి" కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమం రైతాంగానికి దీర్ఘకాలికంగా ఎంతో ప్రయోజనకరమని వివరించారు. అలాగే ఐదు ఎకరాలకుపైగా భూమి కలిగిన రైతులు ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారించాలని మంత్రి సూచించారు. సమీపంలోనే ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ అందుబాటులో ఉండటంతో రైతులకు మార్కెటింగ్ సమస్య ఉండదని, ఈ పంట ద్వారా మెరుగైన ఆదాయం పొందే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, మార్కెట్ కమిటీ చైర్మన్ దొంత సుధాకర్, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ఆగస్టు 10వరకు ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్,

# పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ పూర్తి చేయాలి


17న డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్ ప్రచురణ
17 నుంచి సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ
అడిషనల్ కలెక్టర్ సంగీత



**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 7 ( నినాదం ):** భారత ఎన్నికల సంఘం సూచనల మేరకు SIR ప్రక్రియను నిబంధనల ప్రకారం, పారదర్శకంగా పూర్తి చేస్తున్నట్లుఅడిషనల్ కలెక్టర్ సంగీత తెలిపారు. శుక్రవారం సాయంత్రం సంగారెడ్డి కలెక్టరేట్‌లోని మినీ మీటింగ్ హాల్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో అడిషనల్ కలెక్టర్ సంగీత SIR పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఓటర్ల ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణకు భారత ఎన్నికల సంఘం గడువు పొడిగించడంతో ప్రక్రియను పూర్తి చేసేందుకు అదనపు సమయం లభించిందన్నారు. ఆగస్టు 10 వరకు ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్, పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ ప్రక్రియను పూర్తి చేస్తామని తెలిపారు. ఆగస్టు 17న డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్ ప్రచురించనున్నట్లు తెలిపారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై ఏవైనా క్లెయిమ్స్ లేదా అభ్యంతరాలు ఉంటే ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు సమర్పించవచ్చని తెలిపారు. క్లెయిమ్స్, అభ్యంతరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి పరిష్కరిస్తారని పేర్కొన్నారు ఏఎస్‌డీ జాబితాలను మరోసారి క్షుణ్ణంగా పరిశీలించి, రెండు రోజుల్లోగా ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం 1,200కు పైగా ఓటర్లు ఉన్న పోలింగ్ స్టేషన్లకు సంబంధించి అవసరమైన చోట కొత్త పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు కోసం రేషనలైజేషన్ ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో ప్రస్తుతం 1,633 పోలింగ్ స్టేషన్లు ఉండగా, రేషనలైజేషన్ అనంతరం 1,649 పోలింగ్ స్టేషన్లను ప్రతిపాదించినట్లు తెలిపారు. అంటే కొత్తగా 16 పోలింగ్ స్టేషన్లను ప్రతిపాదించినట్లు వెల్లడించారు. జిల్లాలో ఇప్పటివరకు ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ సగటున 79 శాతం పూర్తయిందని అడిషనల్ కలెక్టర్ తెలిపారు. నియోజకవర్గాల వారీగా డిజిటలైజేషన్ పురోగతి నారాయణఖేడ్ లో – 88 శాతశీ,ఆందోల్ – 87 శాతం, జహీరాబాద్ – 82 శాతం,సంగారెడ్డి – 80 శాతం,పటాన్‌చెరు – 67 శాతం పూర్తయిందని వివరించారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా చురుకైన సహకారం అందించాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ పాండు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

NINADAM CINEMA

## 'కొరియన్ కనకరాజు'కు
# అదిరిపోయే ఆరంభం







వరుణ్ తేజ్ హీరోగా నటించిన హారర్ కామెడీ ఎంటర్‌టైనర్ 'కొరియన్ కనకరాజు' బాక్సాఫీస్ వద్ద శుభారంభం చేసింది. వినూత్నమైన ప్రచారంతో విడు దలకు ముందే మంచి హైప్ సంపాదించుకున్న ఈ చిత్రం, ఇప్పుడు బలమైన అడ్వాన్స్ బుకింగ్స్, ప్రీమియర్ షోల నుంచి వచ్చిన మంచి టాక్‌తో మంచి వసూళ్ల దిశగా దూసుకెళ తోంది. వరుస పరాజయాల తర్వాత వరుణ్ తేజ్ కెరీర్‌కు ఈ సినిమా విజయం అత్యంత కీలకంగా మారింది. సినిమాపై ప్రేక్షకుల్లో ఉన్న ఆసక్తికి అడ్వాన్స్ బుకింగ్స్ అద్దం పట్టాయి. ముఖ్యంగా చివరి 24 గంటల్లో టికెట్ల అమ్మకాలు భారీగా పెరిగాయి. ప్రముఖ ఆన్‌లైన్ టికెటింగ్ ప్లాట్‌ఫామ్ బుక్‌మైషోలో మాత్రమే సుమారు 33 వేలకు పైగా టికెట్లు అమ్ముడవడం విశేషం. దీనికి తోడు విడుదలకు ముందు రోజు హైదరాబాద్ సహా పలు నగరాల్లో ఏర్పాటు చేసిన పెయిడ్ ప్రీమియర్ షోలకు అద్భుతమైన స్పందన లభించింది. చాలా షోలు హౌస్‌ఫుల్ కాగా, సినిమా చూసిన ప్రేక్షకులు సోషల్ మీడియా వేదికగా ప్రశంసలు కురిపిస్తున్నారు. ముఖ్యంగా వరుణ్ తేజ్ కామెడీ టైమింగ్, ఆయన నటన సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచాయని ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. సినిమాలోని కొన్ని కామెడీ సన్నివేశాలు థియేటర్లలో కడుపుబ్బా నవ్విస్తున్నాయని, హారర్‌తో కూడిన వినోదం బాగా వర్కౌట్ అయిందని పాజిటివ్ ఫీడ్‌బ్యాక్ వస్తోంది. ప్రమోషన్ల సమయంలో వరుణ్ తేజ్ వ్యక్తం చేసిన ధీమాకు తగ్గట్టుగానే సినిమా ఉందని ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# 'వారణాసి' వీడియో లీక్..




దర్శక ధీరుడు ఎస్ఎస్ రాజమౌళి, సూపర్ స్టార్ మహేష్ బాబు కాంబినేషన్‌లో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న వారణాసి సినిమాకు లీకుల బెడద ఎక్కువగానే ఉంటున్నది. ఈ సినిమా కోసం భారీ సెట్స్ వేసి.. పకడ్బందీగా సన్నివేశాలు చిత్రీకరిస్తున్నప్పటికీ.. ఈ సినిమా కోసం షూట్ చేస్తున్న కీలక సన్నివేశాలను కొందరు నెటిజన్లు సోషల్ మీడియాలో పోస్టు చేసి లీక్ చేస్తున్నారు. ఈ లీకుల బెడదతో చిత్ర యూనిట్ ఆందోళనకు గురి అవుతున్నట్టు సమాచారం. గతంలో కూడా ఈ సినిమాకు సంబంధించిన కొన్ని ఫోటోలు, వీడియోలు మీడియాలో లీక్ అయ్యాయి. అయితే తాజాగా 20 సెకన్ల నిడివి ఉన్న ఓ సన్నివేశాన్ని కొందరు లీక్ చేయడంతో ఆ విషయం సోషల్ మీడియాలో ట్రెండింగ్గా మారింది. దర్శకుడు రాజమౌళి తన సినిమా షూటింగ్ స్పాట్‌ను అన్ని రకాలుగా దిగ్బంధం చేస్తారు. లోపలి విషయాలు బయటకు పొక్కకుండా సాంకేతికంగా చాలా జాగ్రత్తలు తీసుకొంటారు. సినిమా కోసం పనిచేసే ప్రతీ ఒక్కరి నుంచి లీక్‌లు చేయకుండా అగ్రిమెంట్స్ రాయించుకొంటారు. ఎవ్వరైనా విషయాన్ని బయటకు లీక్ చేస్తే చట్టపరమైన చర్యలకు వెనుకాడమనే పాయింట్‌తో కూడిన అగ్రిమెంట్‌పై సంతకాలు కూడా చేయించుకొంటారు. అయినా ఆయన షూటింగ్‌లకు సంబంధించిన లీకుల బెడద తప్పకపోవడం ఆందోళనకరంగా మారింది. వారణాసి సినిమా షూటింగును ఒడిశాలోని ఓ మారుమూల ప్రాంతంలో చిత్రీకరించారు. అయితే కెమెరాకు అందని దూరంలో ఉన్న సన్నివేశాలను షూట్ చేసి వాటిని కొందరు లీక్ చేశారు. ఇక ఈ సినిమా గ్లింప్స్ రిలీజ్ సమయంలో రామోజీ ఫిలిం సిటీలో పకడ్బందీగా ఏర్పాటు చేసిన వేదిక నుంచి దొంగచాటుగా షూట్ చేసి లీక్ చేశారు. గ్లింప్స్‌ను అధికారికంగా రిలీజ్ చేయడానికి ముందే అది సోషల్ మీడియాలో విడుదల కావడం షాకిచ్చింది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన 20 సెకన్ల వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నదనే సమాచారం మరోసారి భారీ షాక్‌కు గురి చేసింది. కొందరు ఈ క్లిప్పింగ్ గురించి సోషల్ మీడియాలో మాట్లాడుతూ.. రక్తంతో రాసిన కథ. దానిని సిరాతో ముందుకు తీసుకెళ్లలేం. ముందుకు వెళ్లాలంటే రక్తమే అడుగుతుంది అనే డైలాగ్స్ ఉన్నట్టు నెటిజన్లు షేర్ చేసుకొంటున్నారు. మహేష్ బాబు షర్ట్ లేకుండా.. రక్తంలో తడిచిన వీడియో ఫ్యాన్స్‌కు క్రేజీగా మారినట్టు తెలుస్తున్నది. అయితే ఈ వీడియోను ఎక్కువగా ప్రచారం జరుగకుండా తొలగించే ప్రయత్నాలు వేగవంతం చేసినట్టు తెలిసింది.

# ఓటీటీ లోకి జన నాయగన్




తమిళనాడు ముఖ్యమంత్రి, కోలీవుడ్ సూపర్ స్టార్ దళపతి విజయ్ నటించిన ఆఖరి చిత్రం 'జన నాయగన్' (తెలుగులో 'జన నాయకుడు'). రాజకీయాల్లోకి పూర్తిస్థాయిలో అడుగుపెట్టడానికి ముందు విజయ్ నటించిన సినిమా కావడంతో, మొదటి నుంచి ఈ ప్రాజెక్ట్‌పై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. వాస్తవానికి ఈ ఏడాది సంక్రాంతికి విడుదల కావాల్సిన ఈ సినిమా సెన్సార్ వివాదాలు, తదితర కారణాల వల్ల పలుమార్లు వాయిదా పడుతూ వచ్చింది. ఎట్టకేలకు అన్ని అడ్డంకులను దాటుకుని జూలై 23న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో థియేటర్లలో విడుదలైంది. మొదటి షో నుంచే మిక్స్‌డ్ టాక్ సొంతం చేసుకున్నప్పటికీ, విజయ్ క్రేజ్ కారణంగా ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద చెప్పుకోదగిన కలెక్షన్స్ రాబట్టింది. ఇప్పుడీ సినిమా ఓటీటీ ఎంట్రీ ఇవ్వడానికి రెడీ అయింది. 'జన నాయగన్' డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ 'జీ5' ఫ్యాన్సీ రేటుకు దక్కించుకుంది. లేటెస్ట్ రిపోర్ట్స్ మేరకు, ఈ సినిమా ఆగస్టు 21వ తేదీ నుంచి జీ5 లో స్ట్రీమింగ్ కానున్నట్లు తెలుస్తోంది. ఒరిజినల్ తమిళ వెర్షన్‌తో పాటు తెలుగు, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ఒకేసారి ఈ చిత్రాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు. త్వరలోనే దీనిపై ఓటీటీ సంస్థ నుంచి అధికారిక ప్రకటన రానుంది. మాస్ చిత్రాల దర్శకుడు హెచ్. వినోద్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ భారీ యాక్షన్ డ్రామాను కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కె. నారాయణ దాదాపు రూ. 500 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మించారు. ఈ సినిమాలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటించగా, మమితా బైజు ఒక ముఖ్యమైన పాత్రలో ఆకట్టుకుంది. బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ పవర్‌ఫుల్ విలన్‌గా మెప్పించారు. వీరితో పాటు ప్రకాష్ రాజ్, ప్రియమణి, గౌతమ్ వాసుదేవ్ మీనన్, నాజర్, నరైన్ తదితరులు కీలక పాత్రలు పోషించారు.

# బిగ్ బాస్'లోకి సాధనా నాయుడు!?



బిగ్గెస్ట్ రియాలిటీ షోగా పాపులర్ అయిన 'బిగ్ బాస్' ఇప్పుడు పదో వసంతంలోకి అడుగుపెడుతోంది. ఇప్పటికే తొమ్మిది సీజన్లను అత్యంత విజయవంతంగా పూర్తి చేసుకున్న ఈ రియాలిటీ షో, ఇప్పుడు 'బిగ్ బాస్ 10: దశావతారం' అనే ఆసక్తికరమైన కాన్సెప్ట్‌తో తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు ముస్తాబవుతోంది. ప్రతి సీజన్‌లో సినిమా ప్రమోషన్స్, టాలీవుడ్ తారల సందడితో కోలాహలంగా మారే బిగ్ బాస్ వేదిక, ఈసారి పదింతల వినోదాన్ని పంచేందుకు సిద్ధమైంది. బిగ్ బాస్ 10కు సంబంధించి గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో ఎన్నో ఊహాగానాలు బయటకొస్తున్నాయి. ఈ క్రమంలోనే ఈ సారి బిగ్ బాస్ హౌస్ లోకి ఓ హాట్ లేడీ ఎంట్రీ ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఆమె పేరు సాధనా నాయుడు. సోషల్ మీడియాలో తన ప్రత్యేకమైన కంటెంట్‌తో గుర్తింపు తెచ్చుకున్న ఇన్‌ఫ్లూయెన్సర్లలో ఈమె ఒకరు. ఫ్యాషన్, బ్యూటీ, లైఫ్‌స్టైల్, ట్రావెల్‌తో పాటు రోజువారీ జీవితానికి సంబంధించిన ఆసక్తికరమైన వీడియోలు, ఫోటోలు పంచుకుంటూ ఆమె సోషల్ మీడియాలో మంచి ఫాలోయింగ్‌ను సంపాదించుకున్న ఈ పిల్ల ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ వంటి వేదికల్లో సందడి చేస్తుంటుంది. సోషల్ మీడియాలో ట్రెండ్స్‌కు అనుగుణంగా కొత్త తరహా కంటెంట్‌ను అందించడం ఆమె ప్రత్యేకత. అలాగే తన స్టైలిష్ ప్రెజెంటేషన్, ఆకట్టుకునే ఫోటోషూట్లు, ట్రెండింగ్ రీల్స్‌తో నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తుంటారు సాధనా నాయుడు. డిజిటల్ క్రియేటర్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈ బ్యూటీకి బిగ్ బాస్ ఆఫర్ వచ్చిందని, అందుకు ఆమె అంగీకారం కూడా ఇచ్చిందని టాక్. ఈ పేరు బయటకు రావడంతో ఆమె ఇన్‌స్టాగ్రామ్ పేజీ కోసం వెతికే జనం అమాంతం పెరిగిపోయారు. ఆ పేజీలో సాధనా నాయుడు ఫొటోస్ చూసి.. సోషల్ మీడియాలోనే ఈ రేంజ్ మసాలా దట్టిస్తోందంటే ఇక బిగ్ బాస్ హౌస్ లో రచ్చే ఉంటుందేమో అని అంతా అంచనా వేస్తున్నారు.

# విడుదలైన 'ది ప్యారడైజ్' టీజర్

టాలీవుడ్ హీరో నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'ది ప్యారడైజ్' సినిమా నుంచి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న టీజర్ విడుదలైంది. షూటింగ్ చివరి దశకు చేరుకున్న వేళ వచ్చిన ఈ టీజర్ సోషల్ మీడియాలో మంచి స్పందన అందుకుంటోంది. టీజర్‌లో నాని ఇప్పటివరకు కనిపించని మాస్ లుక్‌లో కనిపించారు. యాక్షన్ సన్నివేశాలు సినిమాపై అంచనాలను మరింత పెంచేలా ఉన్నాయి. చేతి నిండా బ్లేడ్లు పట్టుకుని కనిపించే సన్నివేశం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 'దిష్టంతా పోవాలే' అంటూ నాని చెప్పిన డైలాగ్ అభిమానులను బాగా ఆకట్టుకుంటోంది. టీజర్‌కు అనిరుధ్ అందించిన నేపథ్య సంగీతం మరో హైలెట్‌గా నిలిచింది. ప్రతి యాక్షన్ సీన్‌కు తగ్గట్టుగా వచ్చిన బీజీఎం టీజర్‌కు మరింత బలం తీసుకొచ్చింది. విజువల్స్ కూడా ఆకట్టుకునేలా ఉన్నాయి. ఈ సినిమాలో నాని సరసన కాయాదు లోహర్ కథానాయికగా నటిస్తున్నారు.




Printed, Published & Owned by B.Srinivas, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar Medchel,
Malkajgiri Dist. Hyderabad 500037 (T.S)Published at 6-3-439, kisannagar, Karimnagar-505001 (T.S), Editor : B.Srinivas, PRGI.REGN.NO. APTEL /2003/11288, CELL : +91 8333068787